
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పనితీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 146

శుక్రవారం 16-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL
ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గురువారం ఢిల్లీలోని ఎర్రకోటలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

# 'పరిమితం' దేశహితం

జనాభా నియంత్రణకు రాష్ట్రాలూ నడుం బిగించాలి

దళాల సమన్వయానికి సీడీఎస్‌ను నియమిస్తాం

జమ్మూ కశ్మీర్‌పై ప్రజలు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చా

**ఎర్రకోటలో ఆరోసారి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం**

జనాభా పెరిగితే రాబోయే తరాలకు లెక్కలేనన్ని సమస్యలు, సవాళ్లు ఎదురవుతాయి. జనాభా విస్ఫోటనాన్ని నియంత్రించేందుకు కేంద్రంతోపాటు రాష్ట్రాలూ చర్యలు చేపట్టాలి. ఒక్కో కుటుంబంలో మనుషులు ఎక్కువగా ఉంటే వారికి సరైన విద్య, వైద్య సౌకర్యాలు అందవు. ఇప్పటికే దేశంలో కొంత భాగం ప్రజలు చిన్న కుటుంబాలుగా ఉంటూ సుఖంగా జీవిస్తున్నారు. వారిని చూసి మిగతా వారు నేర్చుకోవాలి. దీన్ని అనేక మంది వ్యతిరేకించినా.. దేశ ప్రజలకు మంచి భవిష్యత్తును అందివ్వడం కోసం ఇది తప్పదు.

**కశ్మీరీల కలలకు రెక్కలు**

జమ్మూకశ్మీర్ అంశంలో కేవలం ప్రజలు అప్పజెప్పిన బాధ్యతను పూర్తి చేశా. జమ్మూకశ్మీర్, లదాఖ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన, వారి కలలకు కొత్త రెక్కలను ఇవ్వాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. 370వ అధికరణం రద్దవ్వడంతో ఇప్పుడు భారత్ ఒక దేశం, ఒకే రాజ్యాంగంగా మారింది. సాహసోపేత, పెద్ద నిర్ణయాలు తీసుకోవడానికి మా ప్రభుత్వం సంశయించదు.

**'సీడీఎస్' రూపకల్పన..**

త్రివిధ దళాలకు కలిపి కొత్తగా ఓ అధిపతిని నియమిస్తాం. సీడీఎస్ (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్)గా నియమితులయ్యే వ్యక్తి సైనిక, వాయుసేన, నౌకాదళానికి సంయుక్త అధిపతిగా ఉంటారు. త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచడం కోసం సీడీఎస్‌ను నియమించాల్సిన సమయం వచ్చింది. సీడీఎస్ నియామక విధి విధానాలను మా ప్రభుత్వం ఇంకా రూపొందిస్తోంది.

**దేశంలోనే విహారం**

ఏడాదికి దాదాపు 2 కోట్ల మంది భారతీయులు విదేశాలకు విహారయాత్రలకు వెళ్తున్నారు. వారంతా 75వ స్వాతంత్ర్య దినోత్సవం వచ్చే నాటికి దేశంలోనే కనీసం 15 పర్యాటక కేంద్రాలను సందర్శించాలి. దీంతో దేశీయంగా పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభించి దేశం అభివృద్ధి చెందుతుంది.

**ఒకే దేశం.. ఒకే ఎన్నిక..**

దేశాన్ని గొప్పగా మార్చేందుకు లోక్‌సభతోపాటు అన్ని శాసనసభలకూ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి. ప్రస్తుతం జమిలి ఎన్నికల ప్రస్తావన వస్తుండటం శుభపరిణామం. ఒక దేశం, ఒక ఎన్నిక అంశంపై అన్ని భాగస్వామ్య పక్షాల్లో చర్చలు జరగాలి.

12లో


గురువారం గోల్కొండ కోటలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# కొత్త చట్టం.. జనహితం

**బూజు పట్టిన రెవెన్యూ చట్టంతో రైతులు, ప్రజలకు అపార నష్టం**

**అవినీతి, అలసత్వానికి ఆస్కారం లేకుండా కొత్త చట్టానికి రూపకల్పన**

**త్వరలో జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెడతాం**

**స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో స్పష్టం చేసిన సీఎం కేసీఆర్**

**గోల్కొండ కోటలో జాతీయ పతాకం ఆవిష్కరణ**

**సాక్షి, హైదరాబాద్:** 'బూజు పట్టిన పాత రెవెన్యూ చట్టాలు రైతులు, ప్రజలకు అపార నష్టం కలిగించాయి. ఈ నష్టాన్ని నివారించుకునేందుకు కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించడంలో ప్రభుత్వం నిమగ్నమైంది. అవినీతికి, అలసత్వానికి అవకాశం లేని నూతన రెవెన్యూ చట్టాన్ని త్వరలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశ పెడతాం'అని సీఎం కేసీఆర్ ప్రకటించారు. 'పరిపాలనా సంస్కరణలతోనే ప్రజలకు మెరుగైన పాలన అందించడం సాధ్యమవుతుంది. అవినీతిరహిత సుపరిపాలన అందించడానికి ప్రస్తుతమున్న చట్టాలు సరిపోవు. పాత చట్టాలను సమూలంగా మార్చాల్సిన అవసరమొచ్చింది. అందుకే ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని, నూతన పురపాలక చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ కొత్త చట్టాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో పరిశుభ్రమైన, పచ్చదనం వెల్లివిరిసే గ్రామాలు, మునిసిపాలిటీలను తయారు చేసుకోగలం'అని కేసీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం చరిత్రాత్మక

మిగతా 2వ పేజీలో ▶






## ఆరేళ్లు.. ఆరు తలపాగాలు

12లో






# బస్సు చార్జీలు పెంచాల్సిందే!



- బస్సు చార్జీలు పెంచితే తప్ప సిబ్బందికి వేతనాలు చెల్లించలేమని ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఈ నెల వేతనాలు చెల్లించే పరిస్థితి లేదని, ప్రతినెలా వేతనాలకు తీవ్ర ఇబ్బంది అవుతోందని, వెంటనే చార్జీలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ 15 శాతం మేర చార్జీలు పెంచేందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది.

- వివరాలు 14లో

# బొట్టు నీరు పెరగలే...



- ఓవైపు ఎగువ నుంచి భారీ వరదల కారణంగా రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండలుగా మారుతున్నా భూగర్భ జలమట్టాల్లో ఏమాత్రం పెరుగుదల కనిపించడం లేదు. నలభై శాతం మేర లోటు వర్షపాతం కారణంగా పాతాళ గంగ పైకి రానేలేదు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జూలై చివరి నాటికి రాష్ట్రంలో సరాసరి భూగర్భ మట్టాలు 3.20 మీటర్ల దిగువనే ఉన్నాయి.

- వివరాలు 4లో






# 'వైరల్' నరకం!

**3 నెలల్లో 40 లక్షల మంది ఆసుపత్రిలో చేరిక**

- ఇందులో సగం మంది చిన్నారులే
- ఇవన్నీ సర్కారు ఆసుపత్రుల లెక్కలే..
- ప్రైవేటు ఆసుపత్రుల లెక్కలు కలిపితే మూడు రెట్లు

**సాక్షి, హైదరాబాద్:** చలి జ్వరాలతో తెలంగాణ వణికిపోతోంది. 33 జిల్లాల్లోనూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వరం బాధితులతో కిటకిటలాడుతున్నాయి. జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి (అప్పర్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్) తదితర లక్షణాలతో కూడిన జ్వరంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 3 నెలల్లోనే 40 లక్షల మంది జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల బారినపడ్డట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వైద్య సేవలు పొందిన వారిలో సుమారు 50% మంది చిన్నారులే. ఇవి కేవలం ప్రభుత్వం వద్ద నమోదైన గణాంకాలు మాత్రమేనని, ప్రైవేటు క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు దీనికి మూడింతలు ఉంటారని వైద్యవర్గాల అంచనా. వాతావరణ మార్పుల కారణంగానే రాష్ట్రవ్యాప్తంగా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఏప్రిల్ నెల చివర నుంచి ఈనెల ఐదో తేదీ వరకు సేకరించిన గణాంకాలను పరిశీలిస్తే ముక్కునవేలేసుకునే వివరాలు వెల్లడయ్యాయి. ఈ మూడున్నర నెలల్లో వైరల్ జ్వరాలతో లక్షా 70 వేల మంది

మిగతా 4వ పేజీలో ▶

**ఇదండీ సంగతి**



అసలే పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. యుద్ధమంటే.. ఆర్థిక వ్యవస్థ మన అంతు చూస్తుంది సార్!

## ఆర్థిక వ్యవస్థకు మోదీ టానిక్!

- దేశంలో ఆర్థిక మంద గమన పరిస్థితులు విస్తరిస్తుండటం, ఉద్యోగాలు, సంపదకు విఘాతం కలుగుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. రంగాలవారీ ఉద్దీపన చర్యలను ప్రభుత్వం ప్రకటించవచ్చన్న అంచనాల నేపథ్యంలో ఈ భేటీ జరగడం గమనార్హం.

బిజినెస్‌లో






గురువారం గోల్కొండలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో గౌరవ వందనం చేస్తున్న పోలీసులు



జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి

## క్లుప్తంగా...



### రాగల మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాగల మూడు రోజులు రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయవ్య ఛత్తీస్‌గఢ్ దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం గురువారం ఉదయం తీవ్ర అల్పపీడనంగా మారి వాయవ్య మధ్యప్రదేశ్ దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. దీనికి అనుబంధంగా 7.6 కి.మీ ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. రాష్ట్రంలోని కామారెడ్డి, కుమురం భీం, నిజామాబాద్ జిల్లాలో అధిక వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.

**వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం:** కామారెడ్డి జిల్లాలోని గంధారిలో 7 సెం.మీ, నాగరెడ్డిపేట్ 6 సెం.మీ, ఎల్లారెడ్డి 4 సెం.మీ, నిజాంసాగర్ 4 సెం.మీ, బికునూర్ 4 సెం.మీ, కామారెడ్డి 3 సెం.మీ, లింగంపేట 3 సెం.మీ, కుమురం భీం జిల్లాలోని బెజ్జూరులో 7 సెం.మీ, దహేగాన్ 6 సెం.మీ, కాగజ్‌నగర్ 5 సెం.మీ, నిజామాబాద్ జిల్లాలోని దార్‌పల్లి 6 సెం.మీ, డిచ్‌పల్లి 5 సెం.మీ, బాల్కొండ 4 సెం.మీ, వర్ని 4 సెం.మీ, నావిపేట్ 4 సెం.మీ, మక్లూర్ 4 సెం.మీ, కోట్గిరి 3 సెం.మీ, పాపన్నపేట(మెదక్) 5 సెం.మీ, జూలపల్లి(పెద్దపల్లి) 3 సెం.మీ, పెగడపల్లి(జగిత్యాల) 3 సెం.మీ, జూలపల్లి(పెద్దపల్లి)3 సెం.మీ. వర్షం కురిసింది.

### భాషా పండితులకు 'రాష్ట్రపతి సర్టిఫికెట్ ఆఫ్ హానర్'

**సాక్షి, న్యూఢిల్లీ:** సంస్కృతం, పర్షియన్, అరబిక్, పాళీ, ప్రాకృతం, క్లాసికల్ తెలుగు, క్లాసికల్ కన్నడ, క్లాసికల్ మలయాళం, క్లాసికల్ ఒడియా భాషల అభివృద్ధికి కృషిచేసిన ఆయా భాషా పండితులకు 'రాష్ట్రపతి సర్టిఫికెట్ ఆఫ్ హానర్'ను భారత రాష్ట్రపతి ప్రకటించినట్లు కేంద్ర మానవ అభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తెలుగు ప్రముఖులు శ్రీపాద సత్యనారాయణ మూర్తికి సంస్కృతం విభాగంలో, ప్రొఫెసర్ రవ్వా శ్రీహరికి క్లాసికల్ తెలుగు భాషా విభాగంలో ఈ సర్టిఫికెట్ లభించింది. అలాగే 2019 సంవత్సరానికి గాను క్లాసికల్ తెలుగు భాషా విభాగంలో డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, డాక్టర్ వి.త్రివేణి, డాక్టర్ కె.ప్రభాకర్‌లకు మహర్షి భద్రాయన్ వ్యాస సమ్మాన్ అవార్డు లభించింది.

### 26 నుంచి పీఈసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ), బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజ్, కాకతీయ యూనివర్సిటీలోని పీజీ అడ్మిషన్స్ డైరెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. తేదీల వారీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సిన వారి ర్యాంకుల వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని వివరించారు. 26 నుంచి 29వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించామని వెల్లడించారు.

### త్వరలో గ్రూప్-2 ఫలితాలు: ఘంటా చక్రపాణి

**సాక్షి, హైదరాబాద్:** గ్రూప్–2 ఫలితాలు త్వరలో వెల్లడిస్తామని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. గురువారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం అన్ని ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. మెడికల్ అండ్ హెల్త్‌కు సంబంధించినవి కొన్ని కోర్టు కేసులో ఉన్నాయని, కేసులు తేలగానే వాటినీ భర్తీ చేస్తామన్నారు. ఇప్పటివరకు టీఎస్‌పీఎస్సీ 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని పేర్కొన్నారు.

# కొత్త చట్టం.. జనహితం

▶ మొదటి పేజీ తరువాయి

గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సరైన దిశలో పెట్టేందుకు గడిచిన ఐదేళ్లలో చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాలు సఫలం అయ్యాయని ఆయన తెలిపారు. 'తెలంగాణలో గత ఐదేళ్ళలో పునర్నిర్మాణ ప్రణాళికను ఒక యజ్ఞంలా నిర్వహించాం. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడం కోసం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేశాం. విద్యుత్తు, తాగునీరు, రహదారుల నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. తెలంగాణ ఒక ఆదర్శ రాష్ట్రంగా దేశం ముందు గర్వంగా నిలబడింది'అని తెలియజేశారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

### సుస్థిర ఆర్థికాభివృద్ధి

గత ఐదేళ్లుగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి స్థిరంగా కొనసాగుతోంది. పటిష్టమైన క్రమశిక్షణ వల్ల అవినీతికి ఆస్కారం లేకుండా సత్వరమైన నిర్ణయాలతో ఈ లక్ష్యాన్ని మనం సాధించగలిగాం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నివేదిక ప్రకారం, 2018–19 ఆర్థిక సంవత్సరంలో 14.84% వృద్ధిరేటుతో స్థూల రాష్ట్రీయ జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో మన రాష్ట్రం ముందు వరుసలో ఉంది. ఆదాయవృద్ధిలో స్థిరత్వం వల్ల సమకూరిన వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించడం వల్ల రాష్ట్ర సంపద ఐదేళ్లలో రెట్టింపయింది. రాష్ట్రం ఏర్పడిన నాడు తెలంగాణలో రూ.4లక్షల కోట్ల విలువైన సంపదుంటే, నేడు రూ.8.66లక్షల కోట్లకు చేరుకోవడం మన ఆర్థిక ప్రగతికి సంకేతంగా నిలుస్తుంది. గడిచిన ఐదేళ్ళలో ఐటీ ఎగుమతులు రూ.52వేల కోట్ల నుంచి లక్షా పదివేల కోట్ల రూపాయలకు చేరుకోవడం మనం సాధించిన ప్రగతికి అద్దం పడుతుంది.

### విద్యుత్ వారోత్సవాలు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 60 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యుత్‌శాఖ ప్రజల భాగస్వామ్యంతో పవర్ వీక్ నిర్వహించుకోవాలి. వంగిన కరెంట్ పోల్స్‌ను, వేలాడే వైర్లను సరిచేయాలి. తుప్పుపట్టిన పాత స్తంభాల స్థానంలో కొత్త పోల్స్ వేయాలి. అన్ని గ్రామాలు, పట్టణాలకు అవసరమైన స్తంభాలు, వైర్లను ప్రభుత్వమే సమకూరుస్తుంది.

### ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు

రాష్ట్రంలోని ప్రతి పట్టణం, ప్రతి గ్రామం తమకు అవసరమైన నర్సరీలను 60 రోజుల కార్యాచరణలో భాగంగా స్థానికసంస్థల ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేసుకోవాలి. మొక్కల సంఖ్యను, మొక్కల రకాలను, ఇతర విషయాలలో జిల్లా గ్రీన్ కమిటీ (హరిత కమిటీ) అందించే సూచనలను కచ్చితంగా పాటించాలి. పట్టణ, గ్రామబడ్జెట్లో 10% నిధులను పచ్చదనం పెంచే పనుల కోసం కేటాయించాలి. నిర్దిష్టమైన విధానంలో గ్రీన్ కమిటీ సూచనల మేరకు మొక్కలు నాటాలి. ప్రజల చేత నాటించాలి. పట్టణాల్లో, గ్రామాల్లో ప్రతీ ఇంటికీ ప్రజలు కోరుకునే 6మొక్కలను సరఫరా చేయాలి. ప్రజలంతా ఆ మొక్కలను చక్కగా కాపాడి జాగ్రత్తగా పెంచేలా ప్రేరణ కలిగించాలి.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేసీఆర్

### తండాల్లో తొలిసారిగా జెండా వందనం

గిరిజన తండాలు, ఆదివాసీ గూడేలు, మారుమూల పల్లెలను ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా మార్చడంతో ఇవాళ మొదటి సారిగా అక్కడ సర్పంచ్‌లు సగర్వంగా జాతీయ పతాకాన్ని ఎగురేసుకుంటున్న దృశ్యం ఆవిష్కృతమైంది.

### ఆరోగ్య తెలంగాణ దిశగా..

ప్రజలందరికీ సంపూర్ణంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి.. వీటి ఫలితాల ఆధారంగా తెలంగాణ ఆరోగ్య సూచిక 'హెల్త్ ప్రొఫైల్'తయారు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. జంట నగరాల్లో బస్తీ దవాఖానాల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

### పంచాయతీరాజ్‌లో ఖాళీలన్నీ భర్తీ

పల్లెలను ప్రగతి కేంద్రాలుగా, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పంచాయతీ రాజ్ విభాగాన్ని సంస్థాగతంగా బలోపేతం చేయాలని నిర్ణయించింది. 60రోజుల ప్రత్యేక కార్యాచరణలో ఒక ఆదర్శవంతమైన విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఈ విధానాన్ని అనుసరించి గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి వార్షిక, పంచవర్ష ప్రణాళికలను ఆయా పాలక మండళ్లు రూపొందించాలి. ఈ ప్రణాళికలు ఖచ్చితంగా గ్రామసభల ఆమోదం పొందాలి. దానికి అనుగుణంగానే స్థానిక సంస్థలు నిధులు ఖర్చు చేయాలి. తద్వారా పల్లెలు, పట్టణాలు ఓ పద్ధతి ప్రకారం ప్రగతిపథంలో పయనించేందుకు వీలుంటుంది. పంచాయతీరాజ్ శాఖలోని అన్ని విభాగాల్లో అన్ని ఖాళీలను వేగవంతంగా భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కొత్త జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి ఉద్యోగ నియామకాల్లో స్థానిక కోటాను 95 శాతానికి పెంచాం.

### పింఛన్లు రెట్టింపు

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆసరా పింఛన్లను రెట్టింపు చేసుకున్నాం. దివ్యాంగులకు 3,016 రూపాయలు, ఇతరులకు 2,016 రూపాయల పింఛన్ ఇస్తున్నాం. వృద్ధాప్య పింఛన్ వయో పరిమితిని 65 ఏళ్ల నుంచి 57ఏళ్లకు తగ్గించి పింఛన్‌ను అందించాలని నిర్ణయించాం. ఈ మేరకు అర్హుల జాబితా రూపొందించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

## అదనంగా 575 టీఎంసీలు

గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల వచ్చే జూన్ నుంచి తెలంగాణ రైతాంగం అదనంగా 575 టీఎంసీల నీటిని నికరంగా ఉపయోగించుకునే అవకాశం కలుగుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఏటా 400 టీఎంసీల నీరు లభిస్తుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు ద్వారా 100 టీఎంసీలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు దేవాదుల ద్వారా 75టీఎంసీల నీటిని నికరంగా వాడుకోవడానికి వీలుంటుంది. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా వచ్చే ఏడాది నుంచే సాగునీరు అందించడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. జూరాలతో కలిపి పాలమూరు జిల్లాలో నేడు 11లక్షల 20వేల ఎకరాలకు సాగునీరందేలా చేసుకోగలుగుతున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వీలైనంత వేగంగా నిర్మించి ఉమ్మడి పాలమూరుతోపాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందిస్తామని తెలియచేస్తున్నాను.

## మన రైతాంగ విధానం దేశానికే ఆదర్శం

తెలంగాణ ప్రభుత్వ రైతాంగ విధానం దేశానికి ఆదర్శంగా మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు పథకం ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని ఎకరానికి ఏడాదికి 8వేల నుంచి 10వేల రూపాయలకు పెంచి, అందిస్తున్నాం. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో రైతుబీమా పథకాన్ని కొనసాగిస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయల వరకున్న పంట రుణాలను మాఫీ చేయడం కోసం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక

కొత్త పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల అమలుతో నూతన ఒరవడిని ప్రవేశ పెట్టడానికి 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తోంది. ఫైనాన్స్ కమిషన్ల గ్రాంట్ నిధులను ఈ ప్రణాళిక అమలుకు ముందే స్థానిక సంస్థలకు విడుదల చేయాలని నిర్ణయించింది. 60రోజుల ప్రణాళికలో ప్రజాప్రతినిధులు, అధికారులు.. ప్రజల భాగస్వామ్యం ద్వారా గ్రామాలు, పట్టణాల రూపురేఖల్ని మార్చాలి. మొదటి దశలో గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి. ప్రజాసంఘా లు, ప్రజల భాగస్వామ్యంతో సమగ్రంగా చెత్తనిర్మూలనకు నడుం కట్టాలి. ఎక్కడ పడితే అక్కడ పెరిగిపోయిన పిచ్చిమొక్కలు. కూలిపోయిన ఇండ్ల శిథిలాలు. పాడుబడ్డ పశువుల కొట్టాలు. మురుగునీటి నిల్వతో దోమలను సృష్టిస్తున్న గుంతలు, పాడుపడిన బావులు.. ఇవీ రాష్ట్ర వ్యాప్తంగా కనినిపిస్తున్న దృశ్యాలు. వీటన్నింటినీ ఈ 60 రోజుల్లో తొలగించుకోవాలి. నిరుపయోగంగా ఉన్న బోరు బావులను వెంటనే పూడ్చివేయాలి.



గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో ముచ్చటిస్తున్న సీఎం కేసీఆర్



కేసీఆర్‌తో జానారెడ్డి కరచాలనం. చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

# ఆహ్లాదకరంగా 'ఎట్ హోం'

- సుదీర్ఘంగా చర్చించిన సీఎం, గవర్నర్
- హాజరైన నేతలు, అధికారులు

**సాక్షి, హైదరాబాద్:** స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ నరసింహన్ దంపతులు గురువారం రాజ్‌భవన్‌లో ఇచ్చిన తేనీటి విందుకు (ఎట్ హోం) సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు మంత్రులు, వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. సుమారు గంటన్నర పాటు సాగిన ఎట్‌హోం కార్యక్రమంలో గవర్నర్ దంపతులు నరసింహన్, విమలా నరసింహన్ అతిథుల వద్దకు వెళ్లి పేరుపేరునా స్వాగతం పలికారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభం కాగా.. సీఎం కేసీఆర్‌తోపాటు గవర్నర్ దంపతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్నారు. తమిళనాడు మాజీ గవర్నర్, మాజీ సీఎం రోశయ్యతో పాటు అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ పార్టీల నేతలను పలకరించిన కేసీఆర్.. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ కంపెనీ అధినేత బీవీఆర్ మోహన్‌రెడ్డితో సుదీర్ఘంగా సంభాషించారు. అతిథులను పలకరించిన అనంతరం.. గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ సుమారు 25నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఇద్దరి నడుమ ఆసక్తికర చర్చ సాగిందని చెబుతున్నప్పటికీ.. భేటీ వివరాలు మాత్రం మీడియాకు వెల్లడి కాలేదు.

### కలిసే సందర్భం రావట్లేదు!

ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వివిధ పార్టీల నేతలను గవర్నర్, సీఎం కేసీఆర్ పలకరించారు. ఆహ్లాదకరంగా సాగిన కార్యక్రమంలో గవర్నర్, సీఎం, నేతల నడుమ పలుసార్లు ఆసక్తికర సంభాషణ జరిగింది. సీఎల్పీ మాజీ నేత జానారెడ్డిని ఎలా ఉన్నారంటూ సీఎం కేసీఆర్ పలకరించగా.. ఇప్పుడు మనం కలిసే సందర్భం రావడం లేదని జానారెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో అసెంబ్లీలో అప్పుడో, ఇప్పుడో కలిసే సందర్భం వచ్చేదని కేసీఆర్ వ్యాఖ్యానించారు. మమ్ములను కూడా దృష్టిలో పెట్టుకోండని గవర్నర్‌తో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ వ్యాఖ్యానించగా.. అలాంటిదేమీ లేదని గవర్నర్ అన్నారు. మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి, గవర్నర్ మధ్య కూడా సుమారు 2 నిమిషాల పాటు ఆసక్తికర సంభాషణ కొనసాగింది.

### తరలివచ్చిన ప్రముఖులు

ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన పలువురు నేతలతో పాటు, ప్రభుత్వాధికారులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఉమ్మడి ఏపీ శాసన మండలి మాజీ చైర్మన్ చక్రపాణి, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్, సంతోష్ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి, షబ్బీర్ అలీ, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, క్రీడాకారులు మిథాలీరాజ్, పుల్లెల గోపీచంద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, సిటీ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ అమెరికా పయనం

**ఈ నెల 24న తిరిగి రాక**

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి గురువారం రాత్రి అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. విజయవాడలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మధ్యాహ్నం 3.15 గంటల ప్రాంతంలో రాజ్‌భవన్‌లో 'ఎట్‌హోం' కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచే సాయంత్రం 4.10 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ లోటస్‌పాండ్‌లోని తన నివాసానికి వెళ్లి కుటుంబీకులతో కలసి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాత్రి 7.40 గంటలకు చేరుకున్నారు. రాత్రి 9.50 నిమిషాలకు వాషింగ్టన్‌కు బయలుదేరారు. ఈ నెల 24వ తేదీన సీఎం తిరిగి తాడేపల్లికి చేరుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

# గోల్కొండ 'కళ'కళ!

**సాక్షి, హైదరాబాద్:** గోల్కొండ కోట వేదికగా స్వాతంత్య్ర దినోత్సవం కన్నులపండువగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వందల మంది కళాకారులు గోల్కొండ కోటపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే కళారూపాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. నగారా, బోనాల కోలాటం, ఒగ్గు–డోలు, థింసా, బంజారా, కొమ్ము కొయ్య, బుస్సాడీ, పులివేశాలు, బోనాలు, చిందు–యక్షగానం, కోలాటం, డప్పులు, పేరిణీ, రాష్ట్ర కోయ కళాకారుల బృందాలు ఒకే వేదికపై ఏక కాలంలో ప్రదర్శనలిచ్చి ఆకట్టుకున్నారు. గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్న తరుణంలో డప్పు చప్పుళ్ల హోరుతో 16 కళారూపాలను ఏకకాలంలో ప్రదర్శిస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల విద్యార్థినులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన సైతం ఆకట్టుకుంది.

### ప్రగతి భవన్‌లో జెండా వందనం

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీఎం క్యాంపు కార్యాలయమైన ప్రగతి భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానానికి చేరుకుని అక్కడి సైనిక స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం వుంచి నివాళి అర్పించారు. అక్కడి విజిటర్స్ బుక్‌లో సంతకం చేశారు. అనంతరం గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 15వ బెటాలియన్ సహాయ కమాండెంట్ శ్రీధర్ రాజా, మంచిర్యాల డీసీపీ నేతృత్వంలో నిర్వహించిన కవాతు అందరినీ ఆకట్టుకుంది. కవాతులో పాల్గొన్న ఒడిశా పోలీసు కాంటింజెంట్‌కు ఈ సందర్భంగా కేసీఆర్ ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్ రెడ్డితో పాటు ఇతర సీనియర్ అధికారులు, వీవీఐపీలు పాల్గొన్నారు.



రాఖీ పండుగ సందర్భంగా గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి షర్మిల

## పేపర్ బేబీ



ఇదేదో మోడ్రన్ ఫ్యాషన్ కాదు.. ఫ్యాషన్ షో అంతకన్నా కాదు. ఈ చిన్నారి వేసుకున్న డ్రెస్‌ను చూసిన వారంతా వావ్ అన్నారు. కొత్తగూడెంలో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు బూర్గంపాడు పాఠశాలకు చెందిన సాలేహా న్యూస్‌పేపర్ డ్రెస్‌తో దర్శనమిచ్చి ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటో జర్నలిస్ట్, భద్రాద్రి కొత్తగూడెం

## భళే బాసులు!



కలెక్టర్ ఆర్వీ కర్ణన్



కమిషనర్ తఫ్సీర్ ఎక్బాల్

వీరిద్దరూ జిల్లా బాస్‌లు. ఒకరు ఖమ్మం కలెక్టర్ ఆర్వీ కర్ణన్.. మరొకరు నగర పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఎక్బాల్. వీరిద్దరు చిన్నపిల్లల్లా కాసేపు బ్యాటరీ బైక్‌లు నడిపి ముచ్చట తీర్చుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు బ్యాటరీ బైక్‌లను రూపొందించి.. ప్రదర్శన కోసం తీసుకొచ్చారు. వాటిని ఆసక్తిగా తిలకించిన కలెక్టర్, కమిషనర్ వాటిపై కాసేపు మైదానంలో తిరిగారు. వీరు బైక్ నడపడాన్ని చూసి అక్కడున్న ప్రజలు ఆశ్చర్యపోయారు.

– సాక్షి ఫొటో జర్నలిస్ట్, ఖమ్మం

# మట్టపల్లి ఆలయంలోకి వరద నీరు

### ఆలయం మూసివేత.. ఉత్సవ, కల్యాణ మూర్తుల తరలింపు

- చుట్టూ ఉన్న కరకట్టకు లీకేజీలతో తలెత్తిన పరిస్థితి
- పులిచింతల బ్యాక్ వాటర్‌తో ఆలయంలోకి వరద
- వందల ఎకరాల్లో నీట మునిగిన పత్తి, వరి

**సాక్షి ప్రతినిధి, సూర్యాపేట:** కృష్ణా నది మహోగ్ర రూపంతో పులిచింతల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఈ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలం మట్టపల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీనర్సింహస్వామి గర్భాలయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఆలయం చుట్టూ ఉన్న కరకట్టకు లీకేజీలు పెరగడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో పాలక మండలి, ఆలయాధికారులు గుడిని మూసివేస్తున్నట్లు ప్రకటించారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గిన తర్వాతే ఆలయం తెరుస్తామని ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ ఉదయ్‌కుమార్‌లు తెలిపారు. స్వామి స్వయంభూ కావడంతో భక్తుల సౌకర్యార్థం ఉత్సవ మూర్తులను, కల్యాణమూర్తులను ఆలయ పై భాగాన ఉన్న చెన్నైకి చెందిన ముక్కూరు లక్ష్మీనర్సింహాచార్య ట్రస్టు పీఠంలోకి తరలించారు. అదేవిధంగా ఆలయంలోని సామగ్రిని కూడా అక్కడికే తరలించారు. వరద ఉధృతమవుతున్న నేపథ్యంలో భక్తులు ఆలయంలోకి ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరోవైపు జిల్లాలోని చింతపాలెం, పాలకీడు, మఠంపల్లి మండలాల్లోని 16 ముంపు గ్రామాల్లోకి వరద రావడంతో పత్తి, వరి, మిర్చి పంటలు నీట మునిగాయి. దీంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

**తొలిసారి 2009లో ఆలయం మునక**

కృష్ణా నదికి వరదలు రావడంతో 2009లో తొలిసారి ఆలయం నీట మునిగింది. అప్పట్లో కరకట్ట లేకపోవడంతో ఆలయంలోకి వరద వచ్చి వారం రోజులపాటు మూసేశారు. 2014–15లో రూ.5 కోట్ల వ్యయంతో ఆలయం చుట్టూ నిర్మించిన కరకట్టకు లీకేజీలు ఏర్పడి వరద నీరు ఆలయంలోకి ప్రవేశిస్తోంది. బుధవారం ఈ లీకేజీలు ఎక్కువ కావడంతో వరద తీవ్రత పెరిగింది. దీంతో గర్భాలయం ముందున్న ధ్వజస్తంభం, ఆంజనేయ స్వామి ఆలయాలను దాటుకొని వరద నీరు ముఖమండపానికి చేరడంతో గర్భాలయాన్ని మూసివేశారు. ఆలయంలోకి వరద నీరు చేరిన విషయాన్ని తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ సంజీవరెడ్డి ఆలయాన్ని సందర్శించి వరద ఉధృతి, పరిస్థితిని సమీక్షించారు. భక్తుల కోసం పై భాగంలో పూజలు జరపాలని పాలక మండలిని ఆదేశించారు. ఆలయ రక్షణ కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఆయన తెలిపారు.

**పులిచింతలకు జలకళ**

పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 40 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ప్రాజెక్టుకు 5.46 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 24 గేట్లలో 22 గేట్లు ఎత్తి 5.98 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజీకి వదులుతున్నారు. టీఎస్ జెన్‌కో పరిధిలో ఉన్న 4 యూనిట్లలో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. మరో మూడ్రోజులపాటు ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగనుందని అధికారులు పేర్కొంటున్నారు. 2013 నుంచి ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రాజెక్టులోకి భారీ వరద రావడం, నిల్వ చేయడం, దిగువకు లక్షల క్యూసెక్కులు వదలడం ఇదే తొలిసారి.

**పంటలు మునక**

చింతలపాలెం, పాలకీడు, మఠంపల్లి మండలాల్లోని 16 ముంపు గ్రామాల్లోకి వరద నీరు రావడంతో పత్తి, మిర్చి, వరి పంటలు నీట మునిగాయి. అలాగే చింతపాలెం మండలం రెబల్లె, శోభనాద్రిగూడెం, తమ్మారంలోని కొన్ని కుటుంబాలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ముంపు గ్రామాలైన శోభనాద్రిగూడెం, వెల్లటూరులో రహదారులపైకి నీళ్లు రావడంతో బస్సులను దారి మళ్లించారు. అలాగే పాలకీడు మండలం రావిపహాడ్, మహంకాళిగూడెం గ్రామాల్లోని 300 వందల ఎకరాల్లో పత్తి, వరి పంటలు నీట మునిగాయి. కృష్ణా నది తీర ప్రాంతాలైన మట్టపల్లి, గుండ్లపల్లి, సుల్తాన్‌పూర్ తండా గ్రామాలకు వరద నీరు తాకింది. మరోవైపు పులిచింతల ప్రాజెక్టును చూసేందుకు సూర్యాపేట, ఖమ్మం, ఆంధ్రపదేశ్‌లోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తున్నారు.



సూర్యాపేట జిల్లా మట్టపల్లిలోని శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయంలోకి చేరిన వరద నీరు



వాగులో బాలుడి మృతదేహాన్ని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న గ్రామస్తులు

## వాగు దాటేందుకు 'శవా'లక్ష పాట్లు

**చింతలమానెపల్లి (సిర్పూర్):** కుమురం భీం జిల్లాలోని మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న తీరు ఈ ఘటనతో అద్దం పడుతోంది. చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన డగె ప్రభుదాస్ (17) తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని పరిస్థితి విషమించడంతో గురువారం చనిపోయాడు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు కేతిని- దిందా గ్రామాల మధ్య గల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గ్రామస్తులు ధైర్యం చేసి స్ట్రెచర్ ద్వారా నిండుగా ప్రవహిస్తున్న వరదలో నుంచి శవాన్ని వాగు దాటించారు.

# కలగానే కాటన్ పార్క్

### ప్రైవేట్ వ్యాపారులకు స్థలం ధారాదత్తం

ఆచరణకు నోచుకోని పార్క్ నిర్మాణం • నేతలకు విన్నవించినా అతీగతీ లేని పరిస్థితి

**సాక్షి ప్రతినిధి, ఖమ్మం:** జిల్లాలో కాటన్ పార్క్ కలగానే మిగిలింది. తెల్ల బంగారం (పత్తి) అత్యధికంగా పండించే ప్రాంతంగా ఖమ్మం జిల్లా తల్లాడ పరిసర ప్రాంతానికి పేరుంది. ఇక్కడ పార్క్ నిర్మాణం కోసం రైతులు బంగారం పండించే తమ భూములను 2006లోనే పారిశ్రామిక మౌలిక వసతుల సదుపాయాల సంస్థ (ఏపీఎస్ఐడీసీ)కి అప్పగించి దశాబ్దాలు గడిచినా.. ఇప్పటికీ ఒక్క అంగుళం ముందుకు పడకపోగా.. ఆ స్థలాల్లోకి వేరే పరిశ్రమలు మాత్రం వచ్చాయి. ఇందులో రైతులకు ఏమాత్రం ఉపయోగపడని రసాయనిక ఫ్యాక్టరీ వంటివి ఏర్పాటు చేసి రైతుల పోరాటంతో మూసివేసినా.. రైతులు భూములు ఇచ్చిన లక్ష్యం మాత్రం నెరవేరలేదు. కాటన్ పార్క్ కోసం ఇచ్చిన స్థలంలో జిన్నింగ్ మిల్లు, కోల్డ్ స్టోరేజీ వంటివి ఇప్పటికే ఉన్నాయి. పార్క్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని.. రైతులకు ఇచ్చిన హామీ మేరకు కాటన్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని రైతులు దశాబ్ద కాలంగా కోరుతున్నా.. ప్రయోజనం మాత్రం శూన్యం.

**42 ఎకరాల స్థలం సేకరణ**

పత్తి పంట ఎక్కువగా పండించే ఖమ్మం జిల్లాలోని తల్లాడ, ఏన్కూరు మండలాల మధ్యలో అన్నారుగూడెం గ్రామానికి చేరువలో కాటన్ పార్క్ ఏర్పాటు చేసేందుకు గ్రామానికి చెందిన రైతుల వద్ద నుంచి 2006లో ఏపీఐఐసీ 42 ఎకరాల భూమిని సేకరించింది. అప్పట్లో ఎకరానికి రూ.లక్ష చొప్పున రైతులకు చెల్లించారు. కాటన్ పార్క్‌తోపాటు టెక్స్‌టైల్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు చేస్తామని అప్పటి ఎంపీ రేణుకా చౌదరి హామీ ఇవ్వడంతో రైతులంతా ముందుకొచ్చి భూములిచ్చారు. అయితే తమ కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. కాటన్ పార్క్, జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయలేదు. అంతేకాక ప్రభుత్వం సేకరించిన భూములలో ప్రైవేటు ఫ్యాక్టరీలు పెట్టేందుకు అనుమతినిచ్చింది. దీంతో ఆ భూముల్లో విషతుల్యమైన ఫ్యాక్టరీలు వెలిశాయి.

**ప్రైవేట్‌కు ధారాదత్తం**

అన్నారుగూడెంలో ఏర్పాటు చేస్తామని చెప్పిన కాటన్ పార్క్ కాస్త ఇండస్ట్రియల్ పార్క్‌గా మారింది. ప్రభుత్వం సేకరించిన భూమిని ప్రైవేట్ పరిశ్రమల కోసం ధారాదత్తం చేశారు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము మంచి ఉద్దేశంతో భూములు ఇస్తే.. చివరకు ప్రైవేట్ వ్యక్తులకు ఈ భూములను ధారాదత్తం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కాటన్ పార్క్, జిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం సేకరించిన భూమిలో ప్రైవేట్ వ్యాపారులు కోల్డ్ స్టోరేజ్‌లు, జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. ఇలా కూడా రైతులకు నిరాశే మిగిలింది.



## సాగర తీరం.. జనహోరం

కృష్ణా నది సోయగాలను చూసేందుకు నాగార్జున సాగర్‌కు గురువారం జనం పోటెత్తారు. వరుస సెలవుల కారణంగా కుటుంబాలతో తరలివచ్చారు. దీంతో సాయంత్రం మూడు గంటల సమయంలో సమ్మక్క సారక్క దగ్గరి నుంచి మాచర్ల వరకు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతోయాయి. కిలో మీటర్ల దూరం నడుచుకుంటూ నదీ తీరం చేరుకున్నారు. అలాగే పైలాన్ నుంచి హిల్ కాలనీ వరకు చేరుకోవడానికి మూడు గంటల సమయం పట్టింది. గురువారం సాగర్ క్రస్ట్‌గేట్ల ద్వారా 7,34,967 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాగర్ జలాశయం గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.70 అడుగులకు చేరింది.

- నాగార్జునసాగర్

## క్లుప్తంగా...



మహమూద్ అలీకి రాఖీ కడుతున్న హరిప్రియ

### హోంమంత్రికి ఎమ్మెల్యే రాఖీ

**కొత్తగూడెం అర్బన్:** స్వాతంత్య్ర దిన వేడుకల్లో పాల్గొనేందుకు కొత్తగూడెం వచ్చిన హోంమంత్రి మహమూద్ అలీకి ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ రాఖీ కట్టారు. హోం మంత్రితో పాటు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ, ఎస్పీ సునీల్‌దత్‌కు కూడా ఆమె రాఖీ కట్టారు.



### ప్రాణహిత పరవళ్లు

**కాళేశ్వరం:** మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం వద్ద గోదావరిలో ప్రాణహిత నది కలసి ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం సాయంత్రం వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.71 మీటర్లు ఉంది. వరద తీరంలోని పుష్కరఘాట్లను తాకుతూ వెళ్తోంది. ప్రాణహిత నదికి వరద ప్రవాహం పెరగడంతో లక్ష్మీ (మేడిగడ్డ) బ్యారేజీకి వరద పోటు అధికమైంది. దీంతో బ్యారేజీలో మొత్తం 85 గేట్లు ఉండగా 55 ఎత్తారు. 3.61లక్షల క్యూసెక్కుల వరద తరలిపోతోంది. బ్యారేజీలో ప్రస్తుతం నీటి నిల్వ 4.584 టీఎంసీలు ఉంది. మొత్తం 100 మీటర్ల వాటర్ లెవల్ కాగా 95 మీటర్ల ఎత్తు నీటి మట్టం ఉంది. సరస్వతీ (అన్నారం) బ్యారేజీకి మానేరు వాగు నుంచి వరద వస్తుండడంతో సుందిళ్ల (పార్వతీ) బ్యారేజీ గేట్లు ఎత్తగా దిగువన ఉన్న సరస్వతీ బ్యారేజీకి ప్రవాహం పెరిగింది. దీంతో సరస్వతీ బ్యారేజీలో మొత్తం 66 గేట్లు ఉండగా రెండు గేట్లు ఎత్తారు.

### సర్పంచులకు సత్కారం

**స్వాతంత్య్ర వేడుకల్లో కలెక్టర్ వినూత్న కార్యక్రమం**

**పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాకు దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్, స్వచ్ఛ దర్పణ్ కార్యక్రమానికి గుర్తింపు రావడంతో ఈ విజయానికి కారకులైన సర్పంచులందరికీ గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో కలెక్టర్ శ్రీదేవసేన నుంచి సత్కారం లభించింది. సాధారణంగా పంద్రాగస్టు, రిపబ్లిక్ డే, తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఉత్తమ సేవలందించిన అధికారులతోపాటు వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించడం సర్వసాధారణం. ఈసారి జిల్లాకు చెందిన 263 మంది సర్పంచులకు జడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించి కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. స్వచ్ఛ మిషన్ కింద సుమారు 1,7,066 కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మలమూత్ర విసర్జన రహిత జిల్లాగా నిలిపిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛదర్పణ్‌లో జిల్లా దేశంలో అగ్రస్థానం దక్కించుకోవడంతో పాటు కలెక్టర్‌కు మరో జాతీయ అవార్డు వరించింది. కాగా, 13 మంది ఎంపీడీవోలకు, ఈవోపీఆర్డీల కూడా ప్రశంసా పత్రాలు అందించారు. రాయపేట ఎత్తిపోతల పథకాన్ని 150 రోజుల్లోనే పూర్తి చేసిన అధికారులు మహేష్‌చందర్‌రావు, వెంకటేశ్వర్ రెడ్డిని ప్రత్యేకంగా సత్కరించారు.




### కరీంనగర్‌లో ఏపీ బుక్‌లెట్‌ల పంపిణీ

**పశుసంవర్ధక శాఖ నిర్వాకం**

**కరీంనగర్‌క్రైం:** కరీంనగర్‌లో ఏపీ ప్రభుత్వానికి సంబంధించిన బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. స్వాతంత్య్ర వేడుకలు, రాష్ట్రావతరణ వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై బుక్‌లెట్ తయారు చేసి పంపిణీ చేయడం ఆనవాయితీ. గురువారం పంద్రాగస్టు వేడుకల్లో పశుసంవర్ధశాఖ అధికారులు తమ శాఖకు చెందిన బుక్‌లెట్‌లు పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే.. ఇవి ఏపీప్రభుత్వం బుక్‌లెట్‌లు ఉండటాన్ని గమనించిన కొందరు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కంగుతిన్న అధికారులు వాటిని వెనక్కు తీసుకున్నారు. మంత్రి, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్న ఈ కార్యక్రమంలో కూడా శాఖ తరపున పంపిణీ చేస్తున్న నివేదికలు పరిశీలించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

# తగ్గుతున్న 'ప్రభుత్వ' విద్యార్థులు!

**2017 కంటే 2018లో తగ్గిపోయిన విద్యార్థులు 70,993 ▼**

**ప్రైవేటు పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులు 41,335 ▲**

**మిగతా 29,658 మంది విద్యార్థులు ఏమైనట్లు?**

**డ్రాపవుట్లుగా మిగిలిపోయారా..? ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారా?**

**కేజీబీవీల్లో మాత్రం పెరిగిన ఎన్‌రోల్‌మెంట్ గతేడాదికంటే ఈసారి 20840 మంది పెరుగుదల ▲**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గిపోతున్నారు. 11,700 ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండగా, 29 వేల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గిపోతున్నారు. విద్యాశాఖ పాఠశాలలతోపాటు కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ), గురుకులాల్లోని మొత్తం విద్యార్థుల సంఖ్యను, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల సంఖ్యతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గిపోయారు. ఈ విషయాన్ని విద్యాశాఖ ఇటీవల తేల్చిన లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. 2018-19 విద్యా సంవత్సరంలో విద్యార్థుల లెక్కలు తేల్చిన విద్యా శాఖ కిందటేడాదితో పోల్చితే ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోగా, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు అంచనా వేసింది. మరోవైపు కేజీబీవీల్లో మాత్రం విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గతేడాది కంటే ఈసారి 20 వేల మందికి పైగా విద్యార్థులు కేజీబీవీల్లో పెరిగినట్లు విద్యాశాఖ లెక్కలు తేల్చింది.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు 70,993 మంది విద్యార్థులు దూరమయ్యారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో 41,335 మంది విద్యార్థులు పెరిగారు. 2017-18 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో (అన్ని యాజమాన్యాలు కలుపుకొని) 27,58,426 మంది విద్యార్థులు ఉంటే 2018-19 విద్యా సంవత్సరం వచ్చే సరికి ఆ సంఖ్య 26,87,433కు తగ్గిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో 2017-18 విద్యా సంవత్సరంలో 30,77,884 మంది ఉండగా, 2018-19 విద్యా సంవత్సరం వచ్చే సరికి వాటిల్లో విద్యార్థుల సంఖ్య 31,19,219కి పెరిగింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు దూరమై, ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య ఒకేలా లేదు. లెక్కల్లో 29,658 మంది విద్యార్థుల వ్యత్యాసం ఉంది. వారంతా ఏమైనట్లు అన్నది ఇపుడు ప్రశ్నగా మారింది. వారంతా డ్రాపవుట్లుగా మిగిలిపోయారా? అన్నది తేలాల్సి ఉందని ఓ అధికారి పేర్కొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లకు దూరంగా..

విద్యార్థులు తగ్గిపోయిన యాజమాన్యాల్లో చూస్తే ప్రభుత్వ, జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్‌లోనే విద్యార్థులు భారీగా తగ్గిపోయారు. 2018-19 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 21,50,626 మంది విద్యార్థులు ఉంటే 2018-19 విద్యా సంవత్సరానికి వచ్చే సరికి 20,47,373కు తగ్గిపోయింది. అంటే 1,03,253 మంది విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్తు పాఠశాలల్లో తగ్గిపోయారు. అందులో దాదాపు 30 వేల మంది కేజీబీవీలు, గురుకులాల్లో చేరగా, 41 వేల మందికిపైగా ప్రైవేటు స్కూళ్లలో చేరారు. ఇక మిగతా 30 వేల మంది సంగతి తేలలేదు.




**కేజీబీవీల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య**

కేజీబీవీల్లో గతేడాదికంటే ఈసారి 20,840 మంది విద్యార్థులు పెరిగారు. గతేడాది 91,600 మంది ఉంటే.. ఈసారి 1,12,440 మంది విద్యార్థులయ్యారు. రాష్ట్రంలోని 475 కేజీబీవీల్లో ఈసారి 12వ తరగతి ప్రారంభించారు. దీంతో కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు అధికారులు అంచనా వేశారు.



రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా గురువారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు ఆయన సోదరీమణులు లీలమ్మ, సకలమ్మ రాఖీ కట్టి ఆశీర్వదించారు.



రక్షా బంధన్ పండుగ సందర్భంగా మాజీ ఎంపీ కవిత.. తన సోదరుడు, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కట్టి ఆశీస్సులు తీసుకున్నారు. గురువారం ఉదయం కేటీఆర్.. కవిత నివాసానికి వెళ్లారు. సోదరుడికి సాదరంగా ఆహ్వానం పలికి రాఖీ కట్టగా, ఇద్దరూ పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ సోదరి సౌమ్య కూడా కేటీఆర్‌కు రాఖీ కట్టారు.



గురువారం రాఖీ పండుగ సందర్భంగా ప్రగతి భవన్‌లో కేటీఆర్ కుమార్తె అలేఖ్య తన సోదరుడు హిమాన్షుకు రాఖీ కట్టింది. చిత్రంలో కేటీఆర్ సతీమణి

# బొట్టు నీరు పెరగలే..!

- జూలై చివరి నాటికి రాష్ట్రంలో భారీగా తగ్గిన భూగర్భ జలాలు
- గతేడాదితో పోలిస్తే సరాసరి 3.2 మీటర్ల దిగువకు నీటిమట్టం
- 183 మండలాల్లో 20 మీటర్ల కిందకు పడిపోయిన పరిస్థితి
- జలవనరుల భూగర్భశాఖ నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఓవైపు ఎగువ నుంచి భారీ వరదల కారణంగా రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండలుగా మారుతున్నా భూగర్భ జలమట్టాల్లో ఏమాత్రం పెరుగుదల కనిపించడంలేదు. నలభై శాతం మేర లోటు వర్షపాతం కారణంగా పాతాళగంగ పైకి రానేలేదు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జూలై చివరి నాటికి రాష్ట్రంలో సరాసరి భూగర్భ మట్టాలు 3.20 మీటర్ల దిగువనే ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణాది జిల్లాలైన పూర్వ నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భూగర్భ మట్టాలు దారుణంగా పడిపోయాయి. వర్షాభావం, అధిక నీటి వినియోగంతో ఇక్కడ భూగర్భ జలం ఏమాత్రం మెరుగవలేదు. జూలైలో రాష్ట్ర సగటు వర్షపాతం 373 మిల్లీమీటర్లు కాగా 302 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 19 శాతం లోటు నెలకొంది. 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా 17 జిల్లాల్లో లోటు వర్షపాతం కనిపించింది. ఇందులో ముఖ్యంగా నల్లగొండ జిల్లాలో 40 శాతం లోటు వర్షపాతం నెలకొంది. లోటు వర్షపాతం కారణంగా ఖరీఫ్ పంటల సాగుకు పూర్తిగా బోర్లపై ఆధారపడటంతో పరిస్థితి ఇలా ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడిందని జలవనరుల భూగర్భ శాఖ నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో గతేడాది జూలైలో రాష్ట్ర సగటు భూగర్భ మట్టం 10.92 మీటర్లు ఉండగా ఈ ఏడాది 14.12 మీటర్లుగా ఉంది. ఏకంగా 3.2 మీటర్ల తేడా కనిపించింది. ఈ ఏడాది జూన్‌లో 14.40 మీటర్ల మట్టంలో భూగర్భ మట్టం ఉండగా కేవలం 0.28 మీటర్ల మేర మాత్రమే మెరుగైంది. ముఖ్యంగా దక్షిణాది జిల్లాల్లో భూగర్భ మట్టం ఊహించని స్థాయిలో పడిపోయింది. మెదక్ జిల్లా సగటు భూగర్భ మట్టం 27.05 మీటర్లు ఉండగా ఇక్కడి టేక్మాల్‌లో ఏకంగా 44.91 మీటర్లలో మట్టాలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 23.14,వికారాబాద్ జిల్లా సగటు మట్టం 19.95గా నమోదైంది. గతేడాదితో పోలిస్తే 8 మీటర్ల నుంచి5 మీటర్ల లోతున భూగర్భ జలాలున్నాయని నివేదిక పేర్కొంది. మొత్తంగా 589 మండలాలకుగాను 183 మండలాల్లో 20 మీటర్ల దిగువన భూగర్భ జలాలున్నాయని తెలిపింది. ఇందులో నల్లగొండ, మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేటలోని చాలా మండలాల్లో ఈ పరిస్థితులు ఉన్నాయని వివరించింది.

**నిండని చెరువులు కారణమే...**

కృష్ణా బేసిన్‌లోని చెరువుల్లోకి ఇప్పటివరకు పెద్దగా నీరు చేరలేదు. బేసిన్ పరిధిలో మొత్తంగా 23,607 చెరువులు ఉండగా 21,225 చెరువుల్లో 25 శాతం కన్నా తక్కువగా నీరు వచ్చి చేరింది. 1,581 చెరువుల్లో 20 నుంచి 50 శాతం, 519 చెరువుల్లో 50 నుంచి 75 శాతం, 188 చెరువుల్లో 75 శాతానికి పైగా నీరు రాగా కేవలం 94 చెరువుల్లోనే అలుగు పారుతున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలో 3,790 చెరువులు ఉండగా 3,611 చెరువుల్లో ఇప్పటివరకు పెద్దగా నీరు చేరలేదు. నల్లగొండ. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో 4,652 చెరువులుంటే ఇక్కడ 3,992 చెరువులు నీటి రాక కోసం ఎదురుచూస్తున్నాయి. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలో 6,417 చెరువులకుగాను 6,153 చెరువులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. చెరువులు నిండకపోవడంతో భూగర్భ మట్టాల్లో పెద్దగా పెరుగుదల లేదు. అయితే తాజాగా ప్రాజెక్టుల నుంచి కాల్వలకు, చెరువులకు నీటి విడుదల జరుగుతున్నందున ఈ నెలలో కొంత మేర భూగర్భ మట్టాలు మెరుగయ్యే అవకాశం ఉంటుందని నీటిపారుదల వర్గాలు అంటున్నాయి.

**భూగర్భ మట్టాలు పడిపోయిన మండలాలు ఇలా...**

| జిల్లా | మండలం | భూగర్భ మట్టం (మీటర్లలో) |
|---|---|---|
| నల్లగొండ | మర్రిగూడ | 67.72 |
| వికారాబాద్ | బంట్వారం | 49.59 |
| మెదక్ | టేక్మాల్ | 49.09 |
| మెదక్ | కొల్చారం | 45.65 |
| మేడ్చల్ | కుత్బుల్లాపూర్ | 44.91 |
| కరీంనగర్ | చిగురుమామిడి | 43.75 |
| నిజామాబాద్ | భీమ్‌గల్ | 42.80 |
| రంగారెడ్డి | ఫరూఖ్‌నగర్ | 42.28 |
| సిద్దిపేట | దౌల్తాబాద్ | 41 |
| సిద్దిపేట | ములుగు | 40 |

## 'పర్యావరణ రక్షణకు అందరూ కృషిచేయాలి'



సాక్షి, హైదరాబాద్: పరిసరాల స్వచ్ఛతను పెంచుకోవటం, పచ్చదనం కాపాడుకోవటం ద్వారా పర్యావరణ రక్షణకు అందరూ కృషిచేయాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్.శోభ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్యభవన్‌లో జరిగిన వేడుకల్లో ఆమె జాతీయ జెండా ఎగురవేశారు. అటవీ సంబంధిత కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, డిపార్టుమెంట్‌లోని ప్రతీ ఒక్కరూ నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని కోరారు. యేడాది కాలంగా మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. రిటైర్డ్ పీసీసీఎఫ్ బీఎస్ఎస్ రెడ్డి ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

## 'సంస్కరణల ఘనత కాంగ్రెస్‌దే'

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య భారతదేశ అభివృద్ధికి అనేక సంస్కరణలు తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలు వచ్చాయని, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ పనిచేసిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర లేని బీజేపీ, నిరంకుశ పాలన సాగిస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రజల స్వేచ్ఛను దెబ్బతీయడం మానుకోవాలన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

# 'వైరల్' నరకం!

ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. కలుషిత తాగునీరు, అపరిశుభ్ర వాతావరణం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా చిన్న, పెద్దా తేడా లేకుండా విరోచనాల బారినపడుతున్నారు. ఈ సమయంలో 89,016 మంది డయేరియాతో ఆసుపత్రి పాలయ్యారు. ఇందులో 5,413 మంది రక్త విరేచ నాలతో బాధపడ్డారు. జూన్ వరకూ పెద్దగా కనిపించని మలేరియా, ఇప్పుడు విజృంభిస్తోంది. గత 40 రోజుల్లో 2,060 మంది ఈ వ్యాధిబారిన పడ్డారు.

**మలేరియా విజృంభిస్తోంది**

జూన్ చివరి నాటికి కేవలం 568 మలేరియా కేసులుంటే, ఇప్పుడు ఆ సంఖ్య 2,628కి చేరింది. 2015 తర్వాత మళ్లీ ఈ ఏడాది ఎక్కువ మలేరియా కేసులు నమోదయ్యే సూచనలున్నాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర చరిత్రలో ఆ ఏడాది అత్యధికంగా 11,880 మంది మలేరియా బారినపడ్డట్టు వైద్యారోగ్యశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అప్పట్నుంచి ఏటా వ్యాధి విస్తరణ తగ్గుతూ వచ్చిం ది. గతేడాది అత్యల్పంగా 1,792 కేసులు నమోద వగా, ఈ ఏడాది ఇప్పటికే 2,600 దాటడం గమనా ర్హం. డెంగీ బాధితుల సంఖ్య 1,200లు దాటింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ 5,116 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. మొత్తంగా ఈ 3 నెలల్లో 43,67,279 మంది వివిధ రకాల సీజనల్ వ్యాధుల తో దవాఖానలకు వచ్చినట్టు లెక్కలు చెబుతున్నా యి. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు ఇంతకుమించే ఉంటారు. జనవరి నుంచి జులై 14 వరకూ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర శ్వాసకోశ సమస్యలతో ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందిన వారు సుమారు 2.50లక్షల మంది కాగా, గత 45 రోజుల్లోనే సుమారు 50 వేల మంది బాధితులు ఈ లక్షణాలతో సర్కారు దవాఖానాల్లో చికిత్స పొందారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కంటే హైదరాబాద్‌లో అత్యధికంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 63వేల కేసులు నమోదవగా, గత 45 రోజుల్లో 13వేల మందికి పైగా బాధితులు చికిత్స పొందడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. జ్వరాలపై నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు కూడా 10రోజులుగా జ్వరంతో బాధపడటం గమనార్హం.

**చర్యలేవీ?**

సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ దవాఖానాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది సెలవులను రద్దు చేస్తున్నట్టు ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించారు. అయితే, మంత్రి ఆదేశాలను డాక్టర్లు, సిబ్బంది పెద్దగా సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించటం లేదు. చాలా చోట్ల ప్రభుత్వ వైద్యులు అనధికార సెలవుల్లో ఉన్నట్టు తెలుస్తోంది. అసలు అలాంటి ఆదేశాలు ఏవీ అమలు కావడం లేదని ప్రజారోగ్య విభాగం ఉన్నతాధికారులు చెబుతుండటం గమనార్హం. ఓ వైపు వేల మంది ప్రజలు రోగాల బారిన పడి ఇబ్బంది పడుతుండటం, వ్యాధులు మరింత విస్తరించే ప్రమాదముందని తెలిసి కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల రోజుల్లో రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఉన్నతాధికారులు కనీసం ఓ సమీక్ష కూడా నిర్వహించకపోవడం గమనార్హం. వర్షాకాలం అనగానే ఏజెన్సీ ప్రాంతాలున్న జిల్లాల అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించడం, ఏజెన్సీ ఏరియాల్లో దోమ తెరల పంపిణీ, లార్వా నాశనం చేయడానికి మందులను పిచికారి చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ ఏడాది కూడా 10ఏజెన్సీ జిల్లాల కలెక్టర్లతో మంత్రి ఈటల రాజేందర్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వరంగల్ (రూరల్), కరీంనగర్, భూపాలపల్లి, రంగారెడ్డి, మహబూబాబాద్, వరంగల్ (అర్బన్), మేడ్చల్, నిజామాబాద్‌లను డెంగీ హైరిస్క్ జిల్లాలుగా, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి-కొత్తగూడెం, హైదరాబాద్, ఆసిఫాబాద్, మహబూబాబాద్‌లను మలేరియా హైరిస్క్‌గా జిల్లాలుగా ప్రకటించారు. హైరిస్క్ అని ముందే తెలిసినా కనీసం ఈ జిల్లాల్లో వ్యాధి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. హైరిస్క్ లిస్ట్‌లో ఉన్న హైదరాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు దారుణంగా విఫలమయ్యారు. ఈ 2 జిల్లాల్లోనే 70% మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో మలేరియా కంట్రోల్ యూనిట్ ఉన్నప్పటికీ నిరుపయోగంగానే మారింది. మొత్తం 2,628 మలేరియా కేసుల్లో 1,886 ఇక్కడే నమోద య్యాయి. 639 కేసులతో కరీంనగర్ రెండో స్థానంలో ఉంది.

**విచ్చలవిడిగా ప్రైవేటు దోపిడీ**

వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ అడ్డగోలుగా పెరిగిపోయింది. ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య పెరగంతో రోగులనుంచి అందినకాడికి దోచుకొంటున్నా రన్న విమర్శలున్నాయి. డెంగ్యూ కేసులు వస్తే ప్లేట్‌లెట్ల పేరుతో రూ.50వేల నుంచి లక్ష వరకు వసూలు చేస్తున్నారు. దీనికి ఓ లెక్క లేకపోవడం, అధికారులు కూడా చోద్యం చూస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

# కృష్ణాలో స్థిరంగా వరద

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి మొదలు పులిచింతల వరకు కృష్ణా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టులన్నీ నిండటంతో వచ్చి నీటిని వచ్చినట్లుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఎగువ నుంచి వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నింపకుండా కొంతమేర ఖాళీగా ఉంచి వరద నీటిని దిగువకు వదిలేస్తున్నారు. గురువారం శ్రీశైలానికి 8.62 లక్షల క్యూసెక్కుల మేర ప్రవాహం రాగా 8.61 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ నీరంతా సాగర్‌కు వస్తుండటంతో నిల్వ 312 టీఎంసీలకుగాను 303 టీఎంసీల మేర ఉంచి మిగతా నీటిని పులిచింతలకు వదిలేస్తున్నారు. పులిచింతల ద్వారా కృష్ణా జలాలను ప్రకాశం బ్యారేజీ మీదుగా సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కొంత తెరిపినివ్వడంతో వరద ఉధృతి కొంత మేర తగ్గే అవకాశం ఉంది. ఇక తుంగభద్ర, భీమా నదుల్లో మునుపటితో పోలిస్తే వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది. గురువారం భీమాపై ఉన్న ఉజ్జయినీలోకి కేవలం 10 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదవగా తుంగభద్రలో లక్ష క్యూసెక్కుల ప్రవాహం కాస్తా 65 వేల క్యూసెక్కులకు తగ్గింది.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..**
**(నిల్వ-టీఎంసీల్లో, ప్రవాహాలు-క్యూసెక్కుల్లో)**
**(సాయంత్రం ఆరు గంటలకు అధికారిక బులిటెన్ ప్రకారం)**

| ప్రాజెక్టు | పూర్తి నిల్వ | ప్రస్తుత నిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 106.98 | 4,73,581 | 5,20,000 |
| నారాయణపూర్ | 37.646 | 25.94 | 5,40,000 | 5,27,300 |
| జూరాల | 9.65 | 6.28 | 7,05000 | 6,83,684 |
| శ్రీశైలం | 215.807 | 197.91 | 8,62,789 | 8,61,907 |
| తుంగభద్ర | 100.86 | 100.32 | 65,204 | 80,314 |
| ఉజ్జయిని | 117 | 117.24 | 10,939 | 5,950 |
| నాగార్జునసాగర్ | 312.045 | 303.95 | 8,78,995 | 7,34,967 |
| పులిచింతల | 45.77 | 38.27 | 6,44,700 | 6,44,700 |
| కడెం | 7.60 | 6.93 | 1,278 | 808 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.84 | 7,853 | 7,853 |
| ఎస్సారెస్పీ | 90.31 | 17.18 | 0 | 389 |

# రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి అండగా హైకోర్టు

**జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ కీలక తీర్పు**

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారంపై కింది కోర్టు ఇచ్చిన దానికి 10 రెట్లు పెంచుతూ హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. అంతేకాకుండా ఈ మొత్తానికి 7.5 శాతం వడ్డీ కూడా చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. కింది కోర్టు 1.78 లక్షలుగా నిర్ణయిస్తే హైకోర్టు ఈ మొత్తాన్ని రూ.17.74 లక్షలకు పెంచింది. 2004లో జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి బైక్‌పై ప్రయాణిస్తూ వెనుక కూర్చున్న క్రిష్టయ్యను జీపు ఢీకొనడంతో మృతిచెందారు. దీనికి సంబంధించి రూ.15 లక్షలు పరిహారంగా చెల్లించాలని అతని భార్య, మైనర్ పిల్లలు కింది కోర్టును ఆశ్రయించారు. మోటార్ సైకిల్ నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేని కారణంగా సగం పరిహారాన్ని అతను చెల్లించాలని, మిగిలిన సొమ్ము రూ.1.78 లక్షలను 9 శాతం వడ్డీతో బాధితురాలికి చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశిస్తూ సిటీ సివిల్ కోర్టు తీర్పు చెప్పింది. దీనిని బాధితులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ విచారించి కింది కోర్టు తీర్పును తప్పుపడుతూ పరిహారాన్ని భారీగా పెంచుతూ ఇటీవల కీలక తీర్పునిచ్చారు. సుప్రీంకోర్టు సంజయ్‌కుమార్-అశోక్‌కుమార్‌ల మధ్య జరిగిన కేసులో వెలువరించిన తీర్పును న్యాయమూర్తి ఉదహరిస్తూ పరిహారాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేదని చెప్పి బైక్ నడుపుతున్న వ్యక్తి సగం బాధ్యత వహించాలనడం సరికాదని తేల్చారు. క్రిష్టయ్య నెలకు రూ.13.500 వంతున సంపాదిస్తుండగా మృతిచెందారని, అతని ఖర్చులు మినహాయిస్తే ఏడాదికి రూ.1.18 లక్షలు ఉంటుందని, ఈ మొత్తాన్ని గత 14 ఏళ్లకు లెక్కిస్తే రూ.16.54 లక్షలు అవుతుందని న్యాయమూర్తి లెక్కగట్టారు. మైనర్ సంతానానికి రూ.50 వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.70 వేలు మొత్తం కలిపి రూ.17.74 లక్షలను చెల్లించాలని, దీనికి 7.5 శాతం వడ్డీ కూడా జమ చేసి చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశిస్తూ తీర్పులో చెప్పారు.


తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి



మదీనా చౌరస్తాలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

లోటస్‌పాండ్‌లో వైఎస్సార్‌సీపీ నేత గట్టు శ్రీకాంత్‌రెడ్డి


## అసెంబ్లీలో జెండాను ఆవిష్కరించిన స్పీకర్

**మండలి ఆవరణలో డిప్యూటీ చైర్మన్..**

**సాక్షి, హైదరాబాద్:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం శాసనసభ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు శాసనసభ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద జాతిపితకు నివాళులర్పించారు. జాతీయ గీతాలాపన అనంతరం అసెంబ్లీ భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు మండలి సభ్యులు కూర రఘోత్తమరెడ్డి, శాసనసభ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి బయలుదేరి వెళ్లారు. మండలి ఆవరణలో జరిగిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

## ప్రశ్నించే గొంతు నొక్కేస్తున్నారు: చాడ

**సాక్షి, హైదరాబాద్:** స్వాతంత్ర్యం వచ్చి 73 ఏళ్లు గడిచినా దేశంలో భావప్రకటనా స్వేచ్ఛ ఇవ్వకుండా ప్రశ్నించే గొంతు నొక్కేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం మఖ్దూం భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించిన అనంతరం చాడ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ కొంతమంది చేతుల్లో బందీ అయిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సామాజిక న్యాయం దక్కడం లేదని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు.

## అభివృద్ధిలో పోటీ పడాలి

**వైఎస్సార్‌సీపీ నేత గట్టు శ్రీకాంత్‌రెడ్డి**

**సాక్షి, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడి దేశం దృష్టిని ఆకర్షించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా.గట్టు శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం లోటస్‌పాండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చాలా విషయాలను సుహృద్భావ వాతావరణంలో మాట్లాడి పరిష్కరించుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రపుల్లారెడ్డి, బి.సంజీవరావు, మహేందర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు అమృతాసాగర్, గ్రేటర్ అధ్యక్షుడు సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఐదేళ్లలో రెట్టింపు టర్నోవర్

**సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్**



**సాక్షి, హైదరాబాద్:** సింగరేణి బొగ్గు గనుల సంస్థ వచ్చే ఐదేళ్లలో రెట్టింపు టర్నోవర్ సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ప్రకటించారు. అలాగే లాభాల సాధన కోసం కొత్త గనులను ప్రారంభించడం, వ్యాపార విస్తరణ కార్యక్రమాలకు కూడా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా గత ఐదేళ్లలో సంస్థ అన్ని రంగాల్లో వృద్ధి నమోదు చేసిందని, 2018–19లో రూ.25,828 కోట్ల టర్నోవర్, రూ.1,766 కోట్ల లాభాలను గడించిందన్నారు. మరో ఐదేళ్లలో ఈ టర్నోవర్‌ను రూ.50 వేల కోట్లకు, లాభాలను రూ.4 వేల కోట్లకు చేర్చే విధంగా ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ఒడిశాలో నైనీ తరహాలో మరికొన్ని బ్లాకుల కోసం ప్రయత్నిస్తున్నామని, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో కూడా బొగ్గు బ్లాకులు పొందడానికి కేంద్ర బొగ్గు శాఖతో సంప్రదిస్తున్నామని వివరించారు. వ్యాపార విస్తరణ కార్యక్రమాల్లో భాగంగా మరో 2 ఏళ్లలో 220 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ అధికారులు, కార్మికులను ఘనంగా సన్మానించారు.

# కేంద్రం వద్ద జడ్జీల పెంపు ప్రతిపాదన

- ఆమోదించే అవకాశముందని హైకోర్టు సీజే ఆశాభావం
- స్వాతంత్ర్య వేడుకల్లో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 24 నుంచి 42కు పెంపుదల చేయాలనే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం వద్ద ఉందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ వెల్లడించారు. దీనిపై కేంద్రం త్వరలోనే ఆమోదం తెలిపే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు ఏర్పాటు జరిగాక మౌలిక వసతులు మెరుగుపడ్డాయని అన్నారు. న్యాయమూర్తుల ఖాళీల భర్తీతోపాటు 24 నుంచి 42 మందికి వారి సంఖ్య పెంచాలనే ప్రతిపాదనను కేంద్రం ఆమోదిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

**ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు..**

73వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని గురువారం హైకోర్టు ప్రధాన భవనం వద్ద ప్రధాన న్యాయమూర్తి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవం, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించడంలో ఎందరో మహనీయుల త్యాగాలు ఉన్నాయని అన్నారు. హైకోర్టులో సాంకేతికతను పుణికిపుచ్చుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, హైకోర్టును పేపర్‌లెస్ చేయబోతున్నట్లు ప్రకటించారు. కంప్యూటరీకరణ ద్వారా అనేక సంస్కరణలు అమల్లోకి తేబోతున్నామని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఈ–ఫైలింగ్ సౌకర్యం అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. తీర్పు వెలువడిన ఒకట్రెండు రోజుల్లో ఆమోదిత తీర్పుల ప్రతులు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కోర్టు ఫీజుల చెల్లింపులు ఆన్‌లైన్‌లో చేసేలా స్టేట్ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. న్యాయమూర్తుల నివాస సముదాయం, హైకోర్టులో కార్ పార్కింగ్, శామీర్‌పేటలో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం చేస్తున్నామని వివరించారు. సంస్కరణ దిశగా చర్యలు తీసుకునేప్పుడు ఎదురయ్యే సవాళ్లను అధిరోహించేందుకు సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అందరికీ న్యాయ ఫలాలు అందించడంలో న్యాయస్థానాల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. సామాన్యులు, రైతులకు కూడా కంప్యూటర్ సాంకేతికతను అందజేస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. పలువురు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


హైకోర్టు ప్రధాన భవనం వద్ద జెండావందనం చేస్తున్న చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

### బహుమతుల ప్రదానం..

ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన హైకోర్టు ఉద్యోగుల పిల్లలు జి.హర్షిత (935 మార్కులు), కె.శిరీష, పి.సింధుజ, సంజన, ప్రపుల్లా, జి.వర్ష, కొండల్ రెడ్డి తదితరులకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చౌహాన్ బహుమతులు ప్రదానం చేశారు. ఇటీవల హైకోర్టు ఆవరణలో అగ్నిప్రమాదం జరగకుండా ముందే జాగ్రత్తలు తీసుకున్న హెడ్‌కానిస్టేబుల్ బాలరాజు, కానిస్టేబుళ్లు ఎన్.శ్రీనివాసన్, ఎన్.రాంబంటులను సీజే సత్కరించారు.

# ‘విమోచనం’ నిర్వహించి తీరతాం

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా పట్టించుకోని పాలకులు
- అమిత్‌షా ఆధ్వర్యంలో ఘనంగా జరుపుతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

**సాక్షి, హైదరాబాద్:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ మాత్రం నిజాం పాలనలోనే ఉండటంతో తెలంగాణలో స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది పోరాటాలు చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో తెలంగాణకు నిజాం పాలన నుంచి విముక్తి లభించిందని, అలాంటి తెలంగాణలో విమోచన దినోత్సవం నిర్వహించకపోవడం దురదృష్టకరమని లక్ష్మణ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలకులు మజ్లిస్‌కు మోకరిల్లి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రజాకార్ల చరిత్ర బయటకు వస్తే మజ్లిస్ నొచ్చుకుంటుందనే ఈ ప్రభుత్వం విమోచన దినోత్సవం జరపడం లేదన్నారు. అమిత్ షా ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం జరిపి తీరుతామన్నారు. మోదీ ఐదేళ్లలో తీసుకువచ్చిన పథకాలను దేశ ప్రజలు సంతోషంగా అందుకుంటున్నారని, తెలంగాణ ప్రజలు కూడా 20 శాతం ఓట్లు బీజేపీకి వేశారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కుటుంబపాలన రాజ్యమేలుతోందని, ఎవరికీ స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. తండ్రి అధ్యక్షునిగా, కొడుకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారని, టీఆర్‌ఎస్‌లో అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించే నేతలు లేరా? అని ప్రశ్నించారు. చంకలో మతోన్మాద పార్టీని పెట్టుకొని పరమతసహనం గురించి మాట్లాడటం ఏంటో కేసీఆర్ చెప్పాలన్నారు. అమిత్‌షా నేతృత్వంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని స్వేచ్ఛగా, ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు బీజేపీతో కలిసి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**మోదీ సమర్థుడైన ప్రధాని**

కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామని, ఈ స్వాతంత్ర్యాన్ని అభివృద్ధి కోసం వినియోగించుకుందామన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అణిచివేసే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. జమ్మూకశ్మీర్‌లో మొదటిసారి స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నారని, మోదీ సమర్థతతోనే ప్రపంచం మొత్తం మనకు మద్దతు ఇచ్చాయన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో కీర్తి గడిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందుతోందన్నారు. ఆర్టికల్ 370ని తొలగించాలని 70 ఏళ్లుగా పోరాడుతున్నారని, అసాధ్యం అయిన కార్యక్రమాలు బీజేపీతో మాత్రమే సాధ్యమని నిరూపించామన్నారు. 370 అధికరణను తీసివేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు.

### బీజేపీ కార్యాలయంలో రక్షాబంధన్

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం బీజేపీ కార్యాలయంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, దత్తాత్రేయలకు మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆకుల విజయ, ఇతర నేతలు రాఖీలు కట్టారు.

# 12 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరాకు సిద్ధం

**ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు**

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 12వేల మెగావాట్ల గరిష్ట విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్ 11న నమోదైన 10,818 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఇప్పటి వరకు గరిష్టమన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం విద్యుత్ సౌధలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలవిద్యుత్ కేంద్రాల్లో రివర్స్ పంపింగ్‌తో విద్యుదుత్పత్తి జరపడం లాభదాయకంగా మారిందన్నారు. తద్వారా బయటి నుంచి అదనపు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన అవసరం తప్పిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు, చార్జింగ్ ఏజెన్సీలకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

**విద్యుత్ వారోత్సవాలకు సిద్ధం కండి : టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ పిలుపు**

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పల్లెలు, పట్టణాల్లో



60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయనున్నారని, ఇందులో భాగంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వారోత్సవాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీ జి.రఘుమారెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం సంస్థ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పవర్ వీక్‌లో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. సెక్షన్ స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాల్లో సైతం పర్యటించి తీసుకోవాల్సిన చర్యలు, అవసరమైన సామాగ్రిపై ఆగస్టు 23 లోగా నివేదికను పంపించాలని జిల్లాల సూపరింటెండింగ్ ఇంజినీర్లను ఆదేశించారు.

# ‘ఏకలవ్య’పై కేంద్రం మౌనం..!

- ఈఎంఆర్ సొసైటీ ఏర్పాటుపై స్పందించని కేంద్ర ప్రభుత్వం
- ప్రతిపాదనలు పంపి ఆర్నెళ్లవుతున్నా పట్టించుకోని వైనం
- కేంద్రం ఆమోదిస్తేనే ప్రత్యేక సొసైటీ ఏర్పాటుకు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్తగా మరో గురుకుల సొసైటీ ఏర్పాటు చేయాలని భావించిన కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రస్తుతం వెనక్కు తగ్గినట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ముగింపు వేడుకల్లో కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కొత్త సొసైటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రం ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తామని వివరించింది. ఈ దిశగా చర్యలు చేపట్టిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రతిపాదనలను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఈ ప్రక్రియ పూర్తయి ఆర్నెళ్లు గడిచినా ఇప్పటికీ ఆ ప్రతిపాదనలకు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆమోదించకపోవడంతో కొత్త సొసైటీ ఏర్పాటుపై అనుమానాలు నెలకొన్నాయి.

**అటకెక్కిన ప్రతిపాదనలు**

రాష్ట్రంలో 19 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ స్కూళ్లలో ఎక్కువగా ఆదివాసీలు విద్యనభ్యసిస్తున్నారు. ఈ స్కూళ్లలో దాదాపు 20వేల మంది విద్యార్థులున్నారు. వీటిని గురుకుల తరహాలోనే నిర్వహిస్తుండగా, ప్రత్యేక సొసైటీ ఏర్పాటైతే కేంద్రం నుంచి వచ్చే నిధులను నేరుగా ఈ సొసైటీ ద్వారా స్కూళ్ల నిర్వహణకు ఖర్చు చేయొచ్చనేది కేంద్రం ఉద్దేశ్యం. ఇందులో



భాగంగా ఈ ఏడాది జనవరి రెండో వారంలో జరిగిన ఈఎంఆర్ స్పోర్ట్స్‌మీట్‌లో కొత్త సొసైటీ ఏర్పాటు చేస్తామని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అదేవిధంగా కొత్తగా మరో ఆరు స్కూళ్లను సైతం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ కొత్త సొసైటీ ఏర్పాటుపై కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రం నుంచి పంపిన ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించకుండా అట్టిపెట్టుకుంది. కేంద్రం నుంచి ఆమోదం వస్తే తప్ప కొత్తగా గురుకుల సొసైటీ ఏర్పాటు చేసే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

**కొత్త స్కూళ్ల సంగతీ అంతే**

ఈఎంఆర్ సొసైటీ సంగతి అటుంచితే కొత్తగా ఆరు స్కూళ్లను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం దానిపై కూడా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. కొత్త స్కూళ్లు మంజూరు కావడంతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలను తయారు చేశారు. వీటిని కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆర్నెళ్లు కావస్తుంది. 2019–20 విద్యా సంవత్సరంలో కొత్త గురుకులాలు ప్రారంభించవచ్చని అధికారులు భావించారు. కానీ ఇప్పటివరకు కేంద్రం ఆమోదించకపోవడంతో కొత్త స్కూళ్లను సైతం తెరవలేదు.

## ఉద్యమ ఆకాంక్షల అమలులో ప్రభుత్వం విఫలమైంది

**టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం**

**సాక్షి, హైదరాబాద్:** ప్రజల భాగస్వామ్యంతోనే స్వాతంత్ర్య పోరాటం నిలబడిందని, ఆ పోరాటం స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం జరిగిందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమం రెండు భాగాలుగా జరిగిందని, అందులో ఒకటి రాజకీయ పోరాటం కాగా, మరొకటి నిర్మాణాత్మక పోరాటమని పేర్కొన్నారు. అలాంటి పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గురువారం టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం అంటే బ్రిటిష్ వాళ్లు పోవడం కాదని, దేశంలో ఉన్న ప్రజల సమస్యలు పోయినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లన్నారు. సమాజంలో మార్పు కోసం అందరూ ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ, భూ రికార్డుల ప్రక్షాళన సరిగ్గా జరగడం లేదన్నారు. ఆదివాసులు భయాందోళనలో బతుకుతున్నారని తెలిపారు. అధికార, విపక్ష పార్టీల ఘర్షణ విఠలాచారి నాటకంలా ఉందని, బీజేపీకి టీఆర్‌ఎస్‌కు మధ్య నిజమైన ఘర్షణ లేదన్నారు. నిజంగా ఘర్షణ ఉంటే పార్లమెంట్‌లో కొన్ని బిల్లులకు టీఆర్‌ఎస్ ఎలా మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు ఫిరాయింపులపై ఆధార పడటం మంచి పద్ధతి కాదన్నారు. దేశ ఆర్థిక పరిస్థితిపై చర్చ జరగాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ అధికార ప్రతినిధి జి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుడి కూతురికి ఆర్థిక సాయం

**వీరభద్రాచారి ట్వీట్‌కు స్పందించిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఓ మాజీ సైనికుడి కూతురికి టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఆర్థిక సాయమందించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన అనంతరం మాజీ సైనికుడి కూతురు మహాలక్ష్మి ఉన్నత విద్యకు అవసరమైన డబ్బును చెక్కు రూపంలో అందించారు. ‘తన కూతురు మహాలక్ష్మి తెలంగాణ ఏవియేషన్ అకాడమీలో శిక్షణ పొంది పైలట్ కావాలనుకుంటోందని, కానీ తన ఆర్థిక పరిస్థితి సహకరించట్లేదు’అని మాజీ సైనికుడు వీరభద్రాచారి ట్విటర్ ద్వారా కేటీఆర్‌కు విన్నవించారు. కూతురు చదువుకు అవసరమైన ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరారు. వీరభద్రాచారి ట్విటర్‌కు కేటీఆర్ స్పందిస్తూ.. ‘ఒక సైనికుడిగా మీ ధైర్యసాహసాలు అమూల్యమైనవి. తోచిన సహకారం అందిస్తాను’అని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి తెలంగాణ ఏవియేషన్ అకాడమీ డైరెక్టర్ భరత్‌తో ఫోన్‌లో మాట్లాడి మహాలక్ష్మికి సంబంధించిన అడ్మిషన్ వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వీరభద్రాచారిని గురువారం తెలంగాణభవన్‌కు పిలిపించి తెలంగాణ ఏవియేషన్ అకాడమీలో, అతడి కూతురు అడ్మిషన్ పొందేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ తన మిత్రుడి సహకారంతో అందించారు. దేశ స్వాతంత్ర దినోత్సవం రోజున ఒక మాజీ సైనికునికి సహాయం అందించడం కన్నా గొప్పగా స్వాతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడం ఏముంటుందని కేటీఆర్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

సాక్షి
శుక్రవారం, ఆగస్టు, 16

# ప్రధాని కీలక ప్రసంగం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట బురుజులపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం ప్రధానమైన అంశాలెన్నిటినీ స్పృశించింది. అందులో త్రివిధ దళాలను సమన్వయం చేయడానికుద్దేశించిన రక్షణ దళాల ప్రధానాధికారి(సీడీఎస్) పదవిని సృష్టించబోతున్నట్టు చేసిన ప్రకటన, దాంతోపాటు జనాభా విస్ఫోటాన్ని అరికట్టడానికి సంబంధించిన ప్రస్తావన కూడా ఉంది. ప్రస్తుతం అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, చైనాల్లో మాత్రమే సీడీఎస్ పదవి ఉంది. రాష్ట్రపతులుగా ఉన్న వారు సాయుధ దళాలకు సుప్రీం కమాండర్‌గా కూడా వ్యవహరిస్తారు. అయితే అది గౌరవనీయ పదవి మాత్రమే. ప్రధాని నేతృత్వంలో కేంద్రమంత్రి వర్గం సిఫార్సుల ఆధారంగా ఏదైనా దేశంపై యుద్ధం ప్రకటించడం ఈ పదవీ బాధ్యతల్లో ఒకటి. అలాగే విదేశాలతో కుదుర్చుకునే కీలక రక్షణ ఒప్పందాలన్నీ రాష్ట్రపతి పేరిటే ఉంటాయి. రక్షణ రంగానికి సంబంధించిన ఏ కీలక నిర్ణయం తీసుకోవాలన్నా, ఆ రంగానికి సంబంధించిన ఎలాంటి సమస్యల గురించి చర్చించాలన్నా సైన్యం, నావికాదళం, వైమానిక దళం అధిపతులతో ప్రధాని సమావేశం కాక తప్పేది కాదు. ఆ మూడు రంగాల అధిపతులతో ప్రధాని సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చేది. ఇకపై ఆ అవసరం ఉండదు. మొత్తంగా రక్షణరంగ వ్యూహాలను, దాని అవసరాలను సీడీఎస్ ఆధ్వర్యంలో ఆ దళాలే ఖరారు చేసుకుంటాయి. ఇకమీదట త్రివిధ దళాలకు సంబంధించిన సమస్త అంశాలపైనా ప్రధానికి సీడీఎస్ సలహాదారుగా ఉంటారు. అవసరమైనప్పుడల్లా ప్రధాని ఆయనతోనే సమావేశమవుతారు. ఆ దళాలమధ్య మెరుగైన సమన్వయానికి, కలిసికట్టు నిర్ణయాలకు, అవసరం ముంచుకొచ్చినప్పుడు మూడు దళాలూ సత్వరం కదలడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుంది. పైస్థాయిలో సమన్వయం ఉంటేనే క్షేత్రస్థాయిలో అది ప్రతిబింబిస్తుందని రక్షణ రంగ నిపుణులంటారు.

వాస్తవానికి 1999లో కార్గిల్ యుద్ధ సమయంలో త్రివిధ దళాలు ఎదుర్కొన్న కొన్ని సమస్యలను అనంతరకాలంలో అప్పటి యుద్ధ తంత్ర వ్యవహారాల నిపుణుడు కె. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోని ఉన్నతస్థాయి కమిటీ సమీక్షించినప్పుడు సీడీఎస్ వ్యవస్థ ఉంటే వాటిని సత్వరం పరిహరించడం సాధ్యమయ్యేదన్న అభిప్రాయం కలిగింది. అప్పటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వాణీ నేతృత్వంలోని మంత్రుల బృందం కూడా 2001లో దీన్ని సూత్రప్రాయంగా అంగీకరించింది. అటుపై 2012లో నరేష్ చంద్ర ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ సైతం ఈ తరహా కమిటీ అవసరమన్న సూచన చేసింది. త్రివిధ దళాధిపతుల్లో అత్యంత సీనియర్‌ను ఈ పదవికి నియమించాలని ఆ కమిటీ ప్రతిపాదించింది. కానీ ఆ వ్యవస్థ సాకారం కావడానికి రెండు దశాబ్దాల సుదీర్ఘ సమయం పట్టింది. త్రివిధ దళాలకు ఏకీకృత వ్యవస్థ, సమన్వయం అవసరమని అధికారంలోకొచ్చినప్పటి నుంచి నరేంద్ర మోదీ చెబుతూనే ఉన్నారు. గతంలో ఎర్రకోట బురుజులపైనుంచి స్వచ్ఛభారత్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రకటించిన మోదీ... ఈసారి జనాభా నియంత్రణను ప్రధానంగా ప్రస్తావించారు. అలాగే ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, మౌలిక సదుపాయాల రంగంలో రానున్న రోజుల్లో వంద లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించారు. మూడున్నర లక్షల కోట్లతో చేపట్టబోయే 'జల్ శక్తి మిషన్' ద్వారా అన్ని ఇళ్లకూ కుళాయి నీరు ఇవ్వనున్నట్టు తెలిరు. జనాభా అపరిమితంగా పెరిగితే దేశానికెదురయ్యే సమస్యలను ప్రస్తావించడంతోపాటు పరిమిత కుటుంబాల అవసరాన్ని కూడా చెప్పారు. తక్కువమంది పిల్లలున్నవారిని అనుకరించి చూడండని హితవు పలికారు. దీన్ని చర్చించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఇది కేవలం ప్రస్తావన మాత్రమేనా లేక దీనికి సంబంధించి ముమ్మందు కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన కార్యాచరణను ప్రకటిస్తుందా అన్నది చూడాలి. దేశంలో ఒకప్పుడు జనాభా నియంత్రణ మార్మోగేది. 'ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలు' అనే నినాదం అప్పటి ప్రధాన ప్రసార మాధ్యమం ఆకాశవాణితోపాటు సినిమా థియేటర్లలో కూడా హోరెత్తేది. వివిధ కళారూపాల్లో దర్శనమిచ్చేది. కానీ అత్యవసర పరిస్థితి ప్రకటించిన కాలంలో ఇందిరాగాంధీ తనయుడు, అప్పటి యువనేత సంజయ్ గాంధీ బలవంతపు ఆపరేషన్లతో దాన్ని భ్రష్టుపట్టించారు. లక్ష్యాల సాధన కోసం పెళ్లికాని యువకులకు సైతం అప్పట్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారని అనంతరకాలంలో వెల్లడైంది. అటుపై అది 'కుటుంబ సంక్షేమ పథకం'గా పేరు మార్చుకుని ఉందా లేదా అన్నట్టు మిగిలిపోయింది.

సమస్యల పరిష్కారాన్ని వాయిదా వేయడంగానీ, వాటిని తప్పించుకు తిరగడంగానీ తమ విధానం కాదని చెప్పడం ప్రభుత్వ కఠినవైఖరికి అద్దం పడుతుంది. 70 ఏళ్లలో ఎన్నిసార్లు చర్చించినా, ఎంత కృషి చేసినా సాధ్యంకాని 370, 35ఏ అధికరణల రద్దు 70 రోజుల్లో సాధ్యపడిందని ఆయన గుర్తు చేయడం ఇందుకోసమే. అయితే అన్ని అంశాల్లోనూ పట్టువిడుపుల్లేని విధానం ఎటువంటి ఫలితాలనిస్తుందో రాగలకాలంలో జమ్మూ–కశ్మీర్ పరిణామాలు రుజువు చేస్తాయి. ఈచర్య కశ్మీర్‌లో అటు ఉగ్రవాదాన్ని, ఇటు అవినీతిని అంతమొందిస్తుందన్నది ఆయన దృఢవిశ్వాసం. ప్రధాని ప్రసంగంలో ప్రస్తావనకొచ్చిన మరో ప్రధానాంశం అవినీతి. తన తొలి దశ పాలనలోనూ, ఇప్పుడూ ఉన్నతస్థాయి అధికార యంత్రాంగంలో అవినీతిని పారదోలడానికి అనుసరించిన విధానాలను ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉంటూ అవినీతి తిమింగలాలుగా అపకీర్తి గడించినవారిని సర్వీసు నుంచి వెళ్లగొట్టిన వైనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ జాబితాకెక్కిన 312మంది ఉన్నతాధికారులను బలవంతంగా రిటైర్ చేసినట్టు ఈమధ్యే పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది ఉద్యోగిస్వామ్యానికి మాత్రమే కాదు... రాజకీయ రంగంతోసహా అన్ని రంగాలకూ విస్తరింపజేసినప్పుడే సత్ఫలితాలనిస్తుంది. అటువంటి చర్య నిష్పాక్షికతకు కూడా అద్దం పడుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.పాడ్యమి సా.6.11 వరకు, తదుపరి విదియ నక్షత్రం ధనిష్ఠ ఉ.10.11 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం సా.6.10 నుంచి 7.56 వరకు, దుర్ముహూర్తం ఉ.8.17 నుంచి 9.07 వరకు తదుపరి ప.12.30 నుంచి 1.21 వరకు, అమృతఘడియలు... తె.4.25 నుంచి 5.46 వరకు (తెల్లవారితే శనివారం).

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

# కశ్మీరీయులపై ద్వేషమే.. దేశభక్తా?


మల్లెపల్లి లక్ష్మయ్య

**ఈ రోజు కశ్మీర్ లోయలో నివసిస్తున్న ముస్లింలంతా పరాయి దేశస్తులు కాదు. చాలా కాలం బౌద్ధులు గానే ఉన్న వాళ్ళు ఇటు హిందువుల ఆదరణ లేక, అటు ముస్లిం దండయాత్రలను తట్టుకోలేక ముస్లింలుగా మతమార్పిడి చేసుకున్నారు. కశ్మీర్‌లో ఈరోజు ముస్లింలుగా ఉంటూ, భారతదేశ మెజారిటీ ప్రజలందరి దృష్టిలో టెర్రరిస్టులుగా, దేశ ద్రోహులుగా పిలువబడుతున్న వాళ్ళంతా ఒకనాటి బౌద్ధులే, హిందువులే అన్నది మరువకూడదు. కశ్మీర్ భూభాగమే మనకి కీర్తి పతాక అయినప్పుడు అక్కడి ప్రజలు ఎట్లా శత్రువులవుతారు? నిజానికి వాళ్లంతా మన ఈ మట్టి బిడ్డలేనని గుర్తించాలి మనం. ఆ నేలను ప్రేమిస్తే, ఆ ప్రజలను కూడా ప్రేమించాలి. ఈ దేశాన్ని పట్టి పీడిస్తోన్న ద్వేషభావాన్ని విడనాడాలంటే దేశమంటే మట్టికాదని అర్థం చేసుకోవాలి. మనుషుల్ని ప్రేమించగలగడమే నిజమైన దేశభక్తి అని గుర్తెరగాలి.**

''కశ్మీర్ విషయంలో మనం పోరాడే సమయమంతా ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు అని వాదించుకుంటున్నాం. నాకు తోచినంత వరకు ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనేది ముఖ్యం కాదు. ఏది సరైనది అని తేల్చుకోవాలి. నా దృష్టిలో కాశ్మీర్ విభజనే మంచి పరిష్కారం. భారతదేశ విభజన సందర్భంగా చేసినట్లుగానే హిందువులు, బౌద్ధులు ఉన్న ప్రాంతాలను భారతదేశానికీ, ముస్లింలు ఉన్న ప్రాంతాన్ని పాకిస్తాన్‌కు ఇస్తే సరిపోతుంది. లేదా మీకు ఇష్టమైతే కశ్మీర్‌ను మూడు భాగాలు చేయండి. కాల్పుల విరమణ జోన్, కశ్మీర్‌లోయ, జమ్మూ – లదాఖ్ ప్రాంతాలుగా విభజించండి. కశ్మీర్ లోయలో మాత్రమే ప్రజాభిప్రాయ సేకరణ(ప్లెబిసూట్) జరపండి. తమ ఇష్టప్రకారం నడుచుకునే అవకాశం వారికి ఇవ్వండి'' అంటూ 1951, అక్టోబర్ 10 న కేంద్ర న్యాయశాఖ మంత్రిపదవికి రాజీనామా చేసిన సందర్భంగా బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన ఉత్తరంలోని వాక్యాలివి. బాబాసాహెబ్ అంబేడ్కర్ రచనలలో 14వ సంపుటి, రెండవ భాగంలో ఈ ఉత్తరం అచ్చయ్యింది. పాకిస్తాన్ వివాదమే విచారకరమని ఆనాడు అంబేడ్కర్ ప్రకటించారు. ఆ సమయంలో తూర్పు పాకిస్తాన్‌లోని ముస్లిమేతరుల పరిస్థితి గురించి భారతదేశం పట్టించుకోవడం లేదనీ, మన సమయాన్నంతా కశ్మీర్ విషయంలో వెచ్చిస్తున్నామనీ, దీని వల్ల తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్)లో పరిస్థితులను విస్మరిస్తున్నామన్న అభిప్రాయాన్ని అంబేడ్కర్ వెలిబుచ్చారు. అంతేకాకుండా, 1940 డిసెంబర్‌లో రాసిన 'పాకిస్తాన్, భారతదేశ విభజన, పుస్తకంలో పాక్, భారత్ విభజన గురించి చాలా వివరంగా చర్చించారు.

భారతదేశ విభజన జరిగితే, బ్రిటిష్ ప్రమేయంలేని ఒక అంతర్జాతీయ బృందం మధ్యవర్తిత్వంలో విభజన జరగాలని ఆయన ప్రతిపాదించారు. కానీ దానిని ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇప్పటి వరకు అంబేడ్కర్ చేసిన సూచనలను ఎవ్వరూ ప్రస్తావించలేదు. ముఖ్యంగా రాజకీయ నిర్ణయాలు చేస్తున్న పార్టీలకు ఇవేమీ పట్టలేదు. కానీ బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరును మాత్రం తప్పుడు పద్ధతుల్లో ఉదహరిస్తున్నారు. ఆయన ఎక్కడా ప్రస్తావించని విషయాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. పది రోజుల క్రితం జరిగిన కశ్మీర్ విభజన, 370 ఆర్టికల్, 35 ఏ ఆర్టికల్ రద్దు సందర్భంగా అంబేడ్కర్‌ని వివాదాల్లోకి లాగారు. జనసంఘ్, ఆరెస్సెస్ సిద్ధాంత కర్తల్లో ఒకరైన బల్‌రాజ్ మదోక్ పుస్తకంలో, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని, 370 ఆర్టికల్‌ని, అంబేడ్కర్ వ్యతిరేకించినట్టు ఉన్న విషయాన్ని తమ అధికార బలంతో అనవసరంగా ప్రచారం చేస్తున్నారు. అంబేడ్కర్ 370 ఆర్టికల్‌ని వ్యతిరేకించినట్టు ఆయన రచనల్లోగానీ, ప్రసంగాల్లోగానీ ఎక్కడా లేదు. జనసంఘ్ ప్రముఖ నేత రాజ్యాంగ సభ సభ్యులు శ్యాంప్రసాద్ ముఖర్జీతో అంబేడ్కర్ అన్నట్టు బుల్‌రాజ్ మదోక్ తన పుస్తకంలో రాసుకున్నారు. అయితే దీనికి ఎటువంటి ఆధారాలు లేవు. నిజానికి అంబేడ్కర్ తన అభిప్రాయాలను ఎప్పుడూ దాచుకోలేదు. వ్యక్తులతో ప్రైవేట్‌గా చర్చించే విషయంలోనూ ఆయన ఎప్పుడూ పరిమితులు విధించుకోలేదు. ఒకవేళ అంబేడ్కర్‌కు అటువంటి అభిప్రాయమే ఉన్నట్లయితే, 1951, అక్టోబర్‌లో రాసిన లేఖలో దాన్ని తప్పనిసరిగా పేర్కొనేవాడు.

### కొత్త కోణం




బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎల్లప్పుడూ మైనారిటీల భద్రత, రక్షణ, హక్కుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆయన ప్రజాస్వామ్య దృక్పథంలో మైనారిటీల హక్కులనేవి అత్యంత ముఖ్యమైనవి. అవి కులం, మతం, ప్రాంతం, భాష ఏ కోణమైనా కావచ్చు. అందుకే అంబేడ్కర్ నిజమైన ప్రజాస్వామ్య దృక్పథం కలిగి ఉన్నాడని అర్థం చేసుకోవాలి. భారతదేశ భవిష్యత్తు గురించీ, సామాజిక అణచివేత, పీడనల నుంచి విముక్తి కోసం ఆలోచించి, దాని అమలుకోసం అహరహం శ్రమించిన వారిలో అంబేడ్కర్ అతి కీలకమైన వ్యక్తి. అటువంటి వ్యక్తి అభిప్రాయాలను తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం సరైనది కాదు. ప్రస్తుతం కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులకు మనమంతా కశ్మీర్ ప్రజలను బాధ్యులను చేయడానికే ప్రయత్నం చేస్తున్నాం. ఈ రోజు భారతదేశంలోని చాలా మంది మనసుల్లో కశ్మీర్‌లో ఉన్న ముస్లింల పట్ల ఒక వ్యతిరేక భావాన్ని నింపారు. ఇది చాలా ఉచ్ఛస్థాయికి చేరింది. కశ్మీర్‌పై భారత ప్రభుత్వం తీసుకున్న ఆర్టికల్ 370 రద్దు అనే తీవ్రమైన నిర్ణయం ఒక ముఖ్యమైన విషయంగా మారింది. ఇది భారత్ దేశ ప్రజలందరి సమస్యగా మార్చారు. కశ్మీర్ భూభాగం మీద అపారమైన ప్రేమ, భక్తి, అక్కడ నివసిస్తున్న ప్రజల మీద ద్వేషాన్ని మెజారిటీ ప్రజలకు కలిగించారు. అందులో భాగమే 370 ఆర్టికల్ రద్దు.

నిజానికి కశ్మీర్‌లో ఈ రోజు నివసిస్తున్న ప్రజలు ముఖ్యంగా ముస్లింలు అందరూ ఎక్కడో మధ్య ఆసియా నుంచి వచ్చిన వాళ్ళు కాదు. నిజానికి కశ్మీర్ ప్రాంతానికి ఇస్లాం ప్రవేశించింది 14వ శతాబ్దంలో. అంతకు ముందు ఈ ప్రాంతం భారతదేశంలోనే ఆవిర్భవించిన బౌద్ధం, హిందూ మత సాంప్రదాయాలలోనే ఉంది. క్రీస్తు పూర్వం 3 వేల సంవత్సరాలకు పూర్వం నుంచి ఇక్కడ ప్రజలు నివసిస్తున్నట్టు ఆధారాలున్నాయి. వేదకాలం నుంచి ఇక్కడ జనజీవనం అభివృద్ధి చెందిందని చరిత్రకారులు భావిస్తున్నారు. అలెగ్జాండర్ దండయాత్రలను కూడా ఈ ప్రాంతం చవిచూసింది. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో సామ్రాట్ అశోకుడు మౌర్య సామ్రాజ్యాన్ని ఇక్కడికి విస్తరింపజేశాడు. అనాటి నుంచే బౌద్ధం ఈ ప్రాంతమంతటా వ్యాప్తి చెందింది. ఆ కాలంలోనే శ్రీనగర్ పట్టణం నిర్మాణమైంది. క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో రాజ్యమేలిన కుషాన్ వంశ రాజైన కనిష్కుడు బౌద్ధానికి మరింత విస్తృత ప్రచారం కల్పించాడు. బౌద్ధం నాలుగవ సంగీతి కశ్మీర్‌లోనే జరిగింది. క్రీస్తు శకం 502లో సైనిక తిరుగుబాటు చేసి అధికారంలోకి వచ్చిన మిహిరకులుడు అత్యంత పాశవికంగా బౌద్ధులను హతమార్చాడు. ఆ తర్వాత శైవ మతం అక్కడ బాగా వ్యాప్తి చెందింది. ఈ క్రమం చాలా కాలం కొనసాగింది. అయితే ముస్లిం దండయాత్రలు మొదలైంది 1103లో అని చరిత్రకారుడు మొహిబిల్‌హసన్ చెప్పారు. ఇది కూడా స్థానిక రాజులు, సామంతుల మధ్య ఉన్న అనైక్యత వల్లనే ముస్లిం సైన్యాలు కశ్మీర్‌ను ఆక్రమించుకున్నాయి. ఇది చరిత్ర.

ఇదంతా ఇక్కడ ప్రస్తావించడానికి కారణం ఉన్నది. ఈ రోజు కశ్మీర్‌లోయలో నివసిస్తున్న ముస్లింలంతా పరాయి దేశాల నుంచి వచ్చిన వాళ్ళు కాదు. వాళ్ళు మొదట వేద సంస్కృతిలో, ఆ తర్వాత బౌద్ధంలో, తదనంతరం హిందువులుగా మారారు. చాలా కాలం బౌద్ధులు గానే ఉన్న వాళ్ళు ఇటువైపు హిందువుల ఆదరణ లేక, అటు వైపు ముస్లిం దండయాత్రలను తట్టుకోలేక ముస్లింలుగా మతమార్పిడి చేసుకున్నారు. నేటి అఫ్గానిస్తాన్, పాకిస్తాన్ దేశాలు ఒకనాటి గాంధార, పెషావర్ రాజ్యాలు. అవన్నీ కూడా బౌద్ధంలోనే వికాసం చెందాయి. కానీ హిందువుల ఊచకోత, ముస్లింల దాడులు కలగలిసి బౌద్ధులందరూ హిందువులుగా, ముస్లింలుగా మారిపోయారు. అందుకే అఫ్గానిస్తాన్. పాకిస్తాన్, కశ్మీర్, బంగ్లాదేశ్‌లలో ముస్లింల జనాభా ఆ స్థాయిలో పెరిగింది. అందుకే కశ్మీర్‌లో ఈరోజు ముస్లింలుగా ఉంటూ, భారతదేశ మెజారిటీ ప్రజలందరి దృష్టిలో టెర్రరిస్టులుగా, దేశ ద్రోహులుగా పిలువబడుతున్న వాళ్ళంతా ఒకనాటి బౌద్ధులే, హిందువులే అన్న విషయం మరువకూడదు. వాళ్లంతా తరతరాల నుంచి ఇక్కడి సంస్కృతీ, సాంప్రదాయాలకు నిజమైన వారసులే. ఆధునిక భారతదేశంలో స్వార్థ రాజకీయాల కారణంగా వాళ్ళు భారత దేశానికి శత్రువులుగా కనిపిస్తున్నారు.

అందువల్లనే అక్కడ కశ్మీర్ ప్రజలు నిత్యయుద్ధవాతావరణంలో సతమతమౌతోంటే, ఏ క్షణం ఏం జరుగుతుందో అని గుండెలు గుప్పిట్లో పెట్టుకొని ప్రాణభయంతో బతుకులీడుస్తోంటే మనం ఆనందంలో గంతులు వేస్తున్నాం. ఇప్పటి వరకు దాదాపు 80 వేల మంది కశ్మీరీ ప్రజలు ప్రాణాలు కోల్పోతే మనకు చీమకుట్టినట్టయినా లేదు. కశ్మీర్ భూమి మనకు పవిత్రమైనదైనప్పుడు, ఒట్టి మట్టికే మనం అంత గౌరవం ఇస్తున్నప్పుడు, కశ్మీర్ భూభాగమే మనకి కీర్తి పతాక అయినప్పుడు అక్కడి ప్రజలు ఎట్లా శత్రువులవుతారు? నిజానికి వాళ్లంతా మన ఈ మట్టి బిడ్డలేనని గుర్తించాలి మనం. ఆ నేలను ప్రేమిస్తే, ఆ ప్రజలను కూడా ప్రేమించాలి. ఈ దేశాన్ని పట్టి పీడిస్తోన్న ద్వేషభావాన్ని విడనాడాలంటే దేశమంటే మట్టికాదని అర్థం చేసుకోవాలి. ఏ భూమిపై నున్న మనుషులైనా మనుషులేననీ, మనుషుల్ని ప్రేమించగలగడమే నిజమైన దేశభక్తి అనీ గుర్తెరిగి మసలుకుంటే మానవత్వం పరిమళిస్తుంది. లేదంటే ఒక కశ్మీర్ కాదు దేశమంతటా కల్లోలాలు పెల్లుబుకుతూనే ఉంటాయి.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్ : 81063 22077

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### జోహార్లు



"70వ దశకంలో ఎదుగుతూ వచ్చిన మా తరానికి 'ఛోటీ సీ బాత్', 'రజనీగంధ' వంటి చిత్రాలు మధ్యతరగతి సినిమాకు నిర్వచనాలు. వీనులవిందైన సంగీతపరంగా మాత్రమే కాదు... ఆనాటి నిష్కపటుత్వ దశకు విద్యాసిన్హా కూడా ఒక ప్రతీక. అంతేకాదు అందులో విడదీయరాని భాగం. గురువారం కన్నుమూసిన అలనాటి కథానాయికకు నా స్మృత్యంజలి"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ పాత్రికేయుడు

### మీ ఇల్లే మునిగితే ఎలాగయ్యా?



"మీరు ఓడిపోవడమేంటయ్యా' అని అప్పట్లో చంద్రబాబు మహిళా కార్యకర్తలతో ఉత్తుత్తి శోకాలు పెట్టించారు. ఇప్పుడు మీ ఇల్లు మునిగి పోవడమేంటయ్యా? వరదలో కొట్టుకుపోతే పోయింది. మా ఇంట్లో వచ్చి ఉండండయ్యా అని వందలాది మంది బాబును బతిమాలుతున్నట్టు వ్యంగ్య చిత్రాలతో సోషల్ మీడియా ఆడుకుంటోంది. నదులు, వాగులను తవ్వి ఏ ఇసుక నుంచి ధనరాశులు పోగు చేసుకున్నాడో ఇప్పుడు అవే ఇసుక బస్తాలతో కరకట్ట కొంపను వరద నుంచి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ప్రకృతితో పెట్టుకుంటే మటాషే బాబూ"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నేత

### సారాంశం



"పెహ్లూఖాన్ కేసులో నిందితులందరూ నిర్దోషులని న్యాయస్థానం తేల్చింది. పౌరులంతా హిందూ–ముస్లిం, కాంగ్రెస్–బీజేపీ వగైరా వివాదాల్లో కూరుకుపోయి ఉన్న తరుణంలో... మరో పౌరుడికి న్యాయం దక్కని స్థితి ఉంది. అంతటా అవినీతి గూడుకట్టుకుని ఉంది. చట్టంలోని లొసుగులకు నిరుపేదలు బలవుతుంటే, బలవంతులు సులభంగా దాన్నుంచి తప్పించుకుంటున్నారు"

– సోనమ్ మహాజన్, హిందూ, హేతువాది

### అసాధ్యం



"370 అధికరణను చెత్తబుట్టలో వేయడం ద్వారా కశ్మీర్‌ను పూర్తి స్థాయిలో విలీనం చేశాక ప్రధాని నరేంద్ర మోదీ త్రివిధ దళాలను ఒకే ఛత్రం కిందకు తీసుకురావాలన్న 20 ఏళ్లనాటి సిఫార్సును సాకారం చేశారు. ప్రధాని మోదీ తీసుకున్న ఈ అత్యంత కీలకమైన సాహసోపేత నిర్ణయంతో మన శత్రువులు భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని కలగనడం కూడా ఇకపై అసాధ్యమే అవుతుంది"

– అవిరాళ్ శర్మ, రచయిత

### చిరస్మరణీయులు



"గత అరవైయేళ్లలో దేశంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదనే తప్పుడు ప్రచారానికి భిన్నంగా మన దేశం అనేక రంగాల్లో బ్రహ్మాండంగా ఎదిగింది. ఆధునిక భారత నిర్మాతలు దేశ స్వాతంత్ర్యానంతరం వేసిన పునాదిరాళ్లే ఇంతటి మహత్తర అభివృద్ధికి కారణం. ఈ శుభదినాన వారందరినీ స్మరించుకోవడమంటే మనల్ని గురించి మనం తెలుసుకోవడం, మనమేం చేయగలమో గ్రహించడం"

– పుష్పరాజ్ దేశ్‌పాండే
డైరెక్టర్, సమృద్ధ భారత్ ఫౌండేషన్

# ఒకే రాజ్యాంగం, ఒకే పన్ను ఒకే ఎన్నిక నిజమేనా?

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

ఒకే దేశం ఒకే రాజ్యాంగం, ఒకే దేశం ఒకే పన్ను, ఒకే దేశం ఒకే ఎన్నిక అని లాల్‌ఖిలా నుంచి ప్రధాని నినదించారు. ఒకే దేశం. మనది రాష్ట్రాల సమూహం, రాజ్యాల సంఘం. భిన్నత్వంలో ఏకత్వం మన లక్షణం కాని, వైవిధ్యంలేని ఏకత్వం కాదు. మనమంతా ఒకటి కాదు అంటే నమ్మడం కష్టం కానీ.. విడివిడి సంస్కృతులు, భాషలతో జీవించే విభిన్న జీవన స్రవంతులన్నీ కలిసి ఒక దేశంగా ఉన్నాయనే వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం అవసరం. మన రాజ్యాంగం ఒకటే, మన ఐపీసీ ఒకటే, మన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కూడా ఒకటే కానీ, రాష్ట్రాలకు సంబంధించినంత వరకు కొన్ని సవరణలు చేసుకునే అధికారాలు, చట్టాలు చేసుకునే స్వతంత్రత రాష్ట్రాలకు ఉన్నాయి. ప్రముఖ న్యాయశాస్త్రవేత్త ఉపేంద్ర బక్షీ, మనకు మూడు రాజ్యాంగాలు ఉన్నాయంటారు. ఒకటి 1950లో మనం రాసుకున్నది. మరొకటి వంద సవరణల ద్వారా మనం మార్చుకున్నది. మూడోది మన నియమాలు, సవరణల అసలు స్వరూపం ఏమిటో చెప్పే సుప్రీంకోర్టు తీర్పులలో వ్యక్తమైంది. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక రాజ్యాంగం ఉంది. అయినా ఆదేశం ఒకటి కాదనగలరా? అనేక రాజ్యాలు, చట్టాలు, సంప్రదాయాలు ఉండడం అవలక్షణం కాదు, అవసరమైన వైవిధ్య లక్షణం.

ఇక ఒకదేశం ఒక పన్ను. పన్నులు కట్టేవాడికి తెలుస్తుంది ఎన్నిరకాల పన్నులు కడుతున్నాడో. అసలు ఒకే పన్ను అనే మాట ఒక ఫన్. ఒక పరిహాసం, ఒక అవాస్తవం. జీఎస్టీలే రెండు రకాలు, ఒకటి కేంద్రానిది మరొకటి రాష్ట్రానిది. అది కూడా అన్నిటికీ ఒకే రేటు కాదు. నానా రేట్లు ఉన్నాయి. ఆదాయం పన్ను, సంపద పన్ను, శిస్తులు వంటివి జీఎస్టీ కాకుండా, ముందునుంచే ఉన్నాయని అందరికీ తెలుసు.

మరో చోద్యం, వింత ఏమిటంటే.. ఒకే దేశం, ఒకే ఎన్నిక. జమ్మూ కశ్మీర్లో శాసనసభకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నిక జరిపించడానికి అసలు ఏ అడ్డూ లేదు. రాజకీయ ప్రయోజనాలమీద ఆశలే ఎన్నికల్ని నిర్ణయిస్తాయి. ఆ ''ఒకే ఎన్నిక''ను జరపలేక చతికిలపడిన వారిదే ఈ నినాదం. కాంగ్రెస్ ప్రభుత్వాలు 356వ అధికరణాన్ని, అందులో లభించే అత్యవసర అధికారాన్ని అకారణంగా, అక్రమ కారణంగా 90 సార్లకు పైగా దుర్వినియోగం వల్ల ఒకే ఎన్నికలు జరపడం సాధ్యం కాలేదు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత 356 అధికరణాన్ని దుర్వినియోగం చేయడంలో పద్ధతులు, ప్రయత్నాలు, వ్యూహాలు మారాయి. టోకు ఫిరాయింపులు చేయించే ధనవ్యాపార రాజకీయం విజృంభిస్తున్నది. మూడింట రెండు వంతుల మంది సభ్యులు లేకపోతే, ఎంఎల్యేలను కొని, ఫైవ్‌స్టార్ హోటళ్లలో స్టాక్‌గా పారేస్తారు. ప్రభుత్వాలను పడగొట్టి, గద్దెనెక్కుతారు. వీలుకాకపోతే గందరగోళం సృష్టించి ఓటింగ్‌లో గెలిచి ప్రభుత్వాన్నో ప్రతిపక్షాన్నో కొని పడేస్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా లేకపోతే సర్కారును రద్దు చేస్తారు. అనుకూలంగా ఉంటే తమ పార్టీ తీర్థం పుచ్చుకోమంటారు.

తెలంగాణ, ఆంధ్ర మరికొన్ని రాష్ట్రాలలో జమిలి ఎన్నికలు సహజంగా జరిగేవి. తెలంగాణ ఎన్నికలను ముందుకు జరిపిందెవరు? అప్పుడు ఒకే ఎన్నిక విధానం ఏమైంది? ఆర్నెల్లలోనే రెండు ఎన్నికలకు రాష్ట్రం ఎందుకు సమాయత్తం కావలసి వచ్చింది? కాలం, చట్టం, ఆచారం అనుకూలంగా ఉన్నా ఒకే రాష్ట్రం రెండు ఎన్నికలను కనీసం రెండు రాష్ట్రాలలో అమలు చేయలేని ప్రభుత్వం దారి ఏమిటో దాని శుద్ధి బుద్ధి ఏమిటో? అత్యధిక రాష్ట్రాలలో పాలిస్తున్న బీజేపీ, వేరే పార్టీల అధీనంలో ఉన్న రాష్ట్రాలలో కేంద్రాన్ని కాదని వ్యతిరేకించే ధైర్యమున్న ముఖ్యమంత్రులు తక్కువే. మూడింట రెండు వంతుల ఆధిక్యతతో, సగానికి పైగా రాష్ట్రాల ఆమోదం పొందడం కూడా ఇప్పుడున్న పరిస్థితులతో కష్టం కాదని రుజువైంది. ఇప్పుడు అన్ని రాష్ట్రాలకు, పార్లమెంటుకు ఒకేసారి 2024 ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమేం కాదు. కానీ నిర్వహిస్తారా? తమకు గెలిచే అవకాశం ఉందనుకుంటేనే జరుగుతాయా? రాష్ట్రంలో లోక్‌సభకు, శాసనసభకు ఒకే ఎన్నిక జరిపించడానికి అడ్డొచ్చిన అవసరాలే జమిలి ఎన్నికలకూ ఏర్పడతాయి.

నినాదాలు చేయడంవేరు, విధానాలు రచించడం వేరు. విధానాలను సక్రమంగా రచించడం కోసమే సంవిధానం ఉంది. సంవిధానాన్ని కాదనుకుంటే, లేదనుకుంటే, ఉన్నా అది వేరు పాలన వేరు అనుకుంటే వారికి ఏదీ చెప్పడం సాధ్యం కాదు. స్వేచ్ఛగా వ్యవహరించి, శాస్త్రీయంగా ఆలోచించి, సహేతుకంగా అభిప్రాయాన్ని ఏర్పరచుకుని, ధైర్యంగా చెప్పగలవాళ్లుంటేనే ప్రజాస్వామ్యం ఉంటుంది. మూఢంగా నమ్మడం మతంలో కుదురుతుందేమో కానీ సమాజంలో, రాజకీయంలో సాగించకూడదు. అభివృద్ధిని అవసరమైన వస్తువులాగా చూపి, టెర్రరిజం ప్రమాదాన్ని భయానక వాతావరణం కల్పించడానికి అనువుగా వాడుకుని, స్వతంత్రతను, స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, అధికార వికేంద్రీకరణను దెబ్బతీస్తూ ఉంటే మౌనంగా ఉండడం నేరమవుతుంది. మోదీ వల్ల ప్రజాస్వామ్యానికి వచ్చే ప్రమాదం కన్నా గుడ్డిగా ఆమోదించేవారి వల్ల ప్రమాదం ఎక్కువ. అయితే ఎవరేమన్నా, అనుకున్నా, తిట్టినా లైక్ చేయకపోయినా, నిజానిజాలను హేతుబద్ధంగా విశ్లేషించడం రాజ్యాంగ విధి, చట్టపరమైన బాధ్యత, నైతిక బాధ్యత, దేశ భక్తుల బాధ్యత. భయపడకండి, ధైర్యంగా విమర్శించండి, ఆ విమర్శల జడివానలకు బ్రిటిష్ పాలకులే పారిపోయారు. విమర్శాస్త్రం ముందు స్వార్థపర అవకాశవాద రాజకీయులేం నిలబడతారు?

స్వాతంత్ర్య దినోత్సవంలో దినం కాదు ప్రధానం, ఉత్సవం అంతకన్నా ప్రధానం కాదు. స్వతంత్రం ప్రధానం. దినాలు, ఉత్సవాలు మనకు స్వాతంత్ర్యాన్ని గుర్తు చేయాలి.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# జగన్ రాకకోసం... సిద్ధంగా డల్లాస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత పర్యటనలో భాగంగా డల్లాస్‌లోని తెలుగు ఎన్నారై కమ్యూనిటీతో 17వ తేదీన సమావేశం కానున్నారు. డల్లాస్‌లోని అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్స్‌లో ఒకటైన కేబిల్లే కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి అమెరికా నలుమూలల నుంచి, కెనడా నుంచి కూడా తెలుగువాళ్ళు పెద్దసంఖ్యలో హాజరు కానున్నారు. ఈ కార్యక్రమం కోసం తెలుగు కమ్యూనిటీ ఆఫ్ నార్త్ అమెరికా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. అమెరికాలోని అతి పెద్ద జాతీయ తెలుగు సంఘాలతోపాటు, ప్రాంతీయ తెలుగు సంఘాలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తోంది. తెలుగు ఎన్నారై ప్రముఖులను, ఇతరులను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానిస్తోంది.

ఏపీ సీఎంగా బాధ్యతలను స్వీకరించాక వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి తొలిసారిగా అమెరికాలో వ్యక్తిగత పర్యటన చేస్తున్నారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌సీపీ ఎన్నారై నాయకులు, వైఎస్ ఆర్‌ను అభిమానించే ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) నాయకులు ఆయనను కలుసుకుని అమెరికాలోని పార్టీ అభిమానులను ఉద్దేశించి ప్రసంగించాల్సిందిగా కోరారు. అమెరికాలోని అన్ని సంఘాలను, కుల– ప్రాంతాలకు అతీతంగా తెలుగువారందరినీ ఒకే వేదికపైకి ఆహ్వానించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే తాను వస్తానని సీఎం చేసిన సూచన మేరకు, ఈ సమావేశంలో జాతీయ తెలుగు సంఘాలను, ఇతర సంఘాలను పాలుపంచుకునేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

ఆగస్టు 17న జరగనున్న ఈ ఆత్మీయ సమావేశాన్ని తెలుగువారు ఎక్కువగా ఉండే డల్లాస్‌లో నిర్వహించనున్నారు. అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ అయిన డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌ను దీనికోసం బుక్ చేశారు. అమెరికాలో ఉంటూ వైఎస్‌ఆర్‌సీపీ విజయంకోసం శ్రమిస్తున్న వారితో ఓ కమిటీని ఏర్పాటు చేసి. నేషనల్ కో ఆర్డినేటర్లుగా వారిని నియమించారు. అలాగే జాతీయ తెలుగు సంఘాలను, ఇతర సంఘాలను, డల్లాస్‌లో ఉన్న స్థానిక తెలుగు సంఘాలను కలుపుకుని హోస్ట్ కమిటీని రూపొందించారు. తెలుగు సంఘాల అధ్యక్షులను, స్థానికంగా ఉన్న నేతల్ని కూడా ఈ కమిటీలో తీసుకున్నారు. తానా, ఆటా, నాటా, నాట్స్, ఆటా తెలంగాణ, తెలంగాణ తెలుగు అసోసియేషన్, టాంటెక్స్, ఆప్తా, టీడీఎఫ్, డాటా, టీపాడ్, ఐఎన్‌టీ, ఎన్నారై వాసవీ అసోసియేషన్ వంటి ప్రముఖ సంస్థలన్నీ ఈ సమావేశంలో పాల్గొనడం విశేషం. వైఎస్ జగన్ డల్లాస్ పర్యటనను విజయవంతం చేసేందుకు అటు ఎన్నారై వైఎస్‌ఆర్‌సీపీ నేతలతోపాటు, స్థానికంగా ఉండే తెలుగు సంఘాలు, జాతీయ తెలుగు సంఘాలు కూడా తోడ్పాటునివ్వడం మంచిపరిణామం. అన్ని సంఘాలు, తెలుగు ప్రముఖులు ఒకే వేదికపై వచ్చి ముఖ్యమంత్రి సందేశాన్ని వినడానికి, ఆయనను కలిసేందుకు ముందుకురావడం రాష్ట్ర ప్రయోజనాలకు తోడ్పాటునిస్తుందని ఆశిద్దాం.

– చెన్నూరి వెంకట సుబ్బారావు
అమెరికాలోని 'తెలుగు టైమ్స్' పత్రిక సంపాదకులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శుక్రవారం
16-8-2019

అలమటింపు

# పాలిస్తాం... చోటివ్వండి

గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన పల్లె జనం పట్టణాల నుంచి ఏం నేర్చుకుంటున్నారో తెలియదు కానీ చాలా విషయాల్లో గ్రామీణ ప్రజల్లోని మానవత్వం, అమాయకత్వం, ప్రేమా మన మనసుల్ని పల్లెలవైపు పరుగులు తీయిస్తుంటుంది. అది గుర్తొచ్చినప్పుడల్లా మననుంచి దూరమైనవేవో మనసుని నొప్పిస్తుంటాయి. ఇటీవల ఆగస్టు తొలివారంలో తల్లిపాల ప్రాధాన్యతను చాటిచెప్పే వారోత్సవాలను గురించి చదివినప్పుడు గుండెల్లో అలాంటిదే ఏదో నొప్పి బయలుదేరింది. కొద్దినెలల క్రితం చదివిన ఓ విషయం గుర్తొచ్చింది. బహుశా అలాంటి నొప్పినే, అలాంటి బరువునే గుండెల్లో నింపుకొని భారంగా, బాధగా బతుకులీడుస్తోన్న లక్షలాది మంది పట్టణాల్లోని పసిబిడ్డల తల్లులు గుర్తొచ్చి నాగరికత పేరుతో, అభివృద్ధి పేరుతో కుప్పలు తెప్పలుగా నిర్మితమౌతోన్న అమానవీయ, అనాగరిక కట్టడాలపై ఏహ్యభావం ఏర్పడింది. బహుళంతస్తుల సెంట్రలైజ్డ్ ఏసీ భవనాల్లో ఆరోగ్యం కోసం కూడా నాలుగు మెట్లు ఎక్కే బాధే లేకుండా ఎస్కులేటర్లు చాలా సుఖవంతమైనవే. అలాంటి చాలా సౌకర్యవంతమైన ఎన్నో షాపింగ్ కాంప్లెక్స్‌లూ, మల్టీప్లెక్స్‌లూ నగరం నిండా జనానికి చోటే లేకుండా అవే భవనాలు. అలా సకల సౌకర్యాలతో విలసిల్లుతోన్న షాపింగ్ 'పెద్ద' బజారుల్లో ఓ తల్లి కళ్లు దేనికోసమో వెతుకుతూనే ఉన్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లోని ట్రయల్ రూం ముందున్న సింగిల్ స్టూల్‌పై కూర్చొని జీన్స్ పైన సౌలభ్యం కోసం వేసుకున్న లూజ్ టీషర్టుని ఓ వారగా గబగబా పైకి లాగి చిన్నారి నోటికి స్థనాన్ని అందించిందో చిన్నపిల్ల తల్లి. అంతే! అంతలోనే అక్కడికొచ్చిన ఓ వ్యక్తి అది పిల్లలకు పాలివ్వడం కోసం ఏర్పాటుచేసిన స్థలం కాదనీ, తక్షణమే ఖాళీ చేయాలనీ నిస్సిగ్గుగా తేల్చి చెప్పాడు. మరి ఏడుస్తున్న బిడ్డకి పాలెక్కడివ్వాలి? ఆమె ప్రశ్నకి సమాధానంగా 'అదిగో అక్కడుంటాయి టాయ్‌లెట్స్. అందులో కూర్చొని ఇవ్వొచ్చు' అని ఉచిత సలహా ఒకటి పారేసి వెళ్లాడు. తల్లిపాలు కల్తీ లేనివి. కల్తీ చేయలేనివి. గుండెల్నిండుగా హత్తుకుని ఇచ్చే తల్లిపాలు బిడ్డ ఆకలి మాత్రమే తీర్చవు. ప్రేమతో నిండిన పాలిండ్ల స్పర్శ బిడ్డకూ, తల్లికీ కూడా ఆరోగ్యాన్నిస్తాయి. అలాంటిది అపరిశుభ్రమైన ప్రాంతంలో, దుర్గంధంతో నిండిన విసర్జిత ప్రాంతంలో బిడ్డకు పాలివ్వమని చెప్పే పరిస్థితి ఈ పట్టణాల్లో మనం మిస్సవుతోన్నదేమిటో మనకు గుర్తు చేస్తోంది. అంతెందుకు చాలా రోజుల క్రితం రోడ్డుపక్కగా (మిగిలిన వాహనదారులకు ఏ ఆటంకం లేకుండా) కారు ఆపుకుని బిడ్డకు పాలిస్తోన్న తల్లిపై ట్రాఫిక్ కానిస్టేబుల్ చేసిన రుబాబూ, రాద్ధాంతం టీవీ చూసినవారందరికీ గుర్తుండే ఉంటుంది. రోడ్డుపైన అడ్డదిడ్డంగా కార్లు పార్కుచేసినా కిమ్మనకుండా వెళ్లిపోయే వాళ్లు కూడా పసిబిడ్డకు పాలిచ్చేప్పుడు ఆటంక పరచకూడదనే ఇంగితం లేకుండా పోయింది. అయితే ఆ ఇంగితం ఉండాల్సిందెవరికి? నిజానికి నగరాలకే. పర్యావరణాన్ని గాలికి వదిలేసి, అనుమతులకు చెల్లుచీటీ ఇచ్చేసి, కుప్పలుతెప్పలుగా కట్టేసోన్న బహుళంతస్థుల భవనాల్లో మహిళలకు కావాల్సిందేమిటో ఎవ్వరైనా ఆలోచించారా? పసిబిడ్డలకు పాలిచ్చే ఓ రెండడుగుల ప్రైవసీ స్థలం. ఓ చిన్ని కుర్చీ. ఇంత చిన్న విషయం కొన్ని వేల మంది సమస్య అయినప్పుడు ఇదెందుకు తట్టదు ఎవరికీ? అంటే అది స్త్రీల సమస్య మాత్రమే కాబట్టి. ఆడపిల్లలకి ఏరకంగానూ అక్కరకు రాని నగరాలను నాగరికంగా మార్చగలమా?

– అరుణ అత్తలూరి



ప్రతీకాత్మక చిత్రం : 'పాలిచ్చే తల్లులకు కాస్త చోటు చూపించండి' అంటూ ఇటీవలే ఆన్‌లైన్ వేదికగా ఒక ఉద్యమం మొదలైంది.

> గుండెల్నిండుగా హత్తుకుని ఇచ్చే తల్లిపాలు బిడ్డ ఆకలి మాత్రమే తీర్చవు. ప్రేమతో నిండిన పాలిండ్ల స్పర్శ బిడ్డకూ, తల్లికీ కూడా ఆరోగ్యాన్నిస్తాయి. అలాంటిది.. అపరిశుభ్రమైన ప్రాంతంలో, దుర్గంధంతో నిండిన విసర్జిత ప్రాంతంలో బిడ్డకు పాలివ్వమని చెప్పే పరిస్థితి ఈ పట్టణాల్లో మనం మిస్సవుతోన్న దేమిటో మనకు గుర్తు చేస్తోంది.

చెట్టు నీడ

# చిన్నారి సుగుణం

అక్కడ అంతా కోలాహలంగా ఉంది. ఏదో వేడుక జరుగుతోంది. అది ఒక సంపన్నకుటుంబం తమ గారాలపట్టి నజ్మాకి జరుపుకుంటున్న పుట్టిన రోజు వేడుక. ఖరీదైనకార్లు ఫంక్షన్ హాల్ పార్కింగ్ లో బారులు తీరుతున్నాయి. వాటిల్లోంచి ఖరీదైన మనుషులు దిగుతున్నారు. నిర్వాహకులు వారిని ఎంతో ప్రేమతో, గౌరవంతో స్వాగతం పలికి ఆహ్వానిస్తున్నారు. ఒక వైపు వేదిక. మరోవైపు భోజనశాల. రకరకాల రుచికరమైన వంటకాలు. అక్కడ దేనికీ లోటులేదు. తిన్నవాళ్ళకు తిన్నంత. అతిథులంతా భోజనానికి కూర్చున్నారు. తినేది కొంతయితే వదిలేసేది ఇంకెంతో..



ఇదంతా అక్కడికి కొద్దిదూరంలో ముడుచుకొని కూర్చున్న ఓ యాచకురాలు గమనిస్తోంది. రెండురోజులనుండి తినడానికి ఏమీ దొరక్క ఆకలితో కడుపు నకనకలాడుతోంది. ఒకరిద్దరు తినే దాంట్లో మిగిలిన ఎంగిలి తనకు పెట్టినా సరిపోతుంది. ఈ రోజు తన కడుపు నిండినట్లేనని ఆశతో చిన్నగా అడుగులో అడుగు వేసుకుంటూ, భోజనశాల ముఖద్వారం వద్దకు చేరుకుంది.

కాని నిర్వాహకులు ఆమెను అడ్డుకున్నారు.

''అయ్యా.. ఆకలవుతోంది ఒక్కముద్ద అన్నం పెట్టమని వేడుకుంది ఆ వృద్ధురాలు. కాని వారు ఏమాత్రం కనికరం చూపకుండా నిర్దాక్షిణ్యంగా గెంటివేశారు. వేదికపైనుండి తన టీచర్ కోసం ఎదురుచూస్తున్న చిన్నారి నజ్మా ఇది గమనించింది. నజ్మా ఆరవ తరగతి చదువుతోంది. ఆ స్కూల్ టీచర్ శాలిని అంటే ఆమెకు చాలా ఇష్టం. ఆమె తరగతి పాఠాలతో పాటు ఎన్నో నీతి కథలు కూడా చెప్పేది. అవన్నీ ఆ చిన్నారి మనసులో ముద్రించుకు పోయాయి. దాంతో తను అందుకుంటున్న అభినందనలను కాసేపు పక్కకు పెట్టి వేదిక దిగింది. నేరుగా వృద్ధురాలి దగ్గరకు వెళ్ళింది. ఆప్యాయంగా ఆమె చేయిపట్టుకొని భోజనశాలకు తీసుకెళ్ళింది. తన పక్కన కూర్చోబెట్టుకుని తృప్తిగా భోజనం చేయించింది. నేరుగా వేదిక వద్దకు తీసుకెళ్ళి కొన్ని కానుకలు, కొంతనగదు ఇచ్చింది. ఇదంతా గమనిస్తున్న నిర్వాహక పెద్దలంతా సిగ్గుతో తలదించుకున్నారు.

– మదీహా అర్జుమంద్



చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు. చెవుల్ని చేతుల్లోకి తీసుకోవచ్చు. చెప్పిన మాట వినకుంటే పిల్లల చెవుల్ని మెలేసినట్లే.. భార్యని వేధించవద్దని, వ్యసనాల జోలికి వెళ్లొద్దని, తాగుడు మానేయమనీ ఎంత చెప్పినా వినని మగాళ్ల చెవి పిండి, చెడు వదిలించేందుకు యూపీలో గ్రామాల్లో కొత్తగా 'గ్రీన్ గ్యాంగ్' అనే మహిళా దళం ఊపిరి పోసుకుంది. పదమూడేళ్ల క్రితం అదే రాష్ట్రంలో ఆవిర్భవించిన 'గులాబీ గ్యాంగ్'కు సిస్టర్ గ్యాంగ్.. ఈ గ్రీన్ గ్యాంగ్.

గ్రీన్ గ్యాంగ్ లీడర్ ఆశాదేవి

# గులాబీ గ్రీన్

ఇంటి పని పూర్తైంది. ఆశాదేవి బట్టలు మార్చుకుని బయటికి వచ్చింది. ఆమె ఇప్పుడు ఆకుపచ్చ రంగు చీరలో ఉంది. ఆ చీర ఆమె ఆయుధం. ఆమెను మాత్రమే కాపాడే ఆయుధం కాదు, ఊళ్లోని ఆడవాళ్లందరికీ రక్షణ! ఆశాదేవి వేరే ఏ బట్టల్లో ఉన్నా ఊళ్లోని మగాళ్లు ఉలిక్కిపడరు. ఆకుపచ్చ చీరలో కనిపించిందంటే ఒళ్లు దగ్గర పెట్టుకుంటారు. గ్రీన్ గ్యాంగ్ లీడర్ బయటికి వచ్చిందని ఒకరికొకరు సమాచారం ఇచ్చుకుంటారు. గ్యాంగ్ లీడర్ బయటికి వచ్చిందంటే నూటాయాభై మంది వరకు ఉన్న ఆ గ్యాంగ్ ఊళ్లో ఎక్కడో మగవాళ్లను 'చక్కబెడుతోందనే'!

**ధైర్యం.. ధీమా.. భరోసా!**

పవిత్ర పుణ్యభూమి అయిన వారణాసికి దగ్గరలో ఉంది గ్రీన్‌గ్యాంగ్ ఉన్న ఊరు. పేరు ఖుషియారీ. ఆడపిల్లలకు, ఆడవాళ్లకు అనువైన ఊరు కాదది! అసలు ఆడపిల్ల తల్లి గర్భంలోంచి భూమ్మీద పడడమే ఆ ఊళ్లో కనాకష్టం. పుట్టాక పెరగడం ఇంకా కష్టం. పెరుగుతుంది కానీ.. ఆమెకో జీవితం ఉండదు. పెళ్లి అవుతుంది. తన మాటకు విలువ ఉండదు. ఆమె తరఫున అత్తమామలే మాట్లాడతారు. ఆమె ఇష్టాలను, అయిష్టాలను వదిన మరదళ్లే నిర్ణయిస్తారు. అలాంటి ఊళ్లో.. ఇంటి పనయ్యాక పచ్చచీర కట్టుకుని బయటికి వచ్చింది ఆశాదేవి. పొలం పనులు ముగించుకుని అప్పుడే ఇంటికి చేరుకున్న మరో ఇరవై మంది మహిళలు ఆ వెంటనే ఆమెను అనుసరించారు. వాళ్లంతా కూడా ఆకుపచ్చ చీరలో ఉన్నారు. అది వాళ్ల యూనిఫారం. ఊళ్లోని మహిళలకు, పిల్లలకు ధైర్యాన్ని, భరోసాను, నమ్మకాన్ని ఇచ్చే రంగు. తాగొచ్చి భార్యను కొట్టే భర్తకు ఆ రంగును చూస్తే భయం. జూదం ఆడే మగాళ్లకు వణుకు. పేక ముక్కలు అక్కడే పడేసి వెనక్కైనా చూడకుండా పారిపోతారు. తల్లి మొత్తుకుంటున్నా పిల్లల్ని స్కూలుకు పంపకుండా పనికి తరిమేసే తండ్రుల భరతం కూడా పడుతుంది గ్రీన్ గ్యాంగ్.

**మార్పు కోసం ఒకటయ్యారు**

ఖుషియారీ గ్రామంలోని మగాళ్ల ప్రధాన కాలక్షేపం 'మూడు ముక్కలాట'. దేశంలో జూదం ఆడటం నిషేధం. కానీ ఖుషియారీలో మగాళ్లు చెట్ల కింద, గట్ల మీద కండువాపై ముక్కలు వేసుకుని కూర్చుంటారు! ఆడేందుకు ఎవరూ దొరక్కపోతే కొడుకుతోనే 'కాయ్ రాజా కాయ్' అంటాడు తండ్రి. ఆ గ్రామంలోని శీలాదేవి ఆవేదన కూడా ఇదే. తండ్రి చెడిపోయాడు. కొడుకునూ చెడగొడుతున్నాడు. ఏం చేస్తుంది మరి? గ్రీన్ గ్యాంగ్‌లో చేరింది! ఇంట్లో అంతా పని చేస్తే కానీ రోజు గడవదు. శీలాదేవి భర్త పనికి వెళ్లడు. ఆమె నాలుగు రూపాయలు సంపాదించుకొస్తేనే ఆ రోజుకి ఇంట్లో పొయ్యి వెలిగేది. శీలాదేవికి ఆడపిల్లలూ ఉన్నారు. ఖుషియారీలో ఆడపిల్లలను అచ్చంగా గుండెలపై కుంపటిలానే చూస్తారు. దేశం మారుతున్నా ఖుషియారీ మారడం లేదు. అందుకే ఆ ఊరి ఆడవాళ్లు మారదలచుకున్నారు. అడ్డదిడ్డంగా ఉండి కుటుంబాల్లో కల్లోలం రేపుతున్న మగాళ్లకు ముందుగా చెప్పి చూస్తారు. వినకుంటే 'గుర్తుండిపోయేలా' చెప్తారు. ఏ ఇంట్లోనైనా ఒక పురుషుడు అశాంతి సృష్టిస్తుంటే ఆ సమాచారాన్ని గ్రీన్ గ్యాంగ్ ఇచ్చి పుచ్చుకుంటుంది. అతడిని పంచాయితీకి రమ్మని పిలుస్తారు. 'మీరు పిలిస్తే వచ్చేదేంటి?' అని అతడు భీష్మించుకుని కూర్చుంటే వీళ్లే వెళ్తారు. ఊరికే వెళ్లరు. చేతుల్లో కర్రలతో వెళ్తారు. మరీ కర్రలు అవసరం లేని కేస్ అయితే బెదిరించి బుద్ధి చెబుతారు. జూదశాలలపై దాడులు చేయడం, గుడుంబా కుండల్ని బద్దలు కొట్టడం.. వీటి కన్నా కూడా.. మారని మగాళ్లను దారిలోకి తెచ్చేందుకే వీళ్లు ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తోంది.

**చదువుకున్నవారి సహకారం**

గ్రీన్ గ్యాంగ్‌లో కొందరు కరాటే తెలిసిన మహిళలు కూడా ఉన్నారు! పరిస్థితి చెయ్యి దాటినప్పుడు వట్టి చేతులతో టాస్క్‌ని ఫినిష్ చేసేస్తారు. ఇదేమీ పెద్ద విషయంగా కనిపించకపోవచ్చు. కానీ ఖుషియారీలో మహిళలు ఇలా సంఘటితం అవడం కష్టమైన సంగతే. కట్టుబాట్లపరంగా స్త్రీల పట్ల వివక్షకు మారుపేరు ఖుషియారీ. గత ఏడాది కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం దేశంలో మూడింట ఒక వంతు మంది మహిళలు గృహహింసకు, గృహ లైంగికహింసకు గురవుతున్నారు. వివాహిత మహిళల్లో మూడింట ఒక వంతు మంది భర్తల చేతుల్లో భౌతిక, లైంగిక హింసను అనుభవిస్తున్నారు. పట్టణాలతో పోల్చి చూస్తే గ్రామాల్లోని మహిళలపైనే ఈ హింస ఎక్కువగా ఉంటోంది. అలాంటి గ్రామాలకు ఒక ముఖచిత్రం ఖుషియారీ. అయితే ఈ నివేదికల్లో చూపించే దాని కన్నా ఎక్కువగానే మహిళలపై హింస జరుగుతోందని గ్రీన్ గ్యాంగ్‌కు తెలియందేమీ కాదు. ప్రభుత్వం వైపు నుంచి మహిళల రక్షణ, భద్రతలకు జరిగేది జరుగుతున్నా, ఏ గ్రామానికి ఆ గ్రామంలో బాధితుల తరఫున మహిళలూ పూనుకుంటే తప్ప మగాళ్లలో మార్పు రాదని గ్రీన్ గ్యాంగ్ నిశ్చయించుకుని స్త్రీలను, పిల్లలను కాపాడే ఉద్యమానికి నడుం కట్టింది.

స్వయంగా ఆశాదేవి కూడా ఒక బాధితురాలే. రోజూ తాగొచ్చి భార్యను అదొక అలవాటుగా బాదేవాడు! ఆమె తలను గోడకేసి కొట్టేవాడు. రక్తం కారేది. నొప్పిని అలాగే భరిస్తుండేది కానీ ఏనాడూ ఎదురు తిరగలేదు. కానీ ఒకరోజు పిల్లల ముందు ఆమెపై చెయ్యి చేసుకున్నాడు. ఆ చెయ్యిని అక్కడే ఆపేసింది ఆశాదేవి. నిర్ఘాంతపోయాడు. పిల్లల కళ్లల్లో సంతోషం. అమ్మ కూడా ఎదిరించగలదు. అమ్మకూడా ఎదురు తిరగగలదు. అంతే. నాన్నంటే భయం పోయింది. అమ్మంటే గౌరవం పెరిగింది. ఈ విషయం ఆశాదేవి గ్రహించింది. ఊళ్లో తన దొక్కటే కుటుంబం కాదు. తనొక్కతే బాధితురాలు కాదు. పిల్లల్ని తండ్రి ప్రేమగా చూసుకోవచ్చు. కానీ వాళ్ల కళ్లముందే తల్లిని అవమానిస్తే, అగౌరవపరిస్తే వాళ్లూ బాధితులే అవుతారు. ఈ దుస్థితిని తన పిల్లలకు తొలగించిన ఆశాదేవి, తనలాంటి వారే మరికొందరితో కలిసి ఊళ్లోని బాధిత మహిళల కోసం, వారి పిల్లల కోసం 'గ్రీన్ గ్యాంగ్' ఆవిర్భావానికి తోడ్పడింది. ఒక గ్యాంగ్ గా ఏర్పడడానికి వీళ్లకు స్ఫూర్తిని ఇచ్చింది మాత్రం కొంతమంది యూనివర్సిటీ విద్యార్థులు. వాళ్లలోని వలంటీర్‌లు ఊళ్లోకి వచ్చి, స్త్రీల హక్కుల గురించి చెప్పి వెళ్లిపోయారు. అరె.. హక్కులుండీ హక్కులు లేనట్లు పడివుండటం ఏంటని అనుకున్నారు ఖుషియారీ మహిళలు. విద్యార్థులలోనే కొందరికి కొన్ని స్వచ్ఛంద సేవా సంఘాలతో పరిచయాలున్నాయి. అలా దివ్యాంశు ఉపాధ్యాయ్ అనే సేవా సంఘం నిర్వాహకుడు కొంత మంది యువ వలంటీర్‌ల చేత స్థానిక మహిళలకు చట్టాలపై, సెక్షన్‌లపై అవగాహన కల్పించాడు. ముఖ్యంగా పోలీస్ కంప్లయింట్ ఎలా ఇవ్వాలో చెప్పించాడు. ఆ తర్వాతి నుంచి ఊళ్లో మగాళ్లపై కేసులు నమోదవడం మొదలైంది. భర్తపై భార్య పెట్టిన కేసులే వాటిల్లో ఎక్కువ! తర్వాతి స్థానం జూదం ఆడేవారిది, తాగొచ్చి కొట్టేవాళ్లది, గుడుంబా కాసేవాళ్లదీ. ఊళ్లో ఇప్పుడీ పచ్చరంగు చీరల్లోని ఆడవాళ్లు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌గా మహిళల్ని, బాలికల్ని కాపుకాస్తున్నారు. రక్షణ వలయంగా నిలుస్తున్నారు. వీళ్లకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తున్నది కూడా యువ వలంటీర్‌లే.


గ్రీన్ గ్యాంగ్ సభ్యులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తున్న వలంటీర్లు

**శాంతి సౌభాగ్యాలు**

గ్రీన్ గ్యాంగ్ గుడుంబా కుండల్ని బద్దలు కొడుతున్న వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ గ్యాంగ్ గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. గ్రీన్ గ్యాంగ్‌లో ప్రస్తుతం 150 మంది వరకు మహిళలు ఉన్నారు. ప్రతి సాయంత్రం వీళ్లంతా కలుస్తారు. అయితే అందరూ ఒకే చోట కలవరు. బృందాలుగా విడిపోయి, వేర్వేరు చోట్ల సమావేశం అవుతారు. ఫిర్యాదులు ఏమైనా ఉన్నాయా అని చర్చించుకుంటారు. ఉంటే ఆ బాధిత మహిళను ఎలా గట్టెక్కించాలో ఆలోచిస్తారు. కార్యాచరణ సిద్ధం చేసుకున్నాక బాధితురాలి ఇంటికి వెళ్లి భర్త వైఖరిని మార్చుకొమ్మని సలహాయిస్తారు. సాధారణంగా చెయ్యి చేసుకోరు. చేతిలో కర్రలు మాత్రం ఉంచుకుంటారు. ఏ ఫిర్యాదులూ లేనప్పుడు గ్రామం మంచిచెడ్డల కోసం అధికారులను కలిసే విషయమై మాట్లాడుకుంటారు. ఏబీసీ న్యూస్ దక్షిణాసియా కరస్పాండెంట్ సియోభన్ హెన్యూ ఈ గ్రీన్ గ్యాంగ్‌ను.. 'ఆకుపచ్చ రంగునే మీ యూనిఫారమ్‌కు ఎందుకు ఎంచుకున్నారు అని ప్రశ్నించినప్పుడు.. ''ఆకుపచ్చ సౌభాగ్యానికి, శాంతికి చిహ్నంగా మేము భావిస్తాం. అయితే ఈ మగవాళ్లు మాకు అవి రెండూ లేకుండా చేస్తున్నారు. వాటిని సాధించుకోవడం కోసమే మా పోరాటం'' అని చెప్పారు.

## గులాబీ గ్యాంగ్

పన్నెండేళ్ల వయసుకే సంపత్ పాల్ దేవి ఒక గొర్రెపిల్లలా భర్త వెనకే నడిచి, మెట్టినింట అడుగుపెట్టింది. ఇరవై ఏళ్లకే ఐదుగురు పిల్లల తల్లి అయింది. గొర్రెల కాపరి అయిన ఆమె తండ్రి తన కూతురుని ఎంత త్వరగా ఇంకొకరి కాపలాకి ఇస్తే అంత త్వరగా తన భారం వదులుతుందని భావించాడే తప్ప, తర్వాత పిల్ల భవిష్యత్తు ఏమిటని ఆలోచించలేదు. బడిపిల్లలకు ఐస్‌క్రీమ్ అమ్ముతుండే దేవి భర్త కూడా తన భార్యాపిల్లలకు చల్లని జీవితాన్ని ఇవ్వలేకపోయాడు. ఉత్తరప్రదేశ్‌లోని అనేక నిరుపేద గ్రామాల్లో మహిళల పరిస్థితి చాలావరకు ఇలాగే ఉంటుంది. బాల్యంలోనే వివాహం అయిపోతుంది. అక్కడితో చదువు ఆగిపోతుంది. అక్కడి నుంచి భర్త వేధింపులు సాధింపులు మొదలవుతాయి. దేవి కూడా అలాంటి సగటు గృహిణే. తను, తన కుటుంబం, తన కష్టాలు... అంతే. గుట్టుగా నెట్టుకొస్తోంది. అయితే ఆమె జీవితంలోని ఓ క్షణం ఆమెను పూర్తిగా మార్చేసింది. ఆమెలోని దృఢత్వాన్ని, నాయకత్వ లక్షణాలను బయటికి తెచ్చింది. ఆమెపై 2014లో 'గులాబ్ గ్యాంగ్' అనే సినిమా కూడా వచ్చింది! ఆ చిత్రంలో సంపత్ పాల్ దేవి పాత్రను మాధురీ దీక్షిత్ పోషించారు.

2006లో ఓరోజు సంపత్ పాల్ దేవి తన ఇంటి బయట, అత్యంత బాధాకరమైన దృశ్యం చూసింది. ఓ భర్త తన భార్యను గొడ్డును కూడా బాదని విధంగా బాదుతున్నాడు. 'చచ్చిపోతాను, నన్ను కొట్టొద్దు' అని ఆ భార్య అతడి కాళ్ల మీద పడి ప్రాధేయపడుతోంది. అయినా ఆమె భర్త కరుణించలేదు. అడ్డుపడిన వాళ్లను సైతం కొట్టబోయాడు. 'నా భార్య. నా ఇష్టం' అన్నాడు. ఆ రాత్రి సంపత్ పాల్ దేవి నిద్రపోలేదు. తెల్లవారుజామునే లేచి కొంతమంది మహిళలను సమీకరించుకుంది. అందరి చేతుల్లో కర్రలు! అంతా కలిసి ఆ భర్త ఇంటి మీదికి వెళ్లారు. అతణ్ని బయటికి రప్పించి, దేహశుద్ధి చేశారు. అదీ ఆరంభం. బుందేల్‌ఖండ్ గ్రామంలో గులాబీ రంగుల చీరలు ధరించిన 'గులాబీ గ్యాంగ్' ఆవిర్భవించింది. 2010 నాటికి రాష్ట్రవ్యాప్తం, దేశవ్యాప్తం అయింది. ఎక్కడైనా, ఏ ఇంట్లోనైనా స్త్రీపై దౌర్జన్యం, గృహహింస జరుగుతోందని తెలిస్తే గులాబీ గ్యాంగ్ అక్కడ ప్రత్యక్షమౌతోంది. ప్రలోభాలకు లోను కాకూడదన్న కారణంతో ప్రభుత్వ యంత్రాంగం నుంచీ, స్వచ్ఛంద సేవాసంస్థల నుంచి ఎలాంటి ఆసరా కోరకుండా సంపత్ పాల్ దేవీ తన సైన్యాన్ని తనే నిర్మించుకుంది. 'ప్రతి ఆడపిల్లా చదువుకోవాలి. ప్రతి మహిళా స్వేచ్ఛగా జీవించాలి'. ఇదే సంపత్ పాల్ దేవి ధ్యేయం. గ్రీన్ గ్యాంగ్ కూడా సరిగ్గా గులాబీ గ్యాంగ్ బాటలోనే పయనిస్తోంది.


గ్యాంగ్ సభ్యులతో గులాబి గ్యాంగ్ లీడర్ సంపత్‌పాల్ దేవి

సంకల్ప బలుడు

# ఐఏఎస్ అంతు చూశాడు

**అతని సంకల్పం ముందు అంధత్వం ఓడింది. పేదరికం తలవంచింది. పుట్టుకతోనే అంధుడు అయినా, అనుకున్నది ఎందుకు సాధించలేననే దృఢ సంకల్పంతో ముందుకు సాగాడు. విజయం సాధించాడు. అతనే తూర్పు గోదావరి జిల్లా మలికిపురం మండలం గూడపల్లి గ్రామానికి చెందిన కట్టా సింహాచలం.**


కట్టా సింహాచలం

సింహాచలం 2019 ఐఏఎస్ బ్యాచ్‌లో 457వ ర్యాంకు సాధించి ట్రైనీ కలెక్టర్‌గా ముస్సోరీలో శిక్షణకు ఎంపికయ్యారు. గూడపల్లి గ్రామంలోని కట్టా వాలి, వెంకట నర్సమ్మలకు ఆయన జన్మించారు. ఆ దంపతులకు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రాంబాబు, సింహాచలం.. నలుగురు కుమారులు, ఒక కుమార్తె దుర్గ . కుటుంబ భారం మోసేందుకు తండ్రి వాలి పాత గోని సంచుల వ్యాపారం చేసేవారు. అలానే సంతానాన్ని పెంచి పెద్ద చేశారు. నాలుగో సంతానం అయిన సింహాచలం పుట్టుక తోనే అంధుడు. తండ్రికి కుమారుడిని చదివించే స్తోమత లేదు. ఆ పేదరికంతోనే సింహాచలం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని బ్రెయిలీ స్కూల్‌లో చదువుతూ మలికిపురం ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో దాతల సహకారంతో డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయంలోనే తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. అండ కోల్పోయిన ఇంటికి తాను అండగా ఉండాలని అనుకున్నాడు. ఐఏఎస్ కావాలన్న దృఢ సంకల్పాన్ని తన మనస్సులో గట్టిగా నాటుకున్నాడు. ఆ క్రమంలోనే బీఈడీ కూడా చదివి తిరుపతి కేంద్రీయ విద్యాలయంలో టీచరు ఉద్యోగం లో చేరారు సింహాచలం. 2014 సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలు రాశారు. 1212 ర్యాంకు సాధించారు. కలెక్టర్ అయ్యే అవకాశం కొద్దిలో మిస్ అయింది. అయినా నిరాశ చెందలేదు. 2016లో ఐఆర్ఎస్‌లో రాణించి ఇన్ కమ్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఢిల్లీ, హైదరాబాద్‌లలో పని చేస్తూనే తన ఆశయం అయిన ఐఏఎస్‌కు ప్రిపేర్ అయ్యారు. ఎట్టకేలకు 2019 ఐఏఎస్ ఫలితాల్లో ర్యాంకు సాధించారు. ప్రసుతం సింహాచలం ముస్సోరిలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ తీసుకుంటున్నారు. బుధవారం తన స్వస్థలం గూడపల్లి వచ్చిన సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడారు.

– తోట సత్యనారాయణ, సాక్షి
మలికిపురం, తూ.గో.జిల్లా

● పాత గోనె సంచుల వ్యాపారి కొడుకు కలెక్టర్ అయ్యారు!
● పుట్టుకతోనే అంధత్వం.. అయినా ఐఏఎస్‌లో ర్యాంకు!!


కుటుంబ సభ్యులతో కట్టా సింహాచలం

**అవయవ దానాన్ని ప్రోత్సహించాలి**

''అవయవ లోపం అన్నది మనలోని ప్రతిభ వెలికి వచ్చేందుకు అడ్డంకి కాదు. దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. అలాగే ప్రతి ఒక్కరూ అవయవ దానాన్ని ప్రోత్సహించాలి. ఈరోజు నేను సాధించిన ఈ ఐఏఎస్ ఘనత కంటే అవయవ దానం చేసిన వారే చాలా గొప్పవారని నేను భావిస్తాను.''

– కట్టా సింహాచలం

**సాక్షి ఫ్యామిలీ సినిమా**
నల్లగొండ ॥ శుక్రవారం
16-8-2019

# అల వైకుంఠపురములో...


● అల్లు అర్జున్

సినిమా టైటిల్స్‌ను 'అ'తో మొదలు పెట్టడం త్రివిక్రమ్ సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌ను మళ్లీ రిపీట్ చేశారు త్రివిక్రమ్. అల్లు అర్జున్‌తో చేస్తున్న సినిమాకు 'అల వైకుంఠపురములో' అనే టైటిల్ ఖరారు చేశారు. టైటిల్ టీజర్‌ను గురువారం రిలీజ్ చేశారు. టీజర్‌లో 'ఏంటి గ్యాప్ ఇచ్చావు?' అని మురళీ శర్మ అడగ్గా.. 'ఇవ్వలేదు.. వచ్చింది' అంటారు అల్లు అర్జున్. (గత ఏడాదిగా అల్లు అర్జున్ సినిమాలకు ఇచ్చిన గ్యాప్‌ను ఈ డైలాగ్‌కు సరదాగా అన్వయించుకోవచ్చు). ఈ సినిమాను అల్లు అరవింద్, చినబాబు నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. టబు కీలక పాత్రలో నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుంది.

# ఏజెంట్ చాణక్య


● గోపీచంద్

'చాణక్య' ఎత్తులకు పై ఎత్తులు వేస్తాడు. దేన్నైనా విశ్లేషించగలుగుతాడు. అతను పరిశోధన మొదలుపెడితే ఏ కేస్ అయినా పరిష్కారం కావాల్సిందే. మరి.. చాణక్య ఎలాంటి ప్లాన్‌లు వేశాడు? అనేది వెండితెరపై చూసి తెలుసుకోవాల్సిందే. గోపీచంద్ హీరోగా తిరు దర్శకత్వంలో 'చాణక్య' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో మెహరీన్, జరీన్‌ఖాన్ కథానాయికలుగా నటిస్తున్నారు. 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్) ఏజెంట్ పాత్రలో గోపీచంద్ నటిస్తున్నారని తెలిసింది. తాజాగా ఈ సినిమాలో గోపీచంద్ కొత్త లుక్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమా టాకీ పార్ట్ పూర్తయింది. పాటలను విదేశాల్లో చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్‌లో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్ సహ–నిర్మాతలు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.

# రెండు కాల్చుకోవాలె... రెండు దాచుకోవాలె

'నా సినిమాలో విలనే నా హీరో' అంటూ అథర్వ డైలాగ్‌తో మొదలవుతుంది 'వాల్మీకి' టీజర్. 'అందుకే పెద్దోళ్ళు చెప్పిండ్రు... నాలుగు బుల్లెట్లు సంపాయిస్తే రెండు కాల్చుకోవాలె.. రెండు దాచుకోవాలె' అని వరుణ్ తేజ్ చెప్పిన మాస్ డైలాగ్‌తో ముగుస్తుంది. వరుణ్ తేజ్, అథర్వ ముఖ్య తారాగణంగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వాల్మీకి'. ఈ చిత్రంలో పూజా హెగ్డే, మృణాళిని రవి కథానాయికలుగా నటిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. తమిళ హిట్ చిత్రం 'జిగర్తండా'కు 'వాల్మీకి' తెలుగు రీమేక్. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ''టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సినిమాకు హైలైట్‌గా ఉంటాయి'' అని చిత్ర బృందం పేర్కొంది. 'వాల్మీకి' సినిమా సెప్టెంబర్ 13న విడుదల కానుంది.


● వరుణ్‌తేజ్

## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


**ప్రియదర్శిని రామ్**
**లవ్ డాక్టర్**

హాయ్ సార్! నేను విశాఖలో ఉండి చదువుకున్నాను. ప్రతి దసరాకి మా ఊరు జాతరకు వెళ్తుంటాను. జాతర పక్కనే నాతో పాటు టెన్త్ చదివిన ఓ అమ్మాయి వాళ్ల ఇల్లు ఉంటుంది. తనంటే నాకు చాలా ఇష్టం. తను కూడా నేను కనిపిస్తే.. 'హాయ్.. ఎలా ఉన్నావ్?' అంటూ సైగ చేస్తూ అడుగుతుంది. ఆ సమయంలో తను నాకోసం ఎదురు చూస్తున్నట్లే అనిపిస్తూ ఉంటుంది. గత నాలుగేళ్లుగా ఇదే వరుస. కానీ మా నేపథ్యాలు వేరు. పైగా ఆ అమ్మాయి ఇంటికి చాలా మంది మగవాళ్లు వస్తూ పోతూ ఉండటంతో ఊరిలో చెడ్డ పేరు కూడా ఉంది. తన అక్కలు మంచివాళ్లు కాదని తెలుసు కానీ తను అలాంటిది కాదు. ఈ పరిస్థితుల్లో నా ప్రేమని తనకి తెలపడం సరైనదేనా చెప్పండి సార్?

– మురళి

సైగ చేసి చూడన్నా!

'ఏం సైగ చెయ్యాలి సార్?'

అమ్మాయి చేసినట్లు మురళీ కూడా సైగ చేస్తే పోలా?!

'అలా చేస్తే మురళికి నోట్లో పింఛం కుక్కి.. ముక్కులో ఫ్లూట్ తగిలిస్తారేమో సార్..? చాలా బ్యాడ్ అయిపోతుంది. ముందే మురళి చాలా సెన్సిటివ్‌గా కనబడుతున్నాడు. ఫోర్ ఇయర్స్ నుంచి సైగలు చేస్తున్నాడు. ఒకవేళ సైగల రీడింగ్‌లో మనోడు వీక్ అయితే లైఫ్ జాతర అయిపోద్దేమో సార్?'

కరెక్ట్‌గా చెప్పావు..! అమ్మాయి క్యారెక్టర్, అమ్మాయి సిస్టర్స్ క్యారెక్టర్ గురించి మాట్లాడే బదులు సైగలు ఆపి సై అని అమ్మాయికి చెబితే.. గివ్ రెస్పెక్ట్.. టేక్ రెస్పెక్ట్.. లాగా ఉంటుంది నీలూ!!

'బాగా చెప్పారు సార్! క్యారెక్టర్ గురించి మాట్లాడటం తప్పు మురళీ..!! రూట్ మార్చి ఫ్లూట్ వాయించు మురళీ' అని నవ్వింది నీలూ!

lovedoctorram@sakshi.com

# మరో టర్న్?


● సమంత

కథానాయికగా వెండితెరపై సమంత సూపర్ డూపర్ సక్సెస్. ఇటీవల బాక్సాఫీస్ వద్ద సమంత సాధించిన హిట్స్ ఆమె కెరీర్‌ను అమాంతం నెక్ట్స్ లెవెల్‌కి తీసుకు వెళ్లాయనడంలో సందేహం లేదు. వెండితెరపై అగ్రకథానాయికగా నిరూపించుకున్న సమంత ఇప్పుడు ఇంకో టర్న్ తీసుకున్నారని సమాచారం. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ సత్తా చాటాలనుకుంటున్నారట. అందుకే ఓ వెబ్ సిరీస్‌కు సమంత సైన్ చేశారని టాక్. ఈ వెబ్ సిరీస్ తమిళం, హిందీ, తెలుగు భాషల్లో ప్రేక్షకుల ముందుకు వస్తుందట. ఆల్రెడీ చెన్నైలో షూటింగ్ కూడా ఆరంభం అయిందని సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం '96' తెలుగు రీమేక్‌లో నటించడానికి ప్రిపేర్ అవుతున్నారు సమంత.


● అభయ్ రామ్


● అయాన్, అర్హా


● అయాన్‌కి రాఖీ కడుతున్న అర్హా

**అభయ్‌రామ్ సుభాష్ చంద్రబోస్‌లా మారిపోయాడు. అల్లు అర్హా ఝాన్సీ లక్ష్మీ భాయ్‌లా కత్తి దూసింది. అల్లు అయాన్ తుపాకీ తీశాడు.**

**వీళ్లంతా ఎవరనుకుంటున్నారా? స్టార్ కిడ్స్. ఎన్టీఆర్ తనయుడు అభయ్ రామ్. అల్లు అర్జున్ పిల్లలు అయాన్, అర్హా. స్వాతంత్య్ర దినోత్సవం, రాఖీ పౌర్ణమి రెండు పండగలు ఒకేరోజు వచ్చాయి. ఈ రెండు పండగల సందర్భంగా పిల్లలు ఇలా డిఫరెంట్ గెటప్స్‌లో సందడి చేశారు.**

# నీతోనే...

''శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్ చైర్మన్ అయిన తర్వాత నేను హాజరైన మొదటి ఆడియో ఫంక్షన్ 'నీతోనే హాయ్ హాయ్'. ఇందులోని ఐదు పాటలు బావున్నాయి'' అన్నారు నటుడు పృథ్వీ. అరుణ్ తేజ్, చరిష్మా శ్రీకర్ జంటగా బియన్ రెడ్డి అభినయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీతోనే హాయ్ హాయ్'. డా. యలమంచిలి ప్రవీణ్


● చరిష్మా, అరుణ్

సమర్పణలో డా. యలమంచిలి ప్రవీణ్, డా. ఏయస్ కీర్తి, డా. జి.పార్థసారధి రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ చిత్రం పాటలను పృథ్వీ ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''ట్రైలర్ చూస్తుంటే దర్శకుడి ప్రతిభ ఏంటో తెలుస్తోంది. ముగ్గురు నిర్మాతలు మంచి అభిరుచితో ఈ చిత్రాన్ని నిర్మించారు. హీరో, హీరోయిన్ మంచి నటన కనబరిచారు. 'నీతోనే హాయ్ హాయ్' మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''నన్ను, నా కథని నమ్మి, నిర్మాతలు రాజీ పడకుండా ఈ సినిమా నిర్మించారు. ఇటీవల సెన్సార్ పూర్తయింది'' అన్నారు బియన్ రెడ్డి అభినయ. ''వైవిధ్యమైన కథాంశంతో వస్తోన్న మా సినిమాని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు డా. ఏయస్ కీర్తి, డా. పార్థసారధి రెడ్డి. ''ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా నిర్మించాం'' అన్నారు డా. యలమంచిలి ప్రవీణ్. ''ఈ సినిమాతో హీరోగా మంచి బ్రేక్ వస్తుందన్న నమ్మకం ఉంది'' అన్నారు అరుణ్ తేజ్.

# మ్యూజికల్ హారర్


● మున్నా కాశీ

''మిస్టర్ 7, చిత్రం చెప్పిన కథ, మామ ఓ చందమామ' వంటి చిత్రాలకు సంగీతం అందించిన మున్నా కాశీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హేజా' (ఎ మ్యూజికల్ హారర్). ముమైత్ ఖాన్, నూతన నాయుడు (బిగ్ బాస్ ఫేమ్), లక్ష్మణ్ (ఆర్ ఎక్స్ 100ఫేమ్), లిజి గోపాల్, ప్రీతం నిగమ్ ప్రధాన పాత్రల్లో నటించారు. కేవీఎస్ఎన్ మూర్తి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మున్నా కాశీ మాట్లాడుతూ– ''ఒక మ్యూజికల్ హారర్‌గా మంచి కథతో తెరకెక్కించాం. టీజర్‌కి, పాటలకి మంచి స్పందన వస్తోంది. సినిమా బాగా రావడానికి కారణమైన కేవీఎస్ఎన్ మూర్తి, సహ నిర్మాత వి.యన్‌జ వోలెటిగార్లకు కృతజ్ఞతలు. విజయంపై నమ్మకంగా ఉన్నాం'' అన్నారు. ''ఇప్పటి వరకూ వచ్చిన హారర్ సినిమాలకు భిన్నంగా ఉంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అన్నారు కేవీఎస్ఎన్ మూర్తి.

# మిస్ బాంబే ఇకలేరు


● విద్యా సిన్హా

మిస్ బాంబే, 'పక్కింటి అమ్మాయి' అనిపించుకున్న బాలీవుడ్ నటి విద్యా సిన్హా (71) ఇకలేరు. గురువారం ముంబైలో ఆమె తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా ఊపిరి తిత్తుల సమస్యతో బాధపడుతున్నారు విద్యా. మోడలింగ్ నుంచి నటిగా మారి బసు చటర్జీ తీసిన 'రజనీగంధ' సినిమాతో బాలీవుడ్‌కు పరిచయం అయ్యారు విద్యా. ప్రముఖ నిర్మాత రానా ప్రతాప్ సింగ్‌కు 1947 నవంబర్‌లో జన్మించారు విద్యా. మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించి, 'మిస్ బాంబే' కాంటెస్ట్‌లో పాల్గొని, ఆ టైటిల్‌ను సొంతం చేసుకున్నారామె. బాలీవుడ్‌లో కొత్తతరం హీరోయిన్ అనిపించుకుని, పక్కింటి అమ్మాయి ఇమేజ్ తెచ్చుకున్నారు. 1968లో వెంకటేశ్వరన్ అయ్యర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె (జాన్వీ) ఉంది. వెంకటేశ్వరన్ మరణించిన తర్వాత యాక్టింగ్‌కు దూరం అయ్యారు. ఆ తర్వాత కొంత కాలానికి నేతాజీ అనే డాక్టర్‌ను వివాహం చేసుకున్నారు. 'పతీ, పత్నీ అవుర్ ఓ, చోటీ సే బాత్' వంటి సినిమాలతో పాటు 'కావ్యాంజలి, బాహు రాణి, జారా' వంటి టీవీ సీరియల్స్‌లోనూ నటించారు విద్యా సిన్హా. 2011లోవచ్చిన సల్మాన్ ఖాన్ 'బాడీగార్డ్' సినిమాలోనూ నటించారామె. విద్యా సిన్హా మృతికి పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలిపారు.

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?


**నేడు జిక్కి వర్ధంతి**

**పల్లవి :**
ఆ ఆ ఆ... పందిట్లో పెళ్లవుతున్నది
పందిట్లో పెళ్లవుతున్నది కనువిందవుతున్నది
నటనమే ఆడెదను... ఓ...
నటనమే ఆడెదను
॥పందిట్లో॥

**చరణం : 1**
పెండ్లి కుమార్తెకు పూజాఫలము చేతికందేను...
చేతికందేను
గోరింటాకు కోయగబోతే
గోళ్లు కందేను నా గోళ్లు కందేను
కోరికలు తీరుచున్నవి అవి పేరుచున్నవి
నటనమే ఆడెదను... ఓ...
నటనమే ఆడెదను
॥పందిట్లో॥

**చరణం : 2**
వధువు వరుడు పల్లకిలోన
పరదేశమేగెదరు... ఆ...
॥వధువు॥
వారిని తలచి బంధువులంతా
సతతము వగచెదరు
సతతము వగచెదరు...
కన్నీరే కురియుచున్నది
మది తరుగుచున్నది
ఒంటరిగా ఆడెదను... ఓ...
ఒంటరిగా ఆడెదను
॥పందిట్లో॥

**చిత్రం : ప్రేమలేఖలు (1953)**
**రచన : ఆరుద్ర**
**సంగీతం : శంకర్-జైకిషన్**
**గానం : జిక్కి**

కట్‌చేయ్...దాచేయ్...

# జీవితంలో పెళ్లి చేసుకోను


● వరలక్ష్మీ శరత్‌కుమార్

'ఇంతకీ మీ పెళ్లి ఎప్పుడండి?' హీరోయిన్లకు తరచుగా ఎదురయ్యే ప్రశ్న ఇది. 'ఇంకా ఆలోచించలేదు. నచ్చినవాడు దొరికినప్పుడు' అంటూ సమాధానాలు ఇస్తుంటారు హీరోయిన్లు. వరలక్ష్మీ మాత్రం 'అసలు పెళ్లి చేసుకునేది లేదు' అంటున్నారు. అనుకున్నది, అనిపించినది ముక్కుసూటిగా చెప్పేయడం నటి వరలక్ష్మీ శరత్‌కుమార్‌కు అలవాటు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న 'కన్ని రాశి' అనే తమిళ సినిమాలో నటించారామె. ఈ సినిమా ప్రేమ, పెళ్లి చుట్టూ తిరుగుతుంది. ఈ సినిమా ప్రమోషన్‌లో మీరు ఎవర్ని పెళ్లాడతారు? అని ప్రశ్నించగా – ''కన్ని రాశి' స్క్రిప్ట్ చదవగానే నాకు నచ్చింది. ఇందులో లవ్ మ్యారేజ్ ప్రాముఖ్యతను ప్రస్తావించాం. కానీ నా జీవితంలో నేను ఎవ్వర్ని పెళ్లి చేసుకోను. పెళ్లి అనే సంప్రదాయాన్ని నేను పెద్దగా నమ్మను'' అని అన్నారు. గతంలో విశాల్, వరలక్ష్మి రిలేషన్‌లో ఉన్నారనే వార్తలు వచ్చాయి.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 2 | | | 5 | 9 | |
| | 7 | | 4 | 5 | 1 | 8 | 3 | |
| | | 3 | | | | | | 6 |
| 3 | 8 | | 6 | 1 | 4 | 7 | | 9 |
| | | | | | | | | |
| 5 | | 7 | 8 | 3 | 9 | | 2 | 1 |
| 8 | | | | | | 9 | | |
| | 3 | 5 | 1 | 7 | 6 | | 4 | |
| | 2 | 4 | | | 5 | | | |

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 8 | 3 | 2 | 7 | 4 | 5 | 9 | 6 |
| 2 | 5 | 7 | 9 | 3 | 6 | 4 | 8 | 1 |
| 6 | 9 | 4 | 5 | 1 | 8 | 3 | 7 | 2 |
| 8 | 7 | 1 | 4 | 2 | 3 | 9 | 6 | 5 |
| 9 | 6 | 2 | 1 | 5 | 7 | 8 | 4 | 3 |
| 4 | 3 | 5 | 8 | 6 | 9 | 1 | 2 | 7 |
| 7 | 2 | 8 | 3 | 4 | 1 | 6 | 5 | 9 |
| 5 | 1 | 9 | 6 | 8 | 2 | 7 | 3 | 4 |
| 3 | 4 | 6 | 7 | 9 | 5 | 2 | 1 | 8 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.




ఫ్యాషన్

# భలే ఫ్రిల్‌గా ఉన్నాయి

వేడుకలో కొత్తగా ఉంటున్నాయి.
పార్టీలో ప్రత్యేకతను చాటుతున్నాయి.
సీతాకోక రెక్కల్లా అబ్బురపరుస్తున్నాయి.
నెమలి పింఛమై నయనానందం చేస్తున్నాయి.
ఫ్రిల్‌తో డిజైన్ చేసిన ఈ లెహంగా
దుపట్టాలు ధరిస్తే థ్రిల్‌గా ..
భలే ఫ్రిల్‌గా ఉన్నాయి







నిర్వహణ:
- నిర్మలారెడ్డి

లంగా ఓణీ అందం మనకు తెలిసిందే. అయితే, లెహంగాతో పాటు ఈ కొత్తరకం ఫ్రిల్ దుపట్టా ఇప్పుడు వేడుకలలో ప్రత్యేకతను చాటుతోంది. దుపట్టాకు ఫ్రిల్స్ జత చేయడం, కేప్ స్టైల్‌లో డిజైన్ చేసి, దానిని దుపట్టాలా ధరించడం అందానికి అదనపు హంగుగా అమరింది. లెహంగా - చోళీ ప్రింటెడ్ అయినా ఈ డిజైనర్ దుపట్టా మాత్రం ప్లెయిన్ కాంబినేషన్‌లో తీసుకుంటే బాగుంటుంది. లెహంగా కలర్‌లోనే దుపట్టా కావాలనుకుంటే దాని మీద జరీ ఎంబ్రాయిడరీ ఉంటే ప్రత్యేకంగా కనిపిస్తుంది. లేదంటే మెటీరియల్‌తోనే ఫ్రిల్స్ వచ్చేలే డిజైన్ చేసుకోవాలి. ఈ తరహా దుస్తులు వేసుకున్నప్పుడు ప్రత్యేకంగా ఆభరణాల ఎంపిక అవసరం లేదు. దుపట్టాతోనే స్పెషల్ లుక్ తీసుకురావచ్చు కాబట్టి ఇతరత్రా హంగులు ఏవీ అక్కర్లేదు. మేకప్, హెయిర్‌స్టైల్, ఆభరణాలు.. ఈ తరహా డ్రెస్ మీదకు ఎంత తక్కువ అలంకరించుకుంటే అంత అందంగా కనిపిస్తారు.

## హోమియో కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

### అలర్జిక్ రైనైటిస్ నయమవుతుందా?

**నా వయసు 36 ఏళ్లు. గత రెండు మూడు రోజుల నుంచి చల్లగాలి, దుమ్ముధూళి సోకిన వెంటనే ముక్కుకారుతోంది. వెంటనే తుమ్ములు కూడా ఎక్కువగా వస్తున్నాయి. కళ్లలో దురద, నీరు కారడం వంటి సమస్యలతో బాధపడుతన్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే అలర్జిక్ రైనైటిస్ అని చెప్పారు. మందులు వాడాను. కానీ ఏమాత్రం తగ్గడం లేదు. హోమియో చికిత్స ద్వారా దీనికి శాశ్వత చికిత్స వీలవుతుందా?**

**– ఆర్. గురుమూర్తి, ఏలూరు**

అలర్జిక్ రైనైటిస్‌తో బాధపడే వారి పరిస్థితిని వాతావరణంలో మార్పులు, చల్లగాలి, దుమ్ముధూళి, ఇతర వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు మరింత దుర్భరం చేస్తాయి. ఈ సమస్య ఉన్నవారు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ తరచూ దీని బారిన పడుతూనే ఉంటారు.

అలర్జిక్ రైనైటిస్ అంటే... మనకు సరిపడని పదార్థాలు శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించినప్పుడు ముక్కులోని శ్లేష్మం పొర వాపునకు గురవుతుంది. ఇలా ఈ పొరలు వాపునకు గురికావడాన్ని అలర్జిక్ రైనైటిస్ అంటారు.

**కారణాలు :** ● అలర్జీని కలిగించే పదార్థాలు మన శరీరంలోకి ప్రవేశించినప్పుడు మన రోగనిరోధక వ్యవస్థ సాధారణ స్థాయికి మించి ప్రతిక్రియ జరుపుతుంది. దాని వల్ల అలర్జిక్ రైనైటిస్ సమస్య వస్తుంది. ● పూలమొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువులు ఈ సమస్యకు ప్రధానమైన కారణమని చెప్పవచ్చు. ● దుమ్ము ధూళి జంతుకేశాలు, బూజు, కుటుంబ చరిత్ర వంటి అంశాలు ఈ సమస్యకు ఇతర కారణాలుగా చెప్పవచ్చు. ● పొగతాగే అలవాటు, కొన్ని రసాయనాలు, వాతావరణంలోని కాలుష్యాలు, సుగంధద్రవ్యాల వంటివి అలర్జిక్ రైనైటిస్ సమస్యను ప్రేరేపిస్తాయి.

**లక్షణాలు :** ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, విపరీతంగా తుమ్ములు, ముక్కులో అంగిలిలో దురద, కళ్ల నుంచి నీరుకారడం, కళ్లు దురదగా ఉండటం, ముఖంలో వాపు, దగ్గు, తరచూ తలనొప్పి, నీరసం, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**చికిత్స :** హోమియో చికిత్సలతో ఎలాంటి శ్వాసకోశ వ్యాధులనైనా తగ్గించవచ్చు. జనెటిక్ కన్‌స్టిట్యూషన్ పద్ధతిలో అందించే ఈ చికిత్సలో రోగి శారీరక, మానసిక లక్షణాలను, శరీర తత్వాన్ని పరిగణనలోకి తీసుకొని చికిత్స చేస్తారు. రోగనిరోధక వ్యవస్థలలో గల అసమతౌల్యతను సరిచేయడం ద్వారా అలర్జిక్ రైనైటిస్ సమస్యను మళ్లీ తిరగబెట్టకుండా నయం చేయడం సాధ్యమవుతుంది.



**డా॥ శ్రీకాంత్ మొర్లావర్,**
**సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,**
**హైదరాబాద్**



### సోరియాసిస్ తగ్గుతుందా?

**నా వయసు 39 ఏళ్లు. చాలా రోజుల నుంచి సోరియాసిస్‌తో బాధపడుతున్నాను. ఎన్ని రకాల పూతమందులు, ఇతర మందులు వాడినా సమస్య పూర్తిగా తగ్గడం లేదు. మళ్లీ మళ్లీ తిరగబెడుతోంది. దీనికి హోమియోపతిలో చికిత్స ఉందా?**

**– జి. సుధాకర్‌రావు, నల్లగొండ**

సోరియాసిస్ అనేది ఒక దీర్ఘకాలిక ఆటో ఇమ్యూన్ సమస్య. ఇది చర్మ సమస్యే అయినా ఇది మన రోగనిరోధక శక్తి మనకు ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే సమస్యగా పరిగణించాలి. ఈ వ్యాధి వచ్చిన వారిలో చర్మ కణాలు అత్యంత వేగంగా వృద్ధి చెందడంతో పాటు ఆ కణాలు అనేక పొరలుగా ఏర్పడి, అవి వెండి రంగు పొలుసులుగా రాలిపోతుంటాయి. తర్వాత చర్మంపై రక్తంతో కూడిన చిన్న చిన్న దద్దుర్ల వంటివీ ఏర్పడతాయి. దురద కూడా ఎక్కువ. చిరాకుగా ఉంటుంది.

సోరియాసిస్ వ్యాధి ఎక్కువగా మోచేతులు, మోకాళ్లు, తల, వీపు, అరచేతులు, అరికాళ్లు, ఉదరం, మెడ, నుదురు, చెవులు మొదలైన ప్రాంతాల్లో వ్యాపిస్తుంది. సోరియాసిస్‌తో బాధపడుతున్న 15శాతం మందిలో ఆర్థరైటిస్ లక్షణాలు కూడా కనిపిస్తాయి. దీనినే 'సోరియాటిక్ ఆర్థరైటిస్' అంటారు.

**కారణాలు :** ● వంశపారంపర్యం ● మానసిక ఒత్తిడి, ఆందోళన ● శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో ఏర్పడే అస్తవ్యస్తత ● దీర్ఘకాలికంగా కొన్ని రకాల మందులు ఎక్కువగా వాడటం.

**లక్షణాలు :** ● చర్మం ఎర్రబారడం ● తీవ్రమైన దురద ● జుట్టు రాలిపోవడం ● కీళ్లనొప్పులు ● చర్మం పొడిబారినప్పుడు పగుళ్లు ఏర్పడి రక్తస్రావమూ అవుతుంది.

**నిర్ధారణ పరీక్షలు :** స్కిన్ బయాప్సీ, ఈఎస్ఆర్, సీబీపీ, ఎక్స్‌–రే పరీక్షలు.

**చికిత్స :** సోరియాసిస్ నివారణ/చికిత్సలకు హోమియోలో సమర్థమైన మార్గాలు ఉన్నాయి. అయితే సోరియాసిస్‌ను వెంటనే దీన్ని గుర్తించి చికిత్స తీసుకోవడం అవసరం. లక్షణాలను బట్టి ఈ సమస్యనుంచి విముక్తి కోసం సాధారణంగా ఆర్సినికం ఆల్బమ్, సల్ఫర్, కాలీకార్బ్, సొరినమ్, పెట్రోలియం మొదలైన మందులతో చికిత్స చేస్తారు. అయితే ఈ మందులను అనుభవజ్ఞులైన హోమియో వైద్యుల పర్యవేక్షణలో వాడాలి.



**డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,**
**ఎండీ (హోమియో),**
**స్టార్ హోమియోపతి, హైదరాబాద్**

### రెండు చేతుల కీళ్లలో నొప్పి... ఎందుకిలా?

**నా వయసు 61 ఏళ్లు. నాకు రెండు చేతుల్లోని కీళ్లు నొప్పిగా ఉండటం, కీళ్లవద్ద ఎర్రగా మారడం జరిగింది. నొప్పి భరించలేకుండా ఉన్నాను. ఎందుకిలా జరుగుతోంది? హోమియో మార్గంలో ఇది తగ్గుతుందా?**

**– ఆర్. శ్రీనివాసమూర్తి, ఒంగోలు**

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీరు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఒక ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే తన వ్యాధి నిరోధక శక్తి తన పట్ల ప్రతికూలంగా పనిచేయడం. సాధారణంగా యాభైఏళ్లు పైబడిన వాళ్లలో ఈ నొప్పులు మొదలవుతాయి.

ఈ వ్యాధి ఉన్న వారిలో లక్షణాల తీవ్రతలో చాలా రకాల మార్పులు కన్పిస్తుంటాయి. వ్యాధి యాక్టివ్ స్టేజ్‌లో ఉన్నప్పుడు అలసట, ఆకలి లేకపోవడం, లోగ్రేడ్ జ్వరం, కీళ్లలో, కండరాల్లో నొప్పులు, కీళ్లను సరిగ్గా కదపలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా కీళ్లనొప్పులు ఉదయాన్నే లేవగానే అత్యధికంగా ఉండి కొద్దిగా శరీరం కదిలించిన తర్వాత అదుపులో ఉంటాయి. సాధారణంగా చేతుల్లో కాళ్లలో రెండు వైపులా ఒకే కీళ్ళు ప్రభావితమవుతాయి. కీళ్ల ఎర్రగా, వేడిగా మారి విపరీతమైన నొప్పితో బాధిస్తాయి. వ్యాధి దీర్ఘకాలంగా మారినప్పుడు కీళ్లలోని మృదులాస్థి, ఎముకలు దెబ్బతినడం వలన వేళ్ళు వంకర్లు పోవడం పూర్తిగా కదలికలు ఆగిపోవడం



వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటినే 'డిఫార్మిటీస్' అంటారు.

రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ని నిర్ధారించడానికి ఏ ఒక్క పరీక్ష సరిపోదు. రక్తపరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలూ చేయించాల్సి ఉంటుంది.

ఆటో ఇమ్యూన్ సమస్యలలో చికిత్స చెయ్యడానికి హోమియోపతిలో మయాజ్మాటిక్ ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. సాధారణంగా వాడే పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వల్ల నొప్పి నుండి తాత్కాలికంగా ఉపశమనం లభించడం లేదా కొన్నిసార్లు అస్సలు ప్రభావమే లేకపోవడం జరుగుతుంది. పైగా ఈ మందుల వలన డిఫార్మిటీస్‌ని నివారించలేం. హోమియోపతి మందుల ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రించి నొప్పులను పూర్తిగా తగ్గించడం మాత్రమే కాకుండా డిఫార్మిటీలు రాకుండా నివారించవచ్చు.



**డాక్టర్ టి.కిరణ్‌కుమార్,**
**డైరెక్టర్,**
**పాజిటివ్ హోమియోపతి,**
**విజయవాడ, వైజాగ్**

## ఆభరణం

# మెరిసే పువ్వుల అందం

ఆభరణం పువ్వులా ముచ్చట గొలిపితే ఎంత అందంగా ఉంటుందో ఈ డిజైన్స్ చూస్తే తెలిసిపోతుంది. సన్నజాజిమొగ్గలు గుచ్చి అలంకరించినట్టు నవ వధువు అందాన్ని రెట్టింపు చేస్తాయి. తెలుపు, ఎరుపు, నీలం, పచ్చ.. రకరకాల రంగు పూసలు పార్టీలో ఒక చోట చేరి గుసగుసలు చెబుతుంటాయి. ముచ్చటైన హారాలై మెడకు కొంగొత్త సింగారాలను అద్దుతాయి. మణికట్టుకు భూషణమై వింత వెలుగులు విరజిమ్ముతాయి.



**సుహాని పిట్టి**
ఆభరణాల నిపుణులు



## బ్యూటిప్స్

# కొబ్బరినీళ్లతో ముఖకాంతి



- ముఖ చర్మం పొడిబారి నిస్తేజంగా కనిపిస్తుంటే కొబ్బరి నీళ్లను వేళ్లతో అద్దుకుని మసాజ్ చేసుకోవాలి. సబ్బుతో కాకుండా సోప్ లిక్విడ్ లేదా సున్నిపిండితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ జాగ్రత్తలు ముఖచర్మాన్ని పొడిబారనీయకుండా చేస్తాయి.
- అలసిన కళ్లు త్వరగా విశ్రాంతి పొందాలంటే.. గుండ్రంగా తరిగిన కీరా ముక్కలను ఫ్రిజ్‌లో ఉంచిన కొబ్బరినీళ్లలో ముంచి కనురెప్పల మీద ఉంచి పది నిమిషాల సేపు విశ్రాంతి తీసుకోవాలి.
- ముఖ చర్మం మృదువుగా ఉండాలంటే మృత కణాల సంఖ్య తగ్గాలి. దీనికోసం టీ స్పూన్ చొప్పున దానిమ్మ రసం, ద్రాక్షరసం, కొబ్బరినీళ్లు, అర టీ స్పూన్ బాదం నూనె కలిపి బాగా కలిపి చర్మానికి పట్టించి, వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. వారంలో మూడు రోజులు ఇలా చేస్తే మృతకణాలు తగ్గి చర్మం నిగారింపు పెరుగుతుంది.




# స్క్రీన్ టెస్ట్



**8** ఇటీవల విడుదలైన 'ఆమె' చిత్రం సంచలనం అయింది. అందులో కథానాయిక నగ్నదృశ్యాల్లో నటించి, హాట్ టాపిక్ అయ్యారు. ఎవరా నాయిక?
ఎ) అమలా పాల్ బి) నివేదా థామస్ సి) రష్మికా మండన్నా డి) ఐశ్వర్యా రాజేశ్


5

**1** 'పాడవోయి భారతీయుడా.. ఆడి పాడవోయి విజయగీతికా...' ఈ పాటలో అక్కినేని నాగేశ్వర రావుతో పాటు నటించిన నటి ఎవరో తెలుసా?
ఎ) సావిత్రి బి) జమున
సి) రాజసులోచన డి) వాణిశ్రీ

**2** 'వందేమాతరం, వందేమాతరం, వందే మాతర గీతం వరస మారుతున్నది...' పాటలో నటించిన నటుడెవరో గుర్తుందా? ( టి.కృష్ణ దర్శకత్వం వహించిన 'వందేమాతరం' చిత్రం లోనిది ఈ పాట)
ఎ) సుమన్ బి) భానుచందర్
సి) రాజశేఖర్ డి) వినోద్‌కుమార్

**3** 'సైరా' చిత్రంలో నటిస్తున్నారు చిరంజీవి. ఆ చిత్రంలో అమితాబ్ పోషిస్తున్న పాత్ర పేరు ఏంటో తెలుసా?
ఎ) అవుకు రాజు బి) వీరారెడ్డి
సి) రాజా పాండే డి) గోసాయి ఎంకన్న

**4** 'మహాసముద్రం' అనే టైటిల్‌తో కొత్త చిత్రం త్వరలో ప్రారంభం కానుంది. ఆ చిత్రదర్శకుడు అజయ్ భూపతి. అందులో ఇద్దరు హీరోలు. ఓ హీరో రవితేజ మరో హీరో ఎవరో తెలుసా?
ఎ) సిద్ధార్థ్ బి) నిఖిల్
సి) 'అల్లరి' నరేశ్ డి) శివబాలాజీ

**5** దర్శకుడు వి.ఐ. ఆనంద్ నూతన చిత్రం పేరు 'డిస్కో రాజా'. ఆ చిత్రంలో హీరో రవితేజ సరసన ముగ్గురు భామలు నటిస్తున్నారు. వారిలో ఒకరు తాన్యా హోప్, ఇంకొకరు నభా నటేశ్. మరో భామ ఎవరో తెలుసా?
ఎ) నిధీ అగర్వాల్ బి) పాయల్ రాజ్‌పుత్
సి) శ్రద్ధా శ్రీనాథ్ డి) నివేదా పేతురాజ్

**6** సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ హీరో మహేశ్‌బాబు నటించిన ఎన్ని సినిమాలకు సంగీతం అందించారో తెలుసా?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4


12

**9** నితిన్ హీరోగా నటిస్తున్న నూతన చిత్రం పేరు 'భీష్మ'. ఆ చిత్రదర్శకుడెవరో తెలుసా?
ఎ) వెంకీ అట్లూరి బి) వెంకీ కుడుముల
సి) వెంకటేశ్ మహా డి) గౌతమ్ తిన్ననూరి

**10** మహేశ్‌బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఆ చిత్రంలో హీరోయిన్ రష్మికా మండన్నా. ఆ చిత్రం కెమెరామెన్ పేరేంటి?
ఎ) సెంథిల్ కుమార్
బి) ఛోటా.కె. నాయుడు
సి) రత్నవేలు
డి) రాజీవ్ మీనన్

**11** తొలి సినిమాలోనే పవన్ కల్యాణ్ సరసన నటించిన ఆ తార చాలాకాలం నటనకు గ్యాప్ తీసుకున్నారు. ఆమె రీసెంట్‌గా ఓ చిత్రంలో ముఖ్య పాత్రను పోషించి విజయాన్ని అందుకున్నారు. ఎవరా నటి?
ఎ) సుప్రియ బి) కీర్తిరెడ్డి
సి) మధుశాలిని
డి) శోభిత దూళిపాళ్ల

**12** 'అ!' సినిమా విజువల్ ఎఫెక్ట్స్, మేకప్ రెండు విభాగాల్లో నేషనల్ అవార్డ్ సొంతం చేసుకుంది. చిత్రదర్శకుడు ప్రశాంత్‌వర్మకు దర్శకునిగా ఇది మొదటి సినిమా. మరి ఆ చిత్ర నిర్మాత ఎవరో తెలుసా?
ఎ) రానా బి) నాని
సి) అడివి శేష్ డి) నితిన్

**13** ఈ సంవత్సరం గూగుల్ సెర్చ్‌లో అత్యున్నత స్థానం సంపాదించింది ఎవరో తెలుసా?
ఎ) సల్మాన్ ఖాన్ బి) సన్నీ లియోన్
సి) దీపికా పదుకోన్ డి) షారుక్ ఖాన్

**14** రాజశేఖర్ హీరోగా నటించి విజయం సాధించిన చిత్రం 'పీయస్‌వి గరుడవేగ'. ఆ చిత్రంతో చక్కని విజయాన్ని దక్కించుకొన్న దర్శకుని పేరేంటో తెలుసా?
ఎ) సాయికిరణ్ అడివి బి) ప్రవీణ్ సత్తారు సి) ప్రశాంత్ వర్మ
డి) సుధీర్ వర్మ

**16** 'మహానటి' చిత్రంలో సావిత్రి పాత్రలో నటించారు కీర్తీ సురేశ్. ఆ చిత్రంలో ఆమె పెద నాన్న పాత్రలో నటించిన నటుడెవరో తెలుసా?
ఎ) నరేశ్
బి) రాజేంద్రప్రసాద్
సి) ప్రకాశ్‌రాజ్
డి) క్రిష్

**17** నటుడు -దర్శకుడు రాహుల్ రవీంద్రన్ 'చి.ల.సౌ' చిత్రానికి నేషనల్ అవార్డ్ దక్కించుకున్నారు. ఆయన ఏ విభాగంలో ఈ అవార్డును దక్కించుకున్నారో తెలుసా?
ఎ) ఆర్ట్ బి) దర్శకత్వం
సి) కెమెరా
డి) స్క్రీన్‌ప్లే




13

**18** 'సమ్మోహనం' చిత్రదర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ. ఆ చిత్రంతో మంచి విజయం అందుకున్న హీరో ఎవరో తెలుసా?
ఎ) కార్తికేయ బి) నరేశ్
సి) సుధీర్‌బాబు
డి) సందీప్ కిషన్

**19** ఒక కాలు లేని వ్యక్తిగా జైపూర్ లెగ్‌తో డెస్క్ ఉన్న పాత్రలో 'క్లాప్' అనే చిత్రంలో నటిస్తున్న హీరో ఎవరో తెలుసా?
ఎ) ఆది పినిశెట్టి
బి) ఆది సాయికుమార్
సి) నవీన్ చంద్ర
డి) శ్రీవిష్ణు

**20** 'ఐ' చిత్రంలోని సూపర్ హిట్ సాంగ్ 'పూలనే కునుకేయ మంట....' రచయితెవరో తెలుసా?
ఎ) వనమాలి
బి) రామజోగయ్య శాస్త్రి
సి) సిరివెన్నెల
డి) అనంత శ్రీరాం



**15** 'ఇస్మార్ట్ శంకర్' ఇచ్చిన విజయంతో పూరి జగన్నాథ్ మంచి స్వింగ్‌లో ఉన్నారు. ఆయన ఇప్పుడు తీయబోయే కొత్త సినిమాలో హీరో ఎవరో తెలుసా?
ఎ) విజయ్ దేవరకొండ
బి) రామ్
సి) ఆనంద్ దేవరకొండ
డి) ఆకాష్ పూరి

**7** శర్వానంద్ హీరోగా నటించిన కొత్త చిత్రం పేరు 'రణరంగం'. ఆ చిత్రంలో ఇద్దరు హీరోయిన్‌లు నటించారు. ఓ హీరోయిన్ కల్యాణీ ప్రియదర్శన్. మరో హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) కాజల్ అగర్వాల్ బి) పూజా హెగ్డే
సి) రకుల్ ప్రీత్‌సింగ్ డి) తమన్నా

**సమాధానాలు:**
1) సి 2) సి 3) డి 4) ఎ 5) బి 6) సి 7) ఎ
8) ఎ 9) బి 10) సి 11) ఎ 12) బి 13) బి
14) బి 15) ఎ 16) బి 17) డి 18) సి
19) ఎ 20) డి

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!



## సరిలేరు మీకెవ్వరు

'నిప్పుల వర్షమొచ్చినా జనగణమణ అంటూ దూకేవాడే సైనికుడు. మంచు తుఫాను వచ్చినా వెనకడుగు లేదంటూ దాటేవాడే సైనికుడు...' అంటూ దేశ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న సైనికులను 'సరిలేరు మీకెవ్వరు' అంటోంది 'సరిలేరు నీకెవ్వరు' చిత్రబృందం. అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మహేశ్‌బాబు సైనికుడి పాత్ర చేస్తున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమాలో 'నిప్పుల వర్షమొచ్చినా....' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 'దిల్' రాజు, అనిల్ సుంకర, మహేశ్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా కథానాయిక. విజయశాంతి, సంగీత ముఖ్య పాత్రలు చేస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా రిలీజ్ కానుంది.

● మహేశ్‌బాబు

## తెలుగువారికీ చూపించాలనిపించింది

**- కేయస్ రామారావు**


● భీమనేని, కేయస్ రామారావు, హనుమాన్

''తమిళ చిత్రం 'కణ' చూసి ఆశ్చర్యపోయా. తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా చూపించాలనుకున్నాం. అందుకే 'కౌసల్య కృష్ణమూర్తి: ది క్రికెటర్'గా రీమేక్ చేసి, తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నాం'' అని నిర్మాత కేయస్ రామారావు అన్నారు. ఐశ్వర్యా రాజేశ్, రాజేంద్ర ప్రసాద్, కార్తీక్ రాజు, 'వెన్నెల' కిశోర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వంలో కేయస్ రామారావు సమర్పణలో కె.ఎ. వల్లభ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేయస్ రామారావు మాట్లాడుతూ– ''సినిమా ఫస్ట్ కాపీ ఎప్పుడో సిద్ధమైంది. కానీ ఎక్కువమంది ఆడియన్స్‌కు రీచ్ కావాలని ఈ నెల 23న విడుదల చేస్తున్నాం. మన తెలుగు అమ్మాయి ఐశ్వర్యా రాజేష్ నటించిన క్రికెట్ బ్యాక్‌డ్రాప్ చిత్రం ఇది. తమిళంలో ఐదు పెద్ద సినిమాల మధ్య విడుదలై కూడా ప్రేక్షకాదరణ పొందింది. ఇలాంటి ఒక మంచి కథకు భీమనేని శ్రీనివాసరావుగారైతే న్యాయం చేయగలరని దర్శకునిగా తీసుకున్నాం. ఆయన బాగా తీశారు. హనుమాన్ చౌదరి చాలా మంచి డైలాగ్స్ రాశారు. ఈ నెల 18న ప్రీ–రిలీజ్ వేడుక జరుపబోతున్నాం'' అన్నారు. ''ఏ సినిమా చేసినా ఒకే కమిట్‌మెంట్‌తో చేస్తాను. పెద్దా, చిన్నా అనే తేడాలు ఆలోచించకుండా కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు భీమనేని. ''నాకు ఇంత పెద్ద అవకాశం ఇచ్చిన కేయస్ రామారావుగారికి థ్యాంక్స్. భీమనేనిగారితో 'సుడిగాడు' సినిమాకు వర్క్ చేశాను. అలాగే 'కేజీఎఫ్' తర్వాత నేను డైలాగ్స్ రాసిన చిత్రం ఇది. ఈ సినిమా ఘన విజయం సాధిస్తుంది'' అన్నారు మాటల రచయిత హనుమాన్ చౌదరి.

## గాల్లో యాక్షన్


● విశాల్

తనపై ఎటాక్ చేసినవారికి తనదైన శైలిలో జవాబు చెబుతున్నారు విశాల్. ఇందుకోసం కత్తులు, తుపాకులతో యాక్షన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. విశాల్ హీరోగా సుందర్. సి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాకు 'యాక్షన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అలాగే ఈ సినిమాలో విశాల్ లుక్‌ను కూడా విడుదల చేశారు. ఈ సినిమాలోని యాక్షన్ సీన్స్ చిత్రీకరణ కోసం విశాల్ అండ్ టీమ్ టర్కీ, అజర్‌బైజాన్‌కు వెళ్లొచ్చారు. టర్కీ షూటింగ్ సమయంలో ఓ యాక్షన్ ఎపిసోడ్‌లో భాగంగా విశాల్ గాయపడిన సంగతి తెలిసిందే. కొన్ని రోజులు విశ్రాంతి తర్వాత మళ్లీ ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు విశాల్. ఇందులో తమన్నా, ఐశ్వర్యా లక్ష్మీ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... విశాల్–సుందర్. సి కాంబినేషన్లో ఇంతకుముందు 'అంబల, మదగజ రాజా' అనే సినిమాలు వచ్చిన సంగతి తెలిసిందే.






# సాక్షి స్పోర్ట్స్

శుక్రవారం
16-8-2019


## వరల్డ్ చాంపియన్‌షిప్‌నుంచి ఔట్

ఇటీవలే థాయిలాండ్ ఓపెన్ గెలిచి ఊపు మీదున్న భారత డబుల్స్ బ్యాడ్మింటన్ జంట సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి అనూహ్యంగా వరల్డ్ చాంపియన్‌షిప్‌నుంచి తప్పుకున్నారు. 'సాత్విక్ భుజం గాయంతో బాధపడుతుంటే నా పక్కటెముకల గాయం కూడా తగ్గలేదు. మా ఫామ్, ఫలితాలను బట్టి చూస్తే ఇది కఠిన నిర్ణయమే అయినా మాకు మరో అవకాశం లేదు' అని చిరాగ్ శెట్టి వెల్లడించాడు.






### దశాబ్దంలో 20 వేల పరుగులు

దశాబ్ద కాలం వ్యవధిలో అంతర్జాతీయ క్రికెట్‌లో 20 వేల పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా టీమిండియా కెప్టెన్ ఘనతకెక్కాడు. 2008 ఆగస్టులో వన్డే అరంగేట్రం చేసిన కోహ్లి ఇప్పటివరకు మూడు ఫార్మాట్లలో 20,502 పరుగులు చేశాడు. ఇందులో 20,018 పరుగులను ఈ దశాబ్దంలోనే (2010 నుంచి) చేశాడు. అంతకుముందు గతంలో ఈ రికార్డు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేరిట ఉండేది. 2000–10 సంవత్సరాల మధ్య పాంటింగ్ 18,962 పరుగులు చేశాడు. ఇదే కాలంలో దక్షిణాఫ్రికా మేటి ఆల్ రౌండర్ జాక్వస్ కలిస్ 16,777, భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 15,962 రన్స్ చేశారు.



### కోహ్లి బొటనవేలికి గాయం

విండీస్‌తో మూడో వన్డేలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లికి గాయమైంది. 27వ ఓవర్లో రోచ్ వేసిన బౌన్సర్‌ను ఆడే ప్రయత్నంలో బంతి అతడి కుడి చేతి బొటన వేలికి తగిలింది. అయినా బ్యాటింగ్ కొనసాగించిన కోహ్లి మ్యాచ్ తర్వాత స్పందించాడు. కేవలం గోరు చిట్లిందని, అంతకుమించి ఇబ్బందేమీ లేదని ప్రకటించాడు. తొలి టెస్టుకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశాడు.

### రిటైరవుతున్నానని చెప్పలేదు

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** విధ్వంసక ఆటతో పాటు విభిన్నమైన ప్రవర్తనకు పేరుగాంచిన వెస్టిండీస్ ఓపెనర్ క్రిస్ గేల్ తన రిటైర్మెంట్‌పైనా అదే తీరున అందరినీ ఆశ్చర్యపర్చాడు. భారత్‌తో మూడో వన్డేలో కెరీర్‌లో ఆడిన వన్డేల సంఖ్యకు గుర్తుగా 301 జెర్సీతో బరిలో దిగి... ఔటై వెళ్తూ వీడ్కోలు మ్యాచ్ ఆడేసినవాడిలా సంకేతాలు ఇచ్చిన గేల్ అనంతరం మాత్రం ఆ ఉద్దేశమేదీ లేదన్నట్లు మాట్లాడాడు. 'రిటైర్మెంట్‌పై నేనేమీ ప్రకటించలేదు కదా?' అంటూ అతడు మాట్లాడిన ఓ వీడియోను విండీస్ క్రికెట్ బోర్డు విడుదల చేసింది. తాను మళ్లీ చెప్పే వరకు కొనసాగుతున్నట్లేనని గేల్ అందులో పేర్కొన్నాడు. గేల్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నట్లు తాను అనుకోవడం లేదని కెప్టెన్ హోల్డర్ అనడం గమనార్హం.

# ఛే'దంచేశారు'

- క్లిష్టమైన లక్ష్యం సునాయాసంగా...
- విరాట్ కోహ్లి అజేయ శతకం
- మూడో వన్డేలోనూ టీమిండియా విజయం
- 2-0తో సిరీస్ కైవసం
- ఈ నెల 22 నుంచి తొలి టెస్టు

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** కరీబియన్ పర్యటనలో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌ను టీమిండియా అజేయంగా ముగించింది. కెప్టెన్ కోహ్లి (99 బంతుల్లో 114 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ సెంచరీకి తోడు అయ్యర్ (41 బంతుల్లో 65; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీ కదంతొక్కడంతో బుధవారం వెస్టిండీస్‌తో ఇక్కడ జరిగిన మూడో వన్డేలో 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్ లో భారత లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 35 ఓవర్లలో 255గా నిర్దేశించారు. దీనిని కోహ్లి సేన 32.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి అందుకుంది. అంతకు ముందు విండీస్ 35 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఓపెనర్లు క్రిస్ గేల్ (41 బంతుల్లో 72; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), ఎవిన్ లూయిస్ (29 బంతుల్లో 43; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటైన ఇన్నింగ్స్‌కు చివర్లో నికోలస్ పూరన్ (16 బంతుల్లో 30; ఫోర్, 3 సిక్స్‌లు) బ్యాట్ ఝళిపించడంతో ప్రత్యర్థి మంచి స్కోరు చేసింది. అనంతరం డ/లూ ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని సవరించారు. రెండు వరుస సెంచరీలతో చెలరేగిన కోహ్లికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' పురస్కారాలు దక్కాయి. ఈ నెల 22 నుంచి నార్త్‌సౌండ్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

**ధావన్ ఆడాడోచ్...**

ఓవర్‌కు దాదాపు 7 పరుగుల రన్‌రేట్, పైగా మధ్యలో వర్షం అడ్డుతగిలితే సమీకరణం క్లిష్టమయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఓపెనర్ రోహిత్ శర్మ (10) భారత ఛేదనను ధాటిగా ప్రారంభించాడు. రోచ్ వేసిన ఇన్నింగ్ తొలి రెండు బంతులను బౌండరీలు బాదాడు. మరుసటి ఓవర్లో హోల్డర్ బౌలింగ్‌లో శిఖర్ ధావన్ (36 బంతుల్లో 36; 5 ఫోర్లు) సైతం రెండు వరుస ఫోర్లు కొట్టాడు. మూడో ఓవర్లో పరుగుకు యత్నించిన రోహిత్ రనౌట్‌గా వెనుదిరిగాడు. ధావన్–కోహ్లి మూడో వికెట్‌కు 58 బంతుల్లోనే 76 పరుగులు జోడించి చక్కదిద్దారు. ఈ స్థితిలో స్పిన్నర్ ఫాబియాన్ అలెన్ మూడు బంతుల వ్యవధిలో రెండు వికెట్లు తీసి కలవరపెట్టాడు. తొలుత ధావన్ షాట్‌కు యత్నించి మిడాఫ్‌లో కీమో పాల్‌కు క్యాచ్ ఇవ్వగా, అదే రీతిలో ఆడబోయిన పంత్ (0) ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు.

**'అయ్యారె' కోహ్లి**

భారత ఛేదనలో చక్కటి స్ట్రయిక్ రొటేషన్, అవసరానికి తగ్గట్లు పరుగులు తీస్తూ, వీలు చూసుకుని భారీ షాట్లు కొడుతూ సాగిన కోహ్లి, అయ్యర్ ఇన్నింగ్స్‌లే హైలైట్. ధావన్ పెవిలియన్ చేరినప్పటికి జట్టు స్కోరు 92/3. మరో 134 బంతుల్లో 163 పరుగులు చేయాలి. సాధించాల్సిన రన్ రేట్ 7.4. అటు పిచ్ నెమ్మదిస్తోంది. కానీ, కోహ్లి–అయ్యర్‌కు ఇవేవీ ప్రతిబంధకం కాలేదు. తమ భాగస్వామ్యంలో మూడు ఓవర్ల పాటు వీరు సంయమనం చూపారు. ఎదుర్కొన్న తొలి 11 బంతుల్లో 5 పరుగులే చేసిన అయ్యర్... అలెన్ బౌలింగ్‌లో ఫోర్‌తో ధాటిని పెంచాడు. చేజ్ ఓవర్లో ఫోర్ కొట్టిన కోహ్లి 48 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్నాడు. అయితే, అలెన్, చేజ్ ఓవర్లలో 5 బంతుల వ్యవధిలో 3 సిక్స్‌లు బాది అయ్యర్ పరిస్థితిని పూర్తిగా మార్చేశాడు. అప్పటినుంచి ఓవర్‌కు కనీసం ఒక బౌండరీ లేదంటే సిక్స్‌తో సాగిన వీరి జోరుకు అడ్డే లేకుండా పోయింది. కోహ్లిని మించిన వేగం చూపిన అయ్యర్... పాల్ ఓవర్లో ఫోర్‌తో వరుసగా రెండో అర్ధ సెంచరీ (33 బంతుల్లో) సాధించాడు. 8 వన్డేల కెరీర్‌లో అతడికిది నాలుగో అర్ధసెంచరీ కావడం విశేషం. చేజ్ ఓవర్లో మరో సిక్స్ బాది చెలరేగిపోతున్న అయ్యర్... రోచ్ బౌలింగ్‌లో భారీ షాట్ కొట్టబోయి లాంగాఫ్‌లో హోల్డర్‌కు చిక్కాడు. కానీ, అప్పటికే లక్ష్యం 41 బంతుల్లో 43గా మారి భారత్ విజయం తేలికై పోయింది. కోహ్లి–అయ్యర్ నాలుగో వికెట్‌కు 94 బంతుల్లోనే 120 పరుగుల జోడించారు. రోచ్ ఓవర్లో సింగిల్‌తో కోహ్లి 43వ వన్డే సెంచరీ (94 బంతుల్లో) సాధించాడు. సమయోచితంగా ఆడిన జాదవ్ (12 బంతుల్లో 19 నాటౌట్; ఫోర్, సిక్స్)తో కలిసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. 12 పరుగుల వద్ద హోప్ క్లిష్టమైన క్యాచ్ వదిలేయడంతో కోహ్లికి లైఫ్ లభించింది.



# శాస్త్రికి మరో అవకాశం!

**నేడు భారత కోచ్ పదవికి ఇంటర్వ్యూలు**



**ముంబై:** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ ఎంపిక విషయంలో కెప్టెన్ విరాట్ కోహ్లి మాట చెల్లుబాటవుతుందా లేక కపిల్ దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) మరో విధంగా ఆలోచిస్తోందా! ప్రస్తుత కోచ్ రవిశాస్త్రినే కొనసాగుతారనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ఇతర ఐదుగురు అభ్యర్థులు సీఏసీని మెప్పించేందుకు ఏం చేస్తారనేది ఆసక్తికరం. భారత కోచ్ పదవి కోసం నేడు (శుక్రవారం) ఇంటర్వ్యూలు జరగనున్నాయి. రవిశాస్త్రితో పాటు టామ్ మూడీ, మైక్ హెసన్, లాల్‌చంద్ రాజ్‌పుత్, రాబిన్ సింగ్, ఫిల్ సిమన్స్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కపిల్ దేవ్‌తో పాటు కమిటీలోని ఇతర సభ్యులు అన్షుమన్ గైక్వాడ్, శాంత రంగస్వామి అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారు.

కెప్టెన్ కోహ్లి మద్దతుతో పాటు చెప్పుకోదగ్గ రికార్డు ఉండటం శాస్త్రికి అనుకూలంగా మారింది. అతని శిక్షణలోనే భారత జట్టు తొలిసారిగా ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలుచుకుంది. శాస్త్రి కోచ్‌గా వచ్చిన సమయం (జులై 2017)నుంచి భారత్ 21 టెస్టులు ఆడితే 13 గెలిచింది. వన్డేల్లో 60 మ్యాచ్‌లలో 43 గెలవగా, టి20ల్లో 36 మ్యాచ్‌లలో 25 సొంతం చేసుకుంది. రెండు వన్డే వరల్డ్ కప్‌లలోనూ సెమీఫైనల్ దాటకపోయినా దానిని పెద్ద వైఫల్యంగా ఎవరూ చూడటం లేదు. పైగా ఆటగాళ్లందరితో ఈ భారత మాజీ క్రికెటర్‌కు మంచి సంబంధాలు ఉండటం సానుకూలాంశం. మరోవైపు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌వంటి సహాయక సిబ్బందిని ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలో ఇంటర్వ్యూలు జరుగుతాయి.

# ఇంగ్లండ్ 258 ఆలౌట్

**లండన్:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ రెండో టెస్టులో ఇంగ్లండ్ తొలిరోజే తేలిపోయింది. ఆస్ట్రేలియా పేసర్లు హాజెల్‌వుడ్ (3/58), కమిన్స్ (3/61)తో పాటు స్పిన్నర్ లయన్ (3/68) చెలరేగడంతో ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 77.1 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌటైంది. తొలి రోజు ఆట వర్షంతో రద్దవడంతో పిచ్ పరిస్థితుల దృష్ట్యా టాస్ నెగ్గిన ఆసీస్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ఓపెనర్ జేసన్ రాయ్ (0)ని హాజెల్‌వుడ్ డకౌట్ చేయడంతో ఇంగ్లండ్ పరుగుల ఖాతా తెరవక ముందే వికెట్ కోల్పోయింది. కాసేపటికి కెప్టెన్ రూట్ (14)నూ అతనే ఔట్ చేశాడు. 26 పరుగులకే 2 వికెట్లు కోల్పోగా... ఓపెనర్ బర్న్స్ (53; 7 ఫోర్లు), డెన్లీ (30; 4 ఫోర్లు) నింపాదిగా ఆడుతూ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. లంచ్ విరామం తర్వాత ఇంగ్లండ్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. డెన్లీని హాజెల్‌వుడ్ ఔట్ చేయగా, అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న బర్న్స్‌ను కమిన్స్ పెవిలియన్ చేర్చాడు. సిడిల్ బౌలింగ్‌లో బట్లర్ (12), లయన్ స్పిన్‌కు స్టోక్స్ (13) స్వల్ప వ్యవధిలో వెనుదిరిగారు. దీంతో ఇంగ్లండ్ 138 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. బెయిర్ స్టో (52; 7 ఫోర్లు), వోక్స్ (32; 3 ఫోర్లు, 1 సిక్స్) ఆసీస్ బౌలర్లను ఎదురు నిలవడంతో స్కోరు 200 దాటింది. ఈ దశలో కమిన్స్ చెలరేగడంతో వోక్స్, ఆర్చర్ (12) నిష్క్రమించారు. అర్ధసెంచరీ అనంతరం బెయిర్‌స్టో ఆఖరి వికెట్‌గా పెవిలియన్ చేరడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది.

అనంతరం ఆస్ట్రేలియా రెండో రోజు ఆట ముగిసేసరికి వికెట్ నష్టానికి 30 పరుగులు చేసింది. వార్నర్ (3)ను బ్రాడ్ బౌల్డ్ చేశాడు. క్రీజ్‌లో బాన్‌క్రాఫ్ట్ (5), ఖాజా (18) ఉన్నారు.

ఆసీస్ ఆటగాళ్ల సంబరాలు



# యువీతోనే ఆఖరు!



**న్యూఢిల్లీ:** విదేశాల్లో టి20 టోర్నీలు ఆడేందుకు భారత క్రికెటర్లెవరికీ ఇకపై నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ)లు ఇవ్వమని క్రికెట్ పరిపాలక కమిటీ (సీఓఏ) తెలిపింది. కెనడాలో జరిగిన గ్లోబల్ టి20లో ఆడేందుకు భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్‌కు అనుమతించిన బోర్డు... ఇదే ఆఖరి ఎన్‌ఓసీ అని తేల్చిచెప్పింది. సీఓఏ సభ్యుడొకరు మాట్లాడుతూ 'యువీకి ఎన్‌ఓసీ ఇచ్చాం. ఇక్కడితోనే సరిపెట్టాలనుకుంటున్నాం. ఇకమీదట ఏ భారత క్రికెటర్ విదేశీ లీగ్‌లో ఆడేందుకు ఎన్‌ఓసీ ఇవ్వబోం' అని అన్నారు. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారులు విస్మయం ప్రకటించారు. రిటైర్మెంట్ ప్రకటించిన ఆటగాళ్లను ఇక ఏ టోర్నీలోనూ ఆడకుండా చేయడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బోర్డులో సరైన పాలక వ్యవస్థ లేకపోతే ఇలాంటి అనిశ్చిత నిర్ణయాలే వస్తాయని ఓ అధికారి అన్నారు. మరో అధికారి మాట్లాడుతూ 'ఒక దేశానికి రిటైర్ అయినంత మాత్రాన మొత్తం భౌగోళిక ప్రాంతానికి రిటైర్మెంట్ ప్రకటించినట్లు కాదు. ఒక దేశపు రిటైర్డ్ క్రికెటర్లను అనుమతించడమనేది నిర్వాహకుల ఇష్టం. ఇందులో ఏమైన సమస్య ఉంటే ఐసీసీ చూసుకుంటుంది. కానీ మనమే ఆడించకుండా నిర్ణయం తీసుకోవడం అవివేకం' అని అన్నారు.

# వీబీ చంద్రశేఖర్ కన్నుమూత



**చెన్నై:** భారత మాజీ క్రికెటర్, తమిళనాడు క్రికెట్‌కు సుదీర్ఘ కాలం మూల స్తంభంలా నిలిచిన వక్కడై బిశ్వేశ్వరన్ (వీబీ) చంద్రశేఖర్ గుండెపోటుతో గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన వయసు 58 ఏళ్లు. 1988–90 మధ్య భారత్ తరపున 7 వన్డేలు ఆడిన చంద్రశేఖర్ మొత్తం 88 పరుగులే చేయడంతో స్థానం కోల్పోయి మళ్లీ జట్టులోకి రాలేకపోయారు. అతడి 11 ఏళ్ల ఫస్ట్ క్లాస్ కెరీర్ మాత్రం బాగా సాగింది. తమిళనాడు ఓపెనర్‌గా చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన వీబీ 81 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 43.09 సగటుతో 4,999 పరుగులు సాధించారు. దూకుడైన ఆటకు గుర్తింపు పొందిన చంద్రశేఖర్ 1988–89 ఇరానీ కప్ మ్యాచ్‌లో 56 బంతుల్లోనే సెంచరీ సాధించడం విశేషం. అప్పట్లో భారత్ తరపున అదే ఫాస్టెస్ట్ ఫస్ట్ క్లాస్ సెంచరీ. రిటైర్మెంట్ అనంతరం 2012లో తమిళనాడు కోచ్‌గా, భారత సెలక్టర్‌గా పనిచేసిన ఆయన... ఐపీఎల్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్‌లోకి ధోనిని తీసుకోవడంలో కీలక పాత్ర పోషించారు. కామెంటేటర్‌గానూ గుర్తింపు తెచ్చుకున్న చంద్రశేఖర్ ప్రస్తుతం చెన్నైలో సొంత క్రికెట్ అకాడమీ నిర్వహిస్తున్నారు.

# లంకకూ స్పిన్ దెబ్బ

- తొలి ఇన్నింగ్స్‌లో 227/7
- ఎజాజ్ పటేల్‌కు 5 వికెట్లు

**గాలే:** శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టును బౌలర్లు శాసిస్తున్నారు. తొలిరోజు కివీస్ మెడకు స్పిన్ ఉచ్చు బిగించిన శ్రీలంక రెండో రోజు అదే ఉచ్చులో చిక్కుకుంది. దీంతో గురువారం ఆటలో 12 వికెట్లు నేలకూలాయి. 203/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట ప్రారంభమైన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 83.2 ఓవర్లలో 249 పరుగుల వద్ద ముగిసింది. తొలి సెషన్‌లో లంక పేసర్ లక్మల్ (4/29) విజృంభించాడు. దీంతో కేవలం 46 పరుగులే జోడించి మిగతా సగం వికెట్లను కోల్పోయింది. రాస్ టేలర్ (86; 6 ఫోర్లు) ఓవర్‌నైట్ స్కోర్ వద్దే నిష్క్రమించాడు. టెయిలెండర్లు సౌతీ 14, బౌల్ట్ 18 పరుగులు చేశారు. తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక... ఎజాజ్ పటేల్ (5/76) దెబ్బకు 80 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. ఓపెనర్లు తిరిమన్నె (10), కరుణరత్నే (39; 4 ఫోర్లు) విఫలమవడంతో 66 పరుగులకే 2 వికెట్లను కోల్పోయింది. కుశాల్ మెండిస్ (53; 7 ఫోర్లు, 1 సిక్స్), మాథ్యూస్ (50; 7 ఫోర్లు, 1 సిక్స్) కుదురుగా ఆడటంతో జట్టు స్కోరు 2 వికెట్లకు 143 పరుగులకు చేరింది. ఎజాజ్ తిప్పేయడంతో 18 పరుగుల వ్యవధిలో 5 వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. 161 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన లంకను వికెట్ కీపర్ డిక్‌వెలా (39 బ్యాటింగ్; 1 ఫోర్), లక్మల్ (28 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. ప్రస్తుతం లంక మరో 22 పరుగులు వెనుకబడి ఉంది.


ఎజాజ్ పటేల్

# కోల్‌కతా కోచ్‌గా మెకల్లమ్

**కోల్‌కతా:** న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ బ్రెండన్ మెకల్లమ్ ఐపీఎల్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌కు సిద్ధమయ్యాడు. తాను నాయకత్వం వహించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టుకు ఇప్పుడు హెడ్ కోచ్‌గా నియమితులయ్యాడు. ఈ సీజన్ అనంతరం చీఫ్‌కోచ్ జాక్వస్ కలిస్ సేవలకు మంగళం పాడిన ఫ్రాంచైజీ అతని స్థానంలో మెకల్లమ్‌కు కోచింగ్ బాధ్యతల్ని అప్పగించింది. ఇటీవల గ్లోబల్ టి20లో ఆడిన అతను ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో పాటు అదే యాజమాన్యానికి చెందిన కరీబియన్ ప్రీమియర్ లీగ్ జట్టు ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్‌కు కూడా మెకల్లమ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు.

**లీగ్‌లో మెకల్లమ్..**

2008లో ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో మెకల్లమ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 73 బంతుల్లో 10 ఫోర్లు, 13 సిక్సర్లతో 158 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అనంతం కేకేఆర్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రారంభ సీజన్ నుంచి 2018 వరకు కేకేఆర్‌తో పాటు, కొచ్చి టస్కర్ కేరళ, గుజరాత్ లయన్స్, చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 109 మ్యాచ్‌లాడిన మెకల్లమ్ 27.69 సగటుతో 2,880 పరుగులు చేశాడు.

## జైపూర్ విజయాల బాట

**అహ్మదాబాద్:** జైపూర్ పింక్ పాంథర్స్ మళ్లీ విజయాల బాట పట్టింది. తమ చివరి మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ చేతిలో అనూహ్యంగా ఓడిన పింక్ పాంథర్స్ ఆ షాక్ నుంచి త్వరగానే తేరుకున్నట్లు కనిపించింది. ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 33–25తో పుణేరి పల్టన్‌ను ఓడించింది. జైపూర్ స్టార్ రైడర్ దీపక్ నివాస్ హుడా మరో సూపర్ 'టెన్'తో చెలరేగాడు. పుణే తరపున పంకజ్ మోహిత్ 8 పాయింట్లతో రాణించాడు. ఆట ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన జైపూర్... ఎక్కడా తడబాటుకు గురికాలేదు. తమ రైడింగ్‌తో ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదిస్తూ... అలాగే పుణే రైడర్లను పట్టేస్తూ దూసుకెళ్లింది. ఇదే జోరులో పుణేని ఆలౌట్ చేసి 17–11తో తొలి అర్ధ భాగాన్ని ముగించింది. రెండో అర్ధ భాగంలోనూ దూకుడును కొనసాగించిన జైపూర్ సీజన్‌లో 5 విజయాన్ని నమోదు చేసి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. నేటి మ్యాచ్‌ల్లో యూ ముంబాతో పట్నా పైరేట్స్; గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి.

## యూరో టి20 రద్దు

**లండన్:** మూడు దేశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావించిన 'యూరో టి20' అనూహ్యంగా రద్దయింది. ఐర్లాండ్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్ దేశాల్లో ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 22 వరకు ఆరు ఫ్రాంచైజీ జట్ల మధ్య 'యూరో టి20 స్లామ్' జరగాల్సివుంది. ఆర్థిక కారణాలతో ఈ తొలి సీజన్‌ను రద్దు చేశామని స్లామ్ బోర్డుకు చెందిన ప్రశాంత్ మిశ్రా తెలిపారు. 'భాగస్వామ్య పక్షాలు, ఫ్రాంచైజీ యజమానుల మధ్య చర్చల అనంతరం 2019 సీజన్ నిర్వహణ కష్టమని అభిప్రాయానికి వచ్చాం. వచ్చే ఏడాది ఘనంగా ఆరంభించేందుకు ఈ ఏడాది రద్దు చేశాం' అని అన్నారు. నిజానికి ఈ స్లామ్ నిర్వాహక సంస్థ, ఇటీవలే ముగిసిన గ్లోబల్ టి20 (కెనడా) నిర్వాహక సంస్థ ఒకటే. 'బాంబే స్పోర్ట్స్ లిమిటెడ్ అండ్ వుడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్' అనే ఈ సంస్థ గ్లోబల్ టి20ని సమర్థంగా నిర్వహించలేకపోయింది. ఆటగాళ్ల కాంట్రాక్టు మొత్తాలే కాదు... గతేడాదికి సంబంధించిన 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', సిరీస్ అవార్డుల ప్రైజ్‌మనీ కూడా ఇవ్వలేకపోయింది. ఈ సారైతే చెల్లింపులు జరిపేదాకా మైదానంలో దిగమని ఆటగాళ్లు భీష్మించుకు కూర్చోవడంతో ఓ మ్యాచ్ చాలా ఆలస్యంగా ఆరంభమైంది.

# ‘పరిమితం’.. దేశహితం

న్యూఢిల్లీ

**దేశం ఎదుర్కొంటున్న వేలాది సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పుడు భారత్‌కు ఎంతో బలమైన ప్రభుత్వం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని ఎర్రకోట నుంచి వరుసగా ఆరోసారి, 73వ స్వాతంత్య్ర దినోత్సవాన ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. రంగురంగుల తలపాగాతో గురువారం వేదిక మీదకు వచ్చిన మోదీ.. త్రివిధ దళాల మధ్య సమన్వయం కోసం ఆ మూడింటికీ కలిపి కొత్తగా ఒక అధిపతిని (చీఫ్ ఆఫ్ డిఫెన్స్‌స్టాఫ్ - సీడీఎస్) నియమించడం, దేశంలో జనాభా విస్ఫోటనాన్ని అరికట్టడం, జమ్మూ కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం తదితర అంశాలను తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశంలోని ప్రతి ఇంటికీ పైపుల ద్వారా నీరు అందించేందుకు తమ ప్రభుత్వం రాబోయే కొన్నేళ్లలో రూ. 3.5 లక్షల కోట్లను ఖర్చు చేయనుందని మోదీ చెప్పారు. ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్న నేపథ్యంలో, రాబోయే ఐదేళ్లలో ఏకంగా వంద లక్షల కోట్ల రూపాయలను మౌలిక వసతుల రంగంలో పెట్టి, ఆర్థిక వ్యవస్థ ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ వెల్లడించారు. ఒక దేశం, ఒకే కార్డు వ్యవస్థతో ఒకే కార్డుతో దేశంలో ఎక్కడైనా ప్రయాణాలకు చెల్లింపులు చేసే వ్యవస్థను తమ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. దాదాపు 95 నిమిషాల పాటు, సుదీర్ఘంగా సాగిన మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...**

## జనాభా నియంత్రణకు రాష్ట్రాలూ నడుం బిగించాలి

- త్రివిధ దళాల సమన్వయానికి సీడీఎస్‌ను నియమిస్తాం
- జమ్మూ కశ్మీర్‌పై ప్రజలు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చా
- ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ప్రసంగం

**జనాభాను నియంత్రించాల్సిందే..**

‘జనాభా పెరిగితే రాబోయే తరాల వారికి లెక్కపెట్టలేనన్ని సమస్యలు, సవాళ్లు ఎదురవుతాయి. జనాభాను నియంత్రించేందుకు కేంద్రంతోపాటు రాష్ట్రాలు కూడా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేశం నేరుగా ఎదుర్కొంటున్న సమస్యల్లో ఒకటైన జనాభా విస్ఫోటన సమస్యకు పరిష్కారం కనుగొనాల్సిన సమయం వచ్చింది. కుటుంబాలు చిన్నగా ఉండాలి. ఒక్కో కుటుంబంలో మనుషులు ఎక్కువగా ఉంటే వారికి సరైన విద్య, వైద్య సౌకర్యాలు అందవు. వారి ఇళ్లతోపాటు మొత్తంగా దేశం కూడా సంతోషంగా ఉండదు. ఇప్పటికే దేశంలో కొంత భాగం మంది ప్రజలు జనాభాను తగ్గించుకుని, చిన్న కుటుంబాలుగా ఉంటూ సుఖంగా జీవిస్తున్నారు. వారిని చూసి మిగతా వారు నేర్చుకోవాలి. ఈ నిర్ణయాన్ని అనేక మంది వ్యతిరేకించినా సరే, దేశ, ప్రజలకు మంచి భవిష్యత్తును అందివ్వడం కోసం ఇది తప్పదు’.

**‘సీడీఎస్’విధివిధానాలను రూపొందిస్తున్నాం**

‘త్రివిధ దళాలకు కలిపి కొత్తగా ఓ అధిపతిని నియమిస్తాం. సీడీఎస్ (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్)గా నియమితులయ్యే వ్యక్తి ఆర్మీ, వాయుసేన, నౌకాదళం.. మూడింటికి కలిపి సంయుక్త అధిపతిగా ఉంటారు. త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచడం కోసం సీడీఎస్‌ను నియమించాల్సిన సమయం వచ్చింది. సీడీఎస్ నియామక విధి విధానాలను మా ప్రభుత్వం ఇంకా రూపొందిస్తోంది’అని మోదీ చెప్పారు. ప్రస్తుత విధానంలో త్రివిధ దళాల మధ్య సమన్వయం కోసం మూడు సేనల చీఫ్‌ల కమిటీ (చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ–సీవోఎస్‌సీ) ఉంది. ఆ ముగ్గురు అధిపతుల్లో ఎవరు అత్యంత సీనియర్ అయితే వారు సీవోఎస్‌సీ చైర్మన్‌గా ఉంటారు. కొత్తగా నియమితులయ్యే సీడీఎస్ త్రివిధ దళాల మధ్య సమన్వయం కోసం కృషి చేయడంతోపాటు ప్రధాని, రక్షణ మంత్రులకు సైనిక సలహాదారుగానూ ఉంటారు.

**కశ్మీరీల కలలకు కొత్త రెక్కలు ఇవ్వాలి**

‘జమ్మూ కశ్మీర్ అంశంలో నాకు వ్యక్తిగతంగా ఎలాంటి ఉద్దేశం, భావం లేదు. కేవలం ప్రజలు అప్పజెప్పిన బాధ్యతను పూర్తి చేశా. జమ్మూ కశ్మీర్, లదాఖ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన, వారి కలలకు కొత్త రెక్కలను ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. 370వ అధికరణం రద్దవ్వడంతో ఇప్పుడు భారత్ ఒక దేశం, ఒకే రాజ్యాంగంగా మారింది. సాహసోపేత, పెద్ద నిర్ణయాలు తీసుకోవడానికి మా ప్రభుత్వం సంశయించదు. ఆర్టికల్ 370పై గత 70 ఏళ్లలో చేయలేని దానిని మేము ఇప్పుడు చేసి చూపించాం’

**దేశంలోనే విహారయాత్రలకు వెళ్లండి..**

‘ఏడాదికి దాదాపు 2 కోట్ల మంది భారతీయులు విదేశాలకు విహారయాత్రలకు వెళ్తున్నారు. వారంతా 2022 నాటికి దేశంలోనే కనీసం 15 పర్యాటక కేంద్రాలను సందర్శించాలి. దీనివల్ల దేశీయంగా పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభించి దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం విదేశాల్లో మాదిరిగా దేశంలోని పర్యాటక కేంద్రాల్లో చాలా మంచి హోటళ్లు ఉండకపోవచ్చు. కానీ, ప్రజలు వెళ్లడం మొదలుపెడితే వాటంతట అవే వస్తాయి.



ఎర్రకోట వద్ద పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**దేశం గొప్పగా మారాలంటే తప్పదు..**

‘దేశం గొప్పగా మార్చేందుకు లోక్‌సభతోపాటు అన్ని శాసనసభలకూ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి. ప్రస్తుతం జమిలి ఎన్నికల ప్రస్తావన వస్తుండటం శుభపరిణామం. ‘ఒక దేశం, ఒక ఎన్నిక’ అంశంపై అన్ని భాగస్వామ్య పక్షాల్లో చర్చలు జరగాలి’అని మోదీ అన్నారు. అయితే రాజ్యాంగం మార్చకుండానే జమిలి ఎన్నికలు అసాధ్యమని న్యాయ కమిషన్ గతేడాది ఆగస్టులోనే తేల్చి చెప్పడం తెలిసిందే.

## ఆరేళ్లు.. ఆరు తలపాగాలు



స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలప్పుడు ప్రసంగం చేసే సమయంలో వైవిధ్యమైన తలపాగాలు ధరించడం మోదీ ప్రత్యేకత. 73వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై ప్రసంగం చేసే సమయంలోనూ మోదీ ఆ ప్రత్యేకతను చాటుకున్నారు. పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగులున్న తలపాగాను, సగం వరకే చేతులున్న తెల్ల కుర్తా, పైజామా, కాషాయ రంగు అంచులున్న కండువాను ధరించి మోదీ వేదికపైకి వచ్చారు. 2014లో తొలిసారి ఎర్రకోటపై నుంచి ప్రసంగించినప్పుడు మోదీ తల భాగం ఎర్రగా, తోక భాగం ఆకుపచ్చ జో..ద్‌పురీ తలపాగా పెట్టుకున్నారు. 2015లో పసుపు రంగు వస్త్రంపై ఎరుపు, ముదురు ఆకుపచ్చ రంగు గీతలున్న తలపాగాను, 2016లో పసుపు, గులాబీ రంగు తలపాగాను మోదీ ధరించారు. 2017లో దట్టమైన ఎరుపు, పసుపు రంగులపై బంగారు వర్ణం గీతలున్న తలపాగాను, 2018లో కాషాయ తలపాగాతో మోదీ ఎర్రకోటపైకి వచ్చారు.

## ఆహ్లాద వాతావరణంలో ఉత్సాహంగా..

**73వ స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమం ఎర్రకోటలో ఆహ్లాద వాతావరణంలో ఉత్సాహంగా సాగింది. మోదీ ఎర్రకోటకు చేరుకుని తిరిగి వెళ్లే వరకూ కార్యక్రమం జరిగిన తీరు ఇలా...**

- చారిత్రక కోట వద్దకు ప్రధాని చేరుకోగానే సందర్శకులంతా లేచి నిలబడ్డారు.
- కార్యక్రమానికి నరేంద్ర మోదీ తెల్లని పైజామా–కుర్తా, రాజస్తానీ తరహా రంగురంగుల తలపాగా ధరించి వచ్చారు.
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మోదీకి స్వాగతం పలికారు.
- తర్వాత మోదీ ఇంటర్ సర్వీసెస్, పోలీస్‌గార్డ్‌ల వందనం స్వీకరించారు
- అనంతరం ప్రధాని ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.
- తర్వాత మోదీ జాతిని ఉద్దేశించి 95 నిమిషాల పాటు ప్రసంగించారు. వరుసగా ఆరోసారి బుల్లెట్ ప్రూఫ్ పోడియం రక్షణ లేకుండా ప్రసంగించారు.
- ఈ కార్యక్రమానికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్ జైశంకర్, నితిన్ గడ్కరీ, రమేశ్ పోఖ్రియాల్, ప్రహ్లాద్ సింగ్ పటేల్ త్రివిధ దళాధిపతులు బిపిన్ రావత్, బి.ఎస్. ధనోవా, కరమ్‌బీర్ సింగ్ హాజరయ్యారు.
- ఎర్రకోట ముందు వేలాది మంది పాఠశాల పిల్లలు ‘నయా భారత్’ అనే హిందీ అక్షరాల ఆకారంలో నిలబడ్డారు.
- తెల్లవారుజామున కురిసిన వర్షం వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చింది.

**• అమరవీరులకు సలాం**



ఢిల్లీలోని ఇండియా గేట్ వద్దనున్న అమర్‌జవాన్ జ్యోతి వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి కోవింద్

**• వందనం ఆసేతు హిమాచలం**



జమ్మూలో జరిగిన స్వాతంత్య్రదిన వేడుకల్లో అలరించిన పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

**• భారీ త్రివర్ణం**



ముంబైలోని హిరానందాని గార్డెన్స్‌లో భారీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రజలు

**• తల్లీ భారతి వందనం**



మహారాష్ట్ర కొల్హాపూర్‌లోని ఓ పాఠశాలలో విద్యార్థులతో కలిసి జెండా వందనం చేస్తున్న నటి ఊర్మిళ మతోండ్కర్

**క్లుప్తంగా...**

### పాక్ ప్రచారం అబద్ధం

**న్యూఢిల్లీ:** నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి జరిగిన కాల్పుల్లో ఐదుగురు భారత సైనికులు చనిపోయారంటూ పాక్ చేస్తున్న ప్రచారం అంతా అబద్ధమని సైన్యం తెలిపింది. ఎల్‌వోసీ వెంట జరిగిన కాల్పుల్లో తమ సైనికులు ముగ్గురు, భారత్ సైనికులు ఐదుగురు చనిపోయారంటూ పాక్ సైనిక ప్రతినిధి జనరల్ ఆసిఫ్ గఫూర్ తెలిపారు. దీనిపై భారత్ సైనికాధికారి ఒకరు స్పందిస్తూ... ‘పాక్‌వన్నీ అసత్యాలే. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేశాక ఎల్‌వోసీ వెంట పాకిస్తానే బలగాల మోహరింపును పెంచింది’అని తెలిపారు.

### 370 రద్దుపై సుప్రీంలో నేడు విచారణ

**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగ అధికరణ 370 రద్దు, అనంతరం అక్కడ మీడియాపై ఆంక్షలు విధించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టనుంది. ఈ పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం విచారించనుంది.

### అయ్యో! ఇషా గుప్తా



**న్యూఢిల్లీ:** ఆగస్టు 15వ తేదీన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బాలీవుడ్ నటి ఇషా గుప్తాపై సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లో కామెంట్లు వెల్లువెత్తాయి. గురువారం మాజీ మిస్ ఇండియా ఇషా మాత్రం ‘గణతంత్ర దిన శుభాకాంక్షలు’ అని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అంతే.. నెటిజన్లు వెంటనే తమదైన శైలిలో స్పందించారు. ఇషా గుప్తా బాధ్యత లేకుండా వ్యవహరించారని కొందరు విమర్శించారు. తన అకౌంట్ హ్యాక్ అయిందని ఇషా తెలపడంతో కథ ముగిసింది.

### వాణిజ్య ఒప్పందానికి హాంకాంగే కీలకం: ట్రంప్

**హాంకాంగ్:** హాంకాంగ్‌పై చైనా తీసుకునే వైఖరి ఆధారంగానే ప్రస్తుతం ఆ దేశంతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధానికి ముగింపు ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హాంకాంగ్ ప్రజాస్వామ్య నిరసనకారులపై మానవీయంగా వ్యవహరించాలని కూడా ట్రంప్ చైనా నాయకత్వాన్ని కోరారు. హాంకాంగ్‌లో ఆందోళనలను కఠినంగా అణచి వేసేందుకు చైనా సైన్యాన్ని తరలించనుందనే కథనాల నేపథ్యంలో ట్రంప్ ట్విట్టర్‌లో వ్యాఖ్యలు చేశారు.

## జిబ్రాల్టర్‌లో విడుదలైన నలుగురు భారతీయులు

**లండన్:** ఇరాన్‌కు చెందిన ఆయిల్ ట్యాంకర్‌లో ఉండి అరెస్టయిన కెప్టెన్ సహా నలుగురు భారత సిబ్బందిపై పోలీసుల విచారణ ముగిసి వారు జిబ్రాల్టర్‌లో గురువారం విడుదలయ్యారు. స్పెయిన్‌కు దక్షిణాన, సముద్ర తీరంలో ఉండే బ్రిటిష్ ప్రాంతమే ఈ జిబ్రాల్టర్. పనామా జెండా కలిగిన ఈ ఆయిల్ ట్యాంకర్ జిబ్రాల్టర్ జలాల్లోని ఐరోపా పాయింట్ వద్ద ఉండగా, గత నెల 4వ తేదీన జిబ్రాల్టర్ అధికారులు వారిని అడ్డగించి ట్యాంకర్‌ను తమ అధీనంలోకి తీసుకుని అందులోని 28 మంది సిబ్బందిని అరెస్టు చేశారు. సిబ్బందిలో ఎక్కువ మంది భారతీయులే. సిరియాపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షలున్నాయి. ఈ ఆయిల్ ట్యాంకర్ ద్వారా సిరియాకు ముడి చమురును తీసుకెళ్తున్నారనే అనుమానంతో జిబ్రాల్టర్ అధికారులు సిబ్బందిని అరెస్టు చేశారు. అయితే అది సిరియాకు వెళ్తున్నది కాదని అప్పటి నుంచి ఇరాన్ ప్రభుత్వం, ట్యాంకర్ సిబ్బంది చెబుతూనే ఉన్నారు. దీంతో తాజాగా నలుగురు భారతీయులపై పోలీసులు విచారణ ముగించి, వారిని జిబ్రాల్టర్‌లో విడుదల చేశారు.

## అత్యంత వేడి మాసం జూలై



**వాషింగ్టన్:** భూ గ్రహ చరిత్రలోనే ఈ ఏడాది జూలై నెల అత్యంత వేడి మాసంగా నమోదైంది. ఈ విషయాన్ని గతంలోనే యూరోపియన్ యూనియన్ వెల్లడించగా, తాజాగా అమెరికా జాతీయ వాతావరణ, సముద్ర పరిశీలన సంస్థ (ఎన్‌వోఏఏ) కూడా గురువారం ధ్రువీకరించింది. ‘ప్రపంచంలోని అనేక చోట్ల జూలై నెలలో ఎన్నడూ లేనంత వేడిగా వాతావరణం ఉంది. భూ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన నెల 2019 జూలై. ఈ వేడిమి కారణంగా ఆర్కిటిక్, అంటార్కిటిక్ సముద్రాల్లోనూ మంచు భారీగా కరిగింది’ అని ఎన్‌వోఏఏ తెలిపింది. ఆ వివరాల ప్రకారం, 20వ శతాబ్దంలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 15.8 డిగ్రీ సెల్సియస్ కాగా, తాజాగా ఈ జూలైలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 16.75 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. 2016 జూలై రెండో ఇప్పుడు ప్రపంచంలో రెండో అత్యంత వేడి మాసంగా ఉంది. పది అత్యంత వేడి జూలై మాసాల్లో తొమ్మిది 2005 తర్వాతనే నమోదవడం గమనార్హం. ఇక ఆర్కిటిక్ సముద్రంలో మంచు సాధారణంగా జూలై నెలలో ఉండే సగటు కన్నా ఈ ఏడాది జూలై నెలలో 19.8 శాతం తక్కువగా ఉంది. అంటార్కిటికాలోనూ సగటు కన్నా 4.3 శాతం తక్కువ మంచు ఉంది.



### మోదీకి రాఖీ కట్టిన ట్రిపుల్ తలాక్ పిటిషనర్

**కోల్‌కతా:** ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన ఐదుగురిలో ఒకరైన పశ్చిమ బెంగాల్ మహిళ ఇష్రత్ జహాన్ గురువారం ఢిల్లీకి వచ్చి మోదీకి రాఖీ కట్టారు. తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించేలా చట్టాన్ని తెచ్చినందుకు ముస్లిం సోదరిల తరపున ఆమె మోదీకి కృతజ్ఞతలు చెప్పారు. త్రివర్ణాలతో ఉన్న రాఖీని మోదీ చేతికి కట్టే అవకాశం వచ్చినందుకు తాను ఎంతో సంతోషంగా ఉన్నానని ఆమె తెలిపారు. అయితే తాను కోల్‌కతా నుంచి తెచ్చిన రసగుల్లాను భద్రతా కారణాల వల్ల మోదీకి ఇవ్వలేకపోయినందుకు ఆమె విచారం వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని హౌరాలో నివసించే ఇష్రత్ జహాన్‌కు దుబాయ్‌లోని తన భర్త 2014లో మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు ఇవ్వడంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2017 ఆగస్టు 22న సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేయగా, ఆ చర్యను నేరంగా పరిగణించేలా కేంద్రం చట్టం తెచ్చింది.

## కశ్మీర్‌లో త్రివర్ణ పతాకం రెపరెపలు

**కశ్మీర్ ప్రజల గుర్తింపునకు ఢోకా లేదన్న గవర్నర్ సత్యపాల్ మాలిక్**

**శ్రీనగర్/లెహ్:** జమ్మూకశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి రద్దు కారణంగా రాష్ట్ర ప్రజల ప్రత్యేక గుర్తింపుపై ఎలాంటి ప్రభావం ఉండబోదని గవర్నర్ సత్యపాల్ మాలిక్ స్పష్టం చేశారు. గురువారం షేర్–ఇ–కశ్మీర్ స్టేడియంలో నిర్వహించిన 73వ స్వాతంత్య్ర జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ‘కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు జమ్మూకశ్మీర్ ప్రజల గుర్తింపుపై ఎలాంటి ప్రభావం చూపబోవని హామీ ఇస్తున్నాను. పైపెచ్చు, రాష్ట్రంలోని భిన్న ప్రాంతాల ప్రజల భాషా సాంస్కృతిక వికాసానికి అవి సాయపడతాయి. నవ కశ్మీర్ నిర్మాణంలో పాలుపంచుకోవాలని యువతను కోరుతున్నాను’అని పేర్కొన్నారు. కార్యక్రమానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. ముందు జాగ్రత్తగా ముఖ్య నేతలందరినీ నిర్బంధంలోకి తీసుకున్నందున వారెవరూ రాలేకపోయారు. నగరంలో అసాధారణ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా రద్దయ్యాయి. కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడనున్న లదాఖ్‌లో ప్రజలు మొట్టమొదటి స్వాతంత్య్ర వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. లదాఖ్‌లో జరిగిన వేడుకల్లో ప్రజలు తమ ఏకైక ఎంపీ జమ్యాంగ్ త్సెరింగ్ నంగ్యా(24)తో కలిసి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.



లదాఖ్‌లో స్థానికులతో కలిసి నృత్యం చేస్తున్న ఎంపీ త్సెరింగ్

### నేడు ఐరాస రహస్య చర్చలు

**ఐక్యరాజ్యసమితి:** జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను భారత్ రద్దు చేయడంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అరుదైన సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశాన్ని శుక్రవారం ఉదయం గోప్యంగా నిర్వహించనున్నట్లు దౌత్యవేత్తలు తెలిపారు. చైనా విజ్ఞప్తి మేరకు ఈ విధంగా రహస్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఐరాసలో బహిరంగ చర్చను నిర్వహింపజేయడంలో పాక్ విఫలమైనట్లయింది. భద్రతా మండలికి ప్రస్తుతం రొటేషన్ పద్ధతిలో చీఫ్‌గా ఉన్న పోలండ్ అంశంపై ఉదయం పది గంటలకు చర్చ నిర్వహించేలా లిస్టింగ్ చేసిందని వారు చెప్పారు. కశ్మీర్ అంశంపై భద్రతా మండలి చర్చించడం చాలా అరుదన్నారు.



ప్రియమైన జేమ్స్ వెబ్ టెలిస్కోప్..

## ఇదో రకం ప్రేమ లేఖ!

**జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌కు చార్లీ జేన్ ఆండర్స్ లెటర్**



రెండేళ్లలో నువ్వు ఆకాశంలోకి చేరాక అన్నీ మారిపోతాయి. మనుషులు ఎక్కడి నుంచి వచ్చారన్నది స్పష్టమవుతుంది. భవిష్యత్తులో ఏయే గ్రహాలపై నివసిస్తారో తెలిసే చాన్సుంది. నిజానికి మేం నీ కోసం చాలా ఏళ్లుగా వేచి చూస్తున్నాం. 2007లో తొలిసారి నిన్ను ప్రయోగిస్తారని విన్నాం. కానీ కొంత ఎదురుచూపు తప్పలేదు. ఏమైతేనేం.. 2021 మార్చికల్లా నువ్వు 25 అడుగుల పొడవైన బంగారు అద్దంతో ఐదు పొరల సూర్యరక్షణ కవచంతో దర్శనమిస్తే అది అద్భుతంగానే ఉంటుంది. నీక్కొంచెం కష్టం కావచ్చుగానీ.. భూమికి 10 లక్షల మైళ్ల దూరంలో కుదురుకుంటావనే ఆశిస్తున్నాం. అక్కడి నుంచి నీ చూపులు విశ్వం మొత్తం ప్రసరించనున్నాయి. మేమెవ్వరం చూడని, చూడలేని లోకాలను నీ కళ్లు చూడనున్నాయి.

**సాంకేతిక అద్భుతం నువ్వు..**

జేమ్స్ వెబ్ టెలిస్కోప్.. నువ్వో సాంకేతిక అద్భుత మనడంలో అతిశయోక్తి లేదు. సూర్యుడి నుంచి నిన్ను రక్షించేందుకు ఉద్దేశించిన ఐదు పొరల రక్షణ కవచం కోసం ఏకంగా ప్రత్యేక పదార్థాన్ని తయారు చేయాల్సి వచ్చింది. ఎల్2 లాంగ్రేంజ్ పాయింట్‌లో కుదురుగా తిరిగేందుకు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ సిద్ధం చేశాం. ఫ్రెంచ్ గయానా అంతరిక్ష కేంద్రం నుంచి నువ్వు నింగికెగసే సమయానికి బంగారు అద్దం, రక్షణ కవచం ఎంచక్కా ఏరియన్ 5 రాకెట్‌లో ఒదిగిపోతాయి. కక్ష్యలోకి చేరాక ఇవన్నీ వారం రోజుల్లో నెమ్మదిగా విచ్చుకుంటాయిలే! అప్పటి నుంచే మాకు ఈ విశ్వం గురించి బోలెడన్ని విషయాలు తెలుస్తాయి. ఈగల్స్ నెబ్యులాలోని సృష్టి స్తంభాల రహస్యాలతో పాటు మన సౌర కుటుంబంలోని వాటి గురించి కొత్త విషయలు తెలియనున్నాయి.

**కొత్త లోకాలపైనే ఆసక్తి..**

నీ పనిపై నాకు అమితాసక్తి పెంచేది ఏంటో తెలుసా? భూమికి అవతల ఇంకా ఎన్ని భూమి లాంటి గ్రహాలున్నాయో నువ్వు చెబుతావన్న విషయం. అలాగని సౌరకుటుంబంలోని గ్రహాలపై నాకు చిన్నచూపేమీ లేదుగానీ.. ఎక్కడో దూరంగా ఉండే ఇంకో సూర్యుడి వెలుగు నాలో ఆసక్తి పెంచుతోందంతే. ఆకాశంలో రెండు సూర్యుళ్లు ఉండే గ్రహాలు.. లేదా సూర్యుడు అటూ ఇటూ కదలకుండా ఒకే చోట ఉండే గ్రహాలు... రోజంతా ఇంద్రధనుస్సులాంటి రంగులు వెదజల్లే సూర్యుడు ఉండే గ్రహాలు.. అబ్బో తలచుకుంటేనే ఒళ్లు పులకరిస్తోంది. తన చుట్టూ తిరిగే గ్రహాల వాతావరణంలోకి సూర్యుడి కాంతి ఎలా చేరుతుందో నిశితంగా పరిశీలిస్తే అక్కడ ఎలాంటి రసాయనాలున్నాయన్నది నీవు కనిపెట్టగలవు. ఆయా గ్రహాల్లో నీరు ఉంటే నీ పరారుణ కాంతి కెమెరా కంటిని అవి తప్పించుకోలేవు. కార్బన్‌డయాక్సైడ్, మీథేన్ వంటి వాయువులు బోలెడున్న గ్రహాల్లోని గ్రహాంతర జీవరాశులను గుర్తించిన తొలి టెలిస్కోపు నువ్వే అవుతావా? అచ్చం మన భూమి మాదిరిగానే ఉండే గ్రహాన్ని నువ్వే గుర్తించి మాకు చెబుతావా..? ఈ విశాల విశ్వంలో కాంతి సంవత్సరాల దూరంలో మనిషికి ఇంకో ఇల్లు ఉందని నీ ద్వారానే మాకు తెలుస్తుందా..? ఎప్పటికైనా ఇలాంటి మరో ప్రపంచాన్ని చేరాలనుకున్న మా ఆశలు సజీవంగా ఉంచేది నీవే. ఎప్పుడెప్పుడు నింగికెగురుతావా అని వేయి కళ్లతో ఎదురుచూస్తూ..

**నువ్వంటే ఆశ్చర్యపడుతూ..**

సైన్స్ ఫిక్షన్ రచయిత చార్లీ జేన్ ఆండర్స్.. ఇంకో రెండేళ్లలో ప్రయోగించనున్న జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌కు ఓ ఉత్తరం రాస్తే ఎలా ఉంటుందనే ఆలోచనకు ప్రతిరూపం ఈ లేఖ. లక్షల మైళ్ల అవతల అంతరిక్షంలో ఉంటూ ఇప్పటివరకూ విశ్వగవాక్షంగా పనిచేసిన హబుల్ టెలిస్కోపు స్థానాన్ని జేమ్స్ వెబ్ త్వరలో భర్తీ చేయనుంది.

– నేషనల్ జియోగ్రాఫిక్‌తో ప్రత్యేక ఏర్పాటు

# సాక్షి బిజినెస్

శుక్రవారం
16-8-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 353 ▼ | 104 ▲ |
| 37,312 | 11,029 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,765 | ▼ | 10 |
| డోజోన్స్ | 25,559 | ▲ | 80 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,067 | ▼ | 81 |
| డాక్స్ | 11,413 | ▼ | 80 |
| షాంఘై | 2,816 | ▲ | 7 |
| నికాయ్ | 20,406 | ▲ | 249 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.02 | 71.84 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.10 | 87.18 |
| యూరో | ఎస్‌బీఐ | 77.89 | 80.82 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 65.55 | 68.03 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.21 | 49.35 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.43 | 52.17 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.23 | 19.99 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.66 | 20.23 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.53 | 10.89 |



అస్తవ్యస్తం.. ఆటోమొబైల్ రంగం

# బండి కాదు.. మొండి ఇది..!

- అమ్మకాలు లేక ఉత్పత్తి తగ్గించుకుంటున్న కంపెనీలు
- దీంతో ఉద్యోగాల్లో కూడా కోత
- ఇప్పటికే 3.5 లక్షల కొలువులు కట్
- తాత్కాలిక సిబ్బందికి మరింత కష్టకాలం
- సేల్స్, ఆర్ అండ్ డీలో ఉద్యోగాలకు ఎసరు

సాక్షి, బిజినెస్ విభాగం

**వా**హన విక్రయాలు నానాటికి తగ్గిపోతుండటంతో ఆటోమొబైల్ రంగం తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో కూరుకుపోతోంది. జూలైలో అమ్మకాలు దాదాపు రెండు దశాబ్దాల కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీంతో వాహన తయారీ సంస్థలు ఉత్పత్తిని తగ్గించేసుకుంటున్నాయి. తాజాగా విడుదలైన గణాంకాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూలై మధ్యలో దేశీ ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి 13.18% తగ్గిపోయింది. మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఫోర్డ్, టొయోటా, హోండా వంటి దిగ్గజాలన్నీ భారీగా ఉత్పత్తి తగ్గించుకుంటున్నాయి. హ్యుందాయ్, ఫోక్స్‌వ్యాగన్ ఇండియా మాత్రమే ఉత్పత్తిని కాస్త పెంచుకున్నాయి. ఆటోమొబైల్ తయారీ సంస్థల సమాఖ్య సియామ్ గణాంకాల ప్రకారం గతేడాది ఏప్రిల్–జూలై మధ్య కాలంలో ద్విచక్ర వాహనాల ఉత్పత్తి 87,13,476 యూనిట్లుగా ఉండగా.. ఈ ఏడాది అదే వ్యవధిలో సుమారు 10% పడిపోయి 78,45,675గా నమోదైంది. ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి 13,97,404 యూనిట్ల నుంచి 13% క్షీణతతో 12,13,281 యూనిట్లకు పడిపోయింది. ఈ పరిణామాలతో ఏప్రిల్ నుంచి చూస్తే ఇప్పటిదాకా ఆటోమొబైల్ రంగంలో (వాహన తయారీ సంస్థలు, విడిభాగాల తయారీ సంస్థలు, డీలర్లు మొదలైన వర్గాలు) ఇప్పటిదాకా 3.5 లక్షల ఉద్యోగాల్లో కోత పడినట్లు అంచనా. తమ పరిధిలో 15,000 మంది దాకా ఉద్యోగులను తొలగించాల్సి వచ్చిందని, వందలకొద్దీ డీలర్‌షిప్‌లు మూతబడటంతో వేలమంది ఉపాధి కోల్పోయారని సియామ్ స్వయంగా వెల్లడించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో.. ఇకపై తాత్కాలిక ఉద్యోగులు, సేల్స్.. మార్కెటింగ్ విభాగంలో సర్వీసులు అందించే వారు, పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డీ) విభాగాల్లో ఉద్యోగులపై ప్రతికూల ప్రభావాలు మరింతగా ఉండనున్నాయని మానవ వనరుల (హెచ్‌ఆర్) సంస్థలు అంచనా వేస్తున్నాయి.

## అంతర్జాతీయంగా ఇదే ధోరణి..

**అం**తర్జాతీయంగా కూడా ఆటోమొబైల్ రంగంలో మందగమన ధోరణులే నెలకొన్నాయని, దీనికి భారత్ మినహాయింపేమీ కాదని సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ సీఈవో ఆదిత్య నారాయణ్ మిశ్రా తెలిపారు. దీంతో కంపెనీలు వ్యయాలు తగ్గించుకోవడానికి తమ పరిధిలో తీసుకోగలిగిన చర్యలన్నీ తీసుకుంటున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఉత్పత్తి తగ్గించుకోవడం, తాత్కాలికంగా ప్లాంట్లు మూసివేయడం వంటివి చేస్తున్నాయని మిశ్రా చెప్పారు. మందగమనం ఇలాగే కొనసాగితే రోజువారీ కార్యకలాపాలకు అంతగా ముఖ్యం కాకపోయినా అధిక వేతనాలు అందుకునే వారిని తొలగించడంపై కూడా కంపెనీలు దృష్టి పెట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. 'తయారీ విభాగంపైనే ఎక్కువగా ప్రభావం ఉంటుంది. కంపెనీలు ఉత్పత్తిని తగ్గించడం వల్ల ముఖ్యంగా తాత్కాలిక సిబ్బందిపై ప్రభావం పడుతుంది. ఆ తర్వాత పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల విభాగంలో మధ్య స్థాయి నుంచి సీనియర్ స్థాయి ఉద్యోగాల్లో కూడా కోత పడేందుకు ఎక్కువగా అవకాశాలు ఉన్నాయి' అని మిశ్రా చెప్పారు. పర్మనెంటు ఉద్యోగులను తొలగించడం అన్నది ఆఖర్న మాత్రమే జరగొచ్చని.. అయితే మందగమన ప్రభావాలు మరింత తీవ్రమైతే ఆయా ఉద్యోగుల బోనస్‌లు, ఇంక్రిమెంట్లు మొదలైన వాటిల్లో కోత పడొచ్చని తెలిపారు. మరోవైపు, సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగాల్లోని సర్వీస్ సిబ్బందిపై ఎక్కువగా ప్రభావం పడుతుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ సంస్థ బిజినెస్ హెడ్ మునీరా లోలివాలా అభిప్రాయపడ్డారు. 'వచ్చే కొద్ది నెలల్లో మందగమనానికి అడ్డుకట్ట పడగలదని ఆశిస్తున్నాం. అయితే సేల్స్, ఆర్‌అండ్‌డీ విభాగాల్లోని ఉద్యోగాల్లో కొంత మేర కోత పడే అవకాశాలు ఉన్నాయి. ఇక డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు మొదలైన వారి స్థాయిల్లోనూ ఉద్యోగాల్లో కోత ఉంటుంది. పడిపోతున్న వాహన విక్రయాల కారణంగా పరికరాల తయారీ పరిశ్రమపైనా ప్రభావం తప్పదు' అని ఆమె చెప్పారు.

### ఉత్పత్తిలో కోత (ఏప్రిల్-జూలై మధ్య కాలంలో)

| కంపెనీ | కోత(%) |
|---|---|
| మారుతీ సుజుకీ | -18 |
| మహీంద్రా | -11 |
| టాటా మోటార్స్ | -20 |
| హోండా కార్స్ | -19 |
| టొయోటా | -21 |
| హీరో మోటోకార్ప్ | -12 |
| హోండా మోటార్ సైకిల్ | -18 |
| టీవీఎస్ మోటార్ | -8 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | -22 |



## మరో 10 లక్షలకు పైగా కొలువులకు గండం..

**దేశీ** ఆటోమొబైల్ రంగంలో దాదాపు 3.5 కోట్ల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. కానీ, గడిచిన ఏడాదిన్నర కాలంగా ఎలక్ట్రిక్ వాహనాలు తదితర అంశాలపై కేంద్రం పలు నిర్ణయాలు ప్రకటిస్తుండటం వల్ల విధానాల్లో స్పష్టత లోపించడంతో ఈ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇక రుణాల లభ్యత కూడా అంతంతమాత్రంగానే ఉండటం, వాహనాలకు డిమాండ్ పడిపోవడం ఆటోమొబైల్ రంగాన్ని మరింతగా కుంగదీస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆటోమొబైల్ రంగంలో ఏకంగా 10 లక్షల దాకా ఉద్యోగాల్లో కోత పడే అవకాశం ఉందంటూ ఆటోమోటివ్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య (ఏసీఎంఏ) గత నెలలోనే హెచ్చరించింది.

## కారు.. బైక్ రివర్స్ గేర్..!




## ప్రభుత్వ మద్దతు కావాలి..

ఆటో రంగంలో పెను మార్పుల కారణంగా ఈ పరిస్థితులు తలెత్తాయని మైఖేల్ పేజ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ మోహిత్ భారతి వ్యాఖ్యానించారు. 'ఇదే ధోరణి మరికొంత కాలం సాగిందంటే ఆటో పరికరాల సంస్థలు, అనుబంధ సంస్థల్లోనూ ఉద్యోగాల్లో కోత తప్పకపోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గానీ తక్షణం జోక్యం చేసుకోకపోతే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆటో రంగానికి పరిస్థితులు ఆశావహంగానైతే కనిపించడం లేదు' అని మోహిత్ పేర్కొన్నారు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ని తగ్గించాలని, రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు ప్రతిపాదనలను కొంత కాలం వాయిదా వేయడం ద్వారా పరిశ్రమ కోలుకునేందుకు కాస్త వెసులుబాటు కల్పించాలంటూ ఆటో రంగ సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

| | |
|---|---|
| 2018-19 క్యూ1లో వాహన విక్రయాలు | 69,42,742 |
| 2019-20 క్యూ1లో వాహన అమ్మకాలు | 60,85,406 |

↓ 13%

## రిలయన్స్ క్యాపిటల్ లాభం నాలుగింతలు

### క్యూ1లో రూ.1,218 కోట్లకు




**న్యూఢిల్లీ:** అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ క్యాపిటల్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో నాలుగు రెట్లు పెరిగింది. గత క్యూ1లో రూ.295 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.1,218 కోట్లకు పెరిగిందని రిలయన్స్ క్యాపిటల్ తెలిపింది. ఆదాయం అధికంగా రావడంతో నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.4,641 కోట్ల నుంచి 31 శాతం వృద్ధితో రూ.6,083 కోట్లకు ఎగసిందని వివరించింది. ఆస్తులు రూ.83,973 కోట్ల నుంచి రూ.79,207 కోట్లకు పెరిగాయని పేర్కొంది. ప్రజల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఏమీ సమీకరించలేదని వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,454 కోట్ల నికర నష్టాలు వచ్చాయని రిలయన్స్ క్యాపిటల్ తెలిపింది. రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ కోసం రూ.2,104 కోట్లు కేటాయించడం వల్ల ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని వివరించింది.

## అవాంఛిత కాల్స్‌పై అవగాహన పెంచండి

### ట్రాయ్‌ని కోరిన టెల్కోలు

**న్యూఢిల్లీ:** అవాంఛిత టెలిమార్కెటింగ్ కాల్స్‌కు సంబంధించి అమల్లోకి వస్తున్న నిబంధనల గురించి వినియోగదారుల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ని టెలికం సంస్థలు కోరాయి. ఫిర్యాదులు, పరిష్కార విధానం పనిచేసే తీరు గురించి కస్టమర్లకు తెలిస్తే నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్(సీవోఏఐ) డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ తెలిపారు. 'డు నాట్ డిస్టర్బ్' విధానం పనితీరు, ఐచ్ఛికాలను, ఫిర్యాదులను నమోదు చేసే ప్రక్రియ, వినియోగదారులకు వారి హక్కుల గురించిన అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. ఇందుకోసం వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫండ్ నుంచి నిధులు ఉపయోగించవచ్చని మాథ్యూస్ చెప్పారు.



అవాంఛిత కాల్స్‌పై కస్టమర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉంచినవి, పూర్తి వివరాలు లేనందువల్ల తిరస్కరించినవి, విచారణ తర్వాత సహేతుకమైనవిగా పరిగణనలోకి తీసుకున్నవి తదితర అంశాలతో టెలికం సంస్థలు ప్రతి నెలా నివేదిక సమర్పించాలంటూ ట్రాయ్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇది ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి అమల్లోకి వస్తోంది.

## అయిదు నిమిషాల్లోనే బ్యాటరీ చార్జింగ్

- ఆటోను అభివృద్ధి చేసిన అదరిన్ ఇంజనీరింగ్
- అక్టోబరు నుంచి భారత్‌లోకి...



సౌరభ్ మార్కండేయ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** భారత ఆటోమొబైల్ రంగంలో ఇప్పుడు 'ఎలక్ట్రిక్' హాట్ టాపిక్‌గా మారింది. ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఉన్న కంపెనీలు అధిక సామర్థ్యమున్న బ్యాటరీల తయారీపై ఫోకస్ చేశాయి. ఈవీ టెక్నాలజీలో ఉన్న సింగపూర్ సంస్థ షాడో గ్రూప్ అనుబంధ కంపెనీ అయిన బెంగళూరుకు చెందిన అదరిన్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ ఓ అడుగు ముందుకేసి అల్ట్రా కెపాసిటర్ బ్యాటరీని అభివృద్ధి చేసింది. అయిదు నిమిషాల్లోనే చార్జింగ్ పూర్తి అవడం దీని ప్రత్యేకత. ఎరిక్ పేరుతో రూపొందించిన త్రిచక్ర వాహనానికై ఈ బ్యాటరీని తయారు చేశారు. బ్యాటరీని ఒకసారి చార్జింగ్ చేస్తే వాహనం 70 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్ ఈ టెక్నాలజీని ధ్రువీకరించింది. అంతేకాదు 10 ఏళ్ల పాటు మన్నుతుందని స్పష్టం చేసిందని షాడో గ్రూప్ కో–సీఈవో సౌరభ్ మార్కండేయ సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధికి వెల్లడించారు. డీజిల్ వాహనంతో పోలిస్తే ఖర్చు 25–30 శాతం తగ్గుతుందని చెప్పారు.

### గంటకు 50 కిలోమీటర్ల వేగం..

ఎరిక్ బ్రాండ్‌లో ప్యాసింజర్ వేరియంట్‌తోపాటు కార్గో రకం కూడా రూపొందించారు. ప్యాసింజర్ వాహనం గంటకు 50 కిలోమీటర్లు, కార్గో మోడల్ 40 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. కార్గోలో 550 కిలోల సరుకు రవాణా చేయవచ్చు. రెండు రకాల బ్యాటరీలను అందుబాటులోకి తెచ్చామని సౌరభ్ మార్కండేయ తెలిపారు. 'అల్ట్రా కెపాసిటర్ బ్యాటరీ జీవిత కాలం 10 ఏళ్లు. ధర రూ.4 లక్షలు. లిథియం అయాన్ బ్యాటరీ జీవిత కాలం రెండున్నరేళ్లు. చార్జింగ్‌కు 8 గంటలు పడుతుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 80–100 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు. ధర రూ. లక్ష ఉంది. అల్ట్రా కెపాసిటర్ అభివృద్ధికి రెండేళ్లు పట్టింది. ఈ మోడల్ వాహనాలు ఇండోనేషియాకు ఎగుమతి చేయనున్నాం. భారత్‌లో క్యాబ్ అగ్రిగేటర్లు, లాజిస్టిక్స్ కంపెనీలతో మాట్లాడుతున్నాం. 2019 అక్టోబరు నుంచి మార్కెట్లో వాహనం అందుబాటులో ఉంటుంది' అని చెప్పారు. పుణేలో ఉన్న ప్లాంటు కోసం షాడో గ్రూప్ రూ.70 కోట్లు వెచ్చిస్తోంది.

# ఆర్థిక వ్యవస్థకు మోదీ టానిక్!

### దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రధాని సమీక్ష

- మంత్రి నిర్మలా సీతారామన్, ఉన్నతాధికారులతో భేటీ
- అన్ని అంశాలపై సమగ్ర చర్చ
- త్వరలో చర్యలకు అవకాశం

**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక రంగ పరిస్థితిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించిన తర్వాత ప్రధాని నేరుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మందగమన పరిస్థితులు ఒకదాని తర్వాత మరో రంగానికి వేగంగా విస్తరిస్తుండడం, ఉద్యోగాలు, సంపదకు విఘాతం కలుగుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని ఈ సమీక్ష నిర్వహించడం గమనార్హం. ఆర్థిక మందగమనానికి సహజ కారణాలు, దీర్ఘకాలిక ప్రభావాన్ని అంచనా వేయడానికే ఈ భేటీ జరిగినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. రంగాలవారీగా ఉద్దీపన చర్యలను ప్రభుత్వం ప్రకటించవచ్చన్న అంచనాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. దేశ జీడీపీ వృద్ధి 2018–19లో 6.8%కి తగ్గిపోగా, 2014–15 తర్వాత ఇదే అత్యంత కనిష్ట స్థాయి. వినియోగ విశ్వాసం క్షీణిస్తుండడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కుంగుదల వంటి అంశాలు ప్రభుత్వాన్ని సైతం ఆందోళనకరం. అంతర్జాతీయంగా అమెరికా–చైనా మధ్య ముదిరిన వాణిజ్య, కరెన్సీ యుద్ధం పరిస్థితులను మరింత ప్రతికూలంగా మారుస్తోంది. అయితే, ప్రభుత్వం నుంచి ఇతమిద్ధంగా ఈ చర్యలు ఉంటాయన్న స్పష్టత అయితే ఆర్థిక శాఖ ఇంత వరకు వ్యక్తపరచలేదు. గత 2 వారాల వ్యవధిలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకర్లు, వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు నిర్వహించడంతోపాటు ఆర్థిక రంగ వృద్ధికి అవరోధంగా ఉన్న అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం నుంచి త్వరలోనే చర్యలు ఉంటాయని ఆ సందర్భంగా పారిశ్రామిక వేత్తలకు హామీ కూడా ఇచ్చారు. దీంతో ప్రభుత్వం ప్రకటించే చర్యల కోసం మార్కెట్లు, పారిశ్రామిక వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. ఆర్‌బీఐ సైతం తనవంతుగా రెపో రేట్లను కూడా మరోమారు తగ్గించింది.



## ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు

- వాహన రంగం అయితే గత రెండు దశాబ్దాల కాలంగా అత్యంత దారుణ పరిస్థితులను చవిచూస్తోంది. వాహనాల అమ్మకాలు ప్రతీ నెలా భారీగా తగ్గిపోతున్నాయి.
- కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల అమ్మకాలు 19 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. ఇప్పటి వరకు 300 డీలర్‌షిప్‌లు మూతపడ్డాయని, 2.30 లక్షల వరకు ఉద్యోగాలు పోయాయని అంచనా. ఆటో పరిశ్రమలో 10 లక్షల ఉద్యోగాలపై ప్రభావం పడినట్టు వాహన కంపెనీల సంఘం ప్రకటించింది.
- రియల్టీ పరిస్థితీ ఆశాజనకంగా లేదు. అమ్ముడుపోని ఇళ్లు భారీగానే ఉన్నాయి.
- ఎఫ్ఎంసీజీ కంపెనీల అమ్మకాల వృద్ధి సైతం గతంలో పోలిస్తే జూన్ త్రైమాసికంలో తగ్గింది. హిందుస్తాన్ యూనిలీవర్ జూన్ క్వార్టర్‌లో అమ్మకాల పరంగా కేవలం 5.5 శాతం పెరుగుదల నమోదు చేసింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో వృద్ధి 12 శాతంగా ఉంది. డాబర్ అమ్మకాల వృద్ధి సైతం 21 శాతం నుంచి 6 శాతానికి పరిమితం అయింది. బ్రిటానియా అమ్మకాల వృద్ధి 12% నుంచి 6 శాతానికి క్షీణించింది.
- ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో బ్యాంకుల నుంచి పరిశ్రమలకు రుణాలు అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 0.9%నుంచి 6.6%కి పెరగడం కాస్త ఆశాజనకం. కానీ, అత్యధికంగా ఉపాధి కల్పించే ఎంఎస్‌ఎంఈ రంగానికి మాత్రం రుణాల పంపిణీ 0.7 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు కేవలం 1.4 శాతమే పెరగ్గా, జీఎస్టీ వసూళ్లు జూలై వరకు 9% పెరిగాయి. 18% వృద్ధి సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

## కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 16-08-2019

| | |
|---|---|
| విశాఖ | 352–00 |
| చిత్తూరు | 348–00 |
| వరంగల్ | 334–00 |
| చెన్నై | 355–00 |
| ముంబై | 381–00 |
| విజయవాడ | 339–00 |
| నమక్కల్ | 355–00 |
| గోదావరి | 334–00 |
| 15–08–2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 331–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.90 |
| బెంగళూరు | 340–00 |
| కోల్‌కత్త | 380–00 |
| ఢిల్లీ | 338–00 |



ఒకవైపు మంచు దుప్పటి కప్పుకున్న హిమాలయ సానువులు.. వాటి కిందే నిర్మలమైన నీటి కొలను, ఇంకోవైపు హిమాలయాలను తాకేలా కనిపిస్తున్న పాలపుంత శోభిత నక్షత్ర మండలాలు.. చూపరుల మనసు పులకరించేలా తీసిన ఈ ఫొటో సైన్స్ ఫొటోగ్రాఫర్ అవార్డులు-2019కు నామినేట్ అయింది.

# 3 నిమిషాలకో.. మెట్రో!

జూబ్లీ చెక్‌పోస్ట్–హైటెక్ సిటీ రూట్లో అందుబాటులోకి రివర్సల్ సదుపాయం

సాక్షి, హైదరాబాద్

సిటీ జనానికి మెట్రో మరింత అందుబాటులోకి వచ్చింది.. ఇకపై ప్రతి మూడు నిమిషాలకో మెట్రో రైలు అందుబాటులోకి రానుంది. జూబ్లీ చెక్‌పోస్ట్–హైటెక్ సిటీ మార్గంలో మెట్రో రైలు రివర్సల్ సదుపాయం లేకపోవడంతో మొన్నటి వరకు 8 నిమిషాలకో రైలు నడిపారు. ఇప్పుడు రివర్సల్ సదుపాయం రావడంతో పీక్ అవర్స్‌లో 3 నిమిషాలు, నాన్‌పీక్ అవర్స్‌లో 5 నిమిషాలకో రైలు అందుబాటులోకి రానుందని మెట్రో వర్గాలు తెలిపాయి. కాగా మెట్రో సర్వీసులకు గ్రేటర్ సిటీజన్ల నుంచి ఆదరణ క్రమంగా పెరుగుతోంది. సరాసరిన ప్రతివారం ప్రయాణికుల సంఖ్యలో 5–6 వేల మేర పెరుగుదల నమోదవుతోంది. బుధవారం మెట్రో ప్రయాణికుల సంఖ్య 3.06 లక్షలకు చేరుకోవడం విశేషం. ఇక స్టేషన్లలో రద్దీని కలిపితే ప్రయాణికుల సంఖ్య 3.23 లక్షలకు చేరుకున్నట్లు హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఎల్బీనగర్–మియాపూర్ (29 కి.మీ.), నాగోల్–హైటెక్ సిటీ (28 కి.మీ.) మార్గంలో మెట్రో రైళ్లు పరుగులు పెడుతున్నాయి. గురువారం హైటెక్ సిటీ, అమీర్‌పేట్, ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర స్టేషన్లు సైతం వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడాయి.



**మెట్రో రైళ్ల మధ్య అంతరం..**

| | |
|---|---|
| **8 నిమిషాలు..** ఇప్పటి వరకు ఇలా.. | **3 నిమిషాలు..** ఇకపై పీక్ అవర్‌లో.. |
| | **5 నిమిషాలు..** నాన్ పీక్ అవర్‌లో.. |

హైటెక్ సిటీ–రాయదుర్గం మైండ్‌స్పేస్ జంక్షన్ (1.1 కి.మీ.) మార్గంలో మెట్రో పట్టాలు, సిగ్నలింగ్, టెలీ కమ్యూనికేషన్స్, స్టేషన్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఈ నెలాఖరులో ఈ మార్గంలో మెట్రో రైళ్ల ట్రయల్ రన్ నిర్వహిస్తామని హెచ్‌ఎంఆర్ వర్గాలు తెలిపాయి.

ఎంజీబీఎస్–జేబీఎస్ (10 కి.మీ.) మార్గంలో ఈ ఏడాది డిసెంబర్‌లో మెట్రో రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మార్గంలో ఇప్పటికే మెట్రో పనులు, స్టేషన్లు, సిగ్నలింగ్, టెలీ కమ్యూనికేషన్స్, విద్యుదీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి.

హైటెక్ సిటీ మెట్రోస్టేషన్ బుధవారం 24 వేల మంది ప్రయాణికుల రాకపోకలతో సరికొత్త రికార్డు సృష్టించినట్లు హెచ్‌ఎంఆర్ అధికారులు తెలిపారు.

# చార్జీలు పెంచాల్సిందే!

- వేతనాల చెల్లింపుపై ఆర్టీసీ అధికారులు
- ప్రతిపాదించిన 15 శాతం పెంపునకు అనుమతించాలని ప్రభుత్వానికి వినతి
- వేతనాల చెల్లింపులో జాప్యం జరిగితే బస్సులాపేస్తామని కార్మికుల హెచ్చరిక

**సాక్షి, హైదరాబాద్:** బస్సు చార్జీలు పెంచితే తప్ప ఆర్టీసీ సిబ్బందికి వేతనాలు చెల్లించలేమని ఆ సంస్థ అధికారులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఈ నెల వేతనాలు చెల్లించే పరిస్థితి లేదని, ప్రతినెలా వేతనాలకు తీవ్ర ఇబ్బంది అవుతోందని వెంటనే చార్జీలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ 15 శాతం మేర చార్జీలు పెంచేందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఎన్నికలు పూర్తయినా ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవటం, గత నెల వేతనాలు చెల్లించేందుకు డబ్బులు లేక రెండో వారం ప్రారంభం వరకు దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొనటంతో అధికారులు మరోసారి ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. గతంలో తాము సమర్పించిన ప్రతిపాదనకు వీలుగా 15 శాతం చార్జీలు పెంచేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నందున ప్రభుత్వం నుంచి మరోసారి సానుకూల సంకేతాలు అందలేదు. ఆ ఎన్నికలు ముగిసే వరకు చార్జీల పెంపు అవకాశం ఉండకపోవచ్చని వారికి అనధికారికంగా సమాచారం అందింది. దీంతో అధికారుల్లో మళ్లీ గుబులు రాజుకుంది.

**పాత బకాయిలు రూ.500 కోట్లు ఇవ్వండి....**

బస్ పాస్‌లకు సంబంధించి ఆర్టీసీ నష్టపోయే మొత్తాన్ని ఆది నుంచి ప్రభుత్వం రీయింబర్స్ చేసే ఆనవాయితీ ఉంది. ప్రతినెలా దాదాపు రూ.60 కోట్ల వరకు ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి విడుదల అవుతాయి. వాటిని నెలనెలా కాకుండా మూడు నెలలకోమారు అందిస్తుంది. అయితే కొంతకాలంగా ఆ మొత్తం ప్రభుత్వం నుంచి సకాలంలో అందటం లేదు. అలా దాదాపు రూ.500 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్లు తేల్చారు. గత నెల జీతాలు చెల్లించేందుకు నిధులు లేకపోవటంతో ఈ మొత్తాన్ని విడుదల చేయాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. కానీ ఆ మొత్తం రూ.500 కోట్లు లేదని ఆర్థిక శాఖ అధికారులు పేర్కొంటూ దాదాపు రూ.180 కోట్ల బకాయిలు ఉన్నట్లు ఆర్టీసీ దృష్టికి తెచ్చారు. ముందుగా ఆ రూ.180 కోట్లైనా ఇవ్వాలని కోరగా, అంత డబ్బు ఇప్పటికిప్పుడు సర్దుబాటు చేయలేమంటూ ఆర్థిక శాఖ రూ.100 కోట్లు విడుదల చేసింది. వాటితో గత నెల వేతనాల సమస్య నుంచి ఆర్టీసీ గట్టెక్కింది. మరో పక్షం రోజుల్లో మళ్లీ వేతనాలు చెల్లించాల్సి ఉండటంతో ఇప్పటి నుంచే ప్రభుత్వాన్ని కోరటం మొదలుపెట్టింది. చార్జీల పెంపునకు అనుమతిస్తే వెంటనే దాన్ని అమలులోకి తెచ్చి వేతనాల సమస్య నుంచి బయటపడొచ్చని అధికారులు భావించారు. కానీ ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోకపోవటంతో మళ్లీ బకాయిల లెక్కలు తేల్చాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రస్తుత త్రైమాసిక మొత్తాన్ని చెల్లించన ఒదున ఆ మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. ఇప్పుడు ఆ నిధులు వస్తేనే వేతనాలు చెల్లించగలమని, లేకుంటే ఇబ్బందులు తప్పవని ముందస్తుగా ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు.

### ఆలస్యమైతే బస్సులాపేస్తాం

**కార్మిక సంఘాలు**

ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా గత నెల వేతనాలు దాదాపు పది రోజులు ఆలస్యంగా చెల్లించారు. దీంతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురై, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళన బాట పట్టాలని నిర్ణయించారు. చివరకు ప్రభుత్వం నుంచి రూ.100 కోట్లు బకాయిలు తెచ్చుకుని వేతనాలు చెల్లించటంతో తాత్కాలికంగా శాంతించారు. ఈ నెల కూడా అదే పరిస్థితి పునరావృతమైతే మాత్రం బస్సులాపేస్తామని తాజాగా హెచ్చరించారు. పరిస్థితి చూస్తుంటే సంస్థ కుదేలయ్యేలా ఉన్నందున వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, తమకు ఫిట్‌మెంట్ ప్రకటించకుండానే చేతులెత్తేసేలా ఉన్నారంటూ వారు పేర్కొంటున్నారు. దీంతో అధికారుల్లో టెన్షన్ మొదలైంది. ఈసారి వేతనాల చెల్లింపులో ఆలస్యమైతే కార్మికులను శాంతపర్చలేమని వారు ముందే ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.



# షార్ట్‌కట్‌లో కాలుష్యానికి చెక్!

వాయుకాలుష్యం పెరిగిపోతోంది.. బోలెడన్ని చెట్లు పెంచాలంటూ చాలా మందే చెబుతున్నారు.. కాలుష్యం తగ్గించేందుకు మనతోపాటు అనేక ఇతర దేశాలు ఏవేవో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. అయితే మెక్సికో కేంద్రంగా పనిచేస్తున్న ఓ స్టార్టప్ కంపెనీ ఈ సమస్యకు షార్ట్‌కట్ పద్ధతి కనుక్కుంది. ‘బయో అర్బన్ 2.0’పేరుతో ఈ కంపెనీ అభివృద్ధి చేసిన ఓ పరికరం గాలిలోని కాలుష్యాన్ని పీల్చేసుకుంటుంది. అందుకు తగ్గట్టు ఈ పరికరంలో మైక్రో ఆల్గే (నాచు)ను ఏర్పాటు చేశారు. ఒక్కో బయో అర్బన్ పరికరం ఏకంగా 388 చెట్లకు సమానమైన స్థాయిలో కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చేసుకుంటుంది. అదే సమయంలో స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది.

**గత వారం ఏర్పాటు..**

మెక్సికోలోని ప్యూబ్లా నగరంలో గతవారం తొలి ‘బయో అర్బన్ 2.0’ను ఏర్పాటు చేశారు. ఒక్కోటి 14 అడుగుల ఎత్తు, 3 మీటర్ల వెడల్పు ఉంటుంది. టన్ను బరువు ఉండే ఈ పరికరం ఒక్కటుంటే.. 2.5 ఎకరాల విస్తీర్ణంలో అడవి ఉన్నట్లు లెక్క. ఒక్కో పరికరం దాదాపు మూడు వేల మందికి సరిపడా గాలిని శుభ్రం చేస్తుంది. చుట్టూ ఉన్న గాలిని మోటార్ల సాయంతో నాచు మొక్కలున్న ట్యాంకర్‌లోకి పంపితే చాలు.. కాలుష్య కారక వాయువులను జీర్ణం చేసుకుని ఆ తర్వాత ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా వాయు కాలుష్యం కారణంగా దాదాపు 70 లక్షల మంది మరణిస్తుంటారని ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనా. తమ సాంకేతికత ద్వారా ఈ మరణాలు తగ్గుతాయని బయోమి టెక్ వ్యవస్థాపకుడు జామీ ఫెర్రర్ అంటున్నారు. నగరాల్లో ఎలాగూ మొక్కలు నాటే పరిస్థితుల్లేవు కాబట్టి.. ఫుట్‌పాత్‌లు, వృద్ధులు ఎక్కువగా ఉన్న చోట గాలిని శుభ్రం చేసేందుకు బయో అర్బన్ 2.0 ఉపయోగపడుతుందని వివరించారు. ఈ పరికరం ఏ రకంగానూ మొక్కలకు ప్రత్యామ్నాయం కాదని.. మొక్కలు పెంచడంతో పాటు వీటిని వాడుకోవడం మేలన్నది తమ అభిప్రాయమని ఫెర్రర్ స్పష్టం చేస్తున్నారు. మూడేళ్ల కిందట ప్రారంభమైన ఈ సంస్థ ఇప్పటికే 3 బయో అర్బన్ 2.0 పరికరాలను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. మెక్సికోలోని ప్యూబ్లా వీటిల్లో ఒకటి కాగా.. మిగిలిన రెండు కొలంబియా, పనామాలో ఉన్నాయి. టర్కీ దేశంలో ఇంకో రెండు పరికరాలను ఏర్పాటు చేసేందుకు బయోమీ టెక్ సిద్ధమవుతోంది. మెక్సికోలో మరిన్ని పరికరాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక్కో బయో అర్బన్ 2.0 ఖరీదు దాదాపు 50 వేల డాలర్లు.. అంటే రూ.35 లక్షల వరకు ఉండవచ్చు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

# పదోన్నతుల కోసం రేపు నిరాహార దీక్ష

**సాక్షి, హైదరాబాద్:** భాషా పండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ–టీ) అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా తెలిపారు. గురువారం ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అత్యవసర సమావేశం జరిగింది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని గ్రేడ్–2 పండిత్, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో 15 విడుదల చేసిందని అబ్దుల్లా తెలిపారు. సీఎం కేసీఆర్ వ్యక్తిగత శ్రద్ధ వహించి జీవో విడుదల చేసినా.. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల అమల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం సత్వరమే జీవో 11, 12లను సవరించి భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్‌యూపీపీటీ, పీఈటీఏటీఎస్ అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# 68 ప్రశ్నలతో టాప్!

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఎంపీ అసదుద్దీన్ రికార్డు
- ఒక్క ప్రశ్న కూడా అడగని పసునూరి దయాకర్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం) బడ్జెట్ సమావేశాల్లో హైలైట్‌గా నిలిచారు. తన పార్టీ పక్షాన పలు చర్చల్లో పాల్గొన్న ఆయన ఏకంగా 68 ప్రశ్నలు అడిగి కేంద్రం నుంచి సమాధానాలు రాబట్టారు. రాష్ట్రానికి చెందిన ఎంపీల్లో ఆయనే అత్యధికంగా ప్రశ్నలు అడగ్గా, దేశంలోనే అతి తక్కువ మంది ఎంపీలు అసద్‌తో సమానంగా బడ్జెట్ సమావేశాలను వినియోగించుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరిగే తీరును వివరించే పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న ప్రకారం దేశవ్యాప్తంగా కొత్తగా ఎన్నికైన ఎంపీల్లో 94 శాతం మంది ఈ సారి బడ్జెట్‌పై చర్చల్లో పాల్గొని ప్రశ్నలు వేశారు. ఈ వెబ్‌సైట్ వివరించిన ప్రకారం మొత్తం 6,197 ప్రశ్నలు ఈ బడ్జెట్ సమావేశాల్లో అడగ్గా.. కేంద్రం లిఖిత పూర్వక సమాధానమిచ్చింది. ఇందులో ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన 9 ప్రశ్నలు ఉన్నాయి. రాష్ట్రంలోని జాతీయ రహదారులు, మున్సిపాలిటీలకు నిధులు, ఎలక్ట్రానిక్ పార్కు, టూరిజం సర్క్యూట్, స్వదేశ్ దర్శన్‌లో తెలంగాణను చేర్చే అంశం, డ్యాంల భద్రత, ఆరోగ్య రంగం, కొత్త రైళ్ల ప్రతిపాదనలను మన ఎంపీలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

**మన సమస్యలు కేంద్రం దృష్టికి**

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మినహా అందరూ చర్చల్లో భాగస్వాములయ్యారు. ఇందులో అసదుద్దీన్ ఒవైసీ అత్యధికంగా 68 ప్రశ్నలు వేశారు. టీఆర్‌ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు 11 ప్రశ్నలు వేసి 5 చర్చల్లో పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి కూడా 3 అంశాల్లో చర్చలో పాల్గొన్నారు. జీరో అవర్‌లో భాగంగా ఆయన కంటోన్మెంట్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావిస్తూ కంటోన్మెంట్ బోర్డు, అక్కడి ప్రజలతో సమావేశం ఏర్పాటు చేయించాలని కోరారు. బడ్జె



ట్‌పై జరిగిన చర్చలో భాగంగా వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు, కేంద్రం రైతుకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీపై మాట్లాడారు. ఆ తర్వాత ఆదిలాబాద్ జిల్లాలో అటవీ అధికారిణిపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ పోడు వ్యవసాయం అంశాన్ని పరిష్కరించేలా రాష్ట్ర గవర్నర్‌ను ఆదేశించాలని కోరారు. పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌లు రాష్ట్రానికి చెందిన సమస్యలను లోక్‌సభలో ప్రస్తావించగా, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓ ఆసక్తికరమైన అంశాన్ని లేవనెత్తారు. దేశంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లోని రాష్ట్రాల మధ్య కాలమానంలో వ్యత్యాసం ఉందని, ఈ నేపథ్యంలో దేశంలో రెండు టైం జోన్లను ఏర్పాటు చేసే అవకాశంపై ప్రశ్నించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా మలేరియా నిర్మూలన, డ్రగ్స్ నియంత్రణ వ్యవస్థ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు తదితర అంశాలపై మాట్లాడారు. బీజేపీ ఎంపీలు బండి సంజయ్, సోయం బాపూరావులు కూడా బడ్జెట్ సమావేశాల్లో భాగంగా పలు అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు.

# నేటి నుంచి ఆరోగ్యశ్రీ బంద్

**ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్ణయం**

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వం నుంచి బకాయిలు అందకపోవడంతో ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలను శుక్రవారం నుంచి నిలిపేయాలని ప్రైవేట్ ఆస్పత్రులు నిర్ణయించాయి. ప్రభుత్వం నుంచి రూ.1,500 కోట్ల మేర బకాయిలు ప్రైవేటు ఆస్పత్రులకు అందాల్సి ఉన్నాయి. బకాయిల చెల్లింపులకు ప్రైవేట్ ఆస్పత్రుల సంఘం విధించిన గడువు గురువారంతో ముగిసింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి. పేదలకు ఉచితంగా వైద్యం అందించే ఉద్దేశంతో ఉమ్మడి ఏపీలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2007లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద ప్రతీ కుటుంబానికి రూ.2 లక్షల మేరకు వైద్యం అందుతుంది. 240 ప్రైవేటు, 96 ప్రభుత్వాస్పత్రుల్లో 940కుపైగా వ్యాధులకు ఈ పథకం కింద పేదలకు వైద్య సేవలు అందుతున్నాయి. ‘బకాయిలను చెల్లించాలంటూ ప్రభుత్వానికి మేం చాలాసార్లు మొరపెట్టుకున్నాం. కానీ ప్రభుత్వం స్పందించలేదు. ఇలా అయితే వైద్య సేవలు అందించడం కష్టం. ఆర్థికంగా మా మీద చాలా భారం పడుతోంది’ అని ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం నేతలు చెబుతున్నారు. వైద్య సేవలను నిలిపేస్తామంటూ ప్రైవేట్ ఆస్పత్రులు హెచ్చరించడం ఇదే మొదటిసారి కాదు. బకాయిలను చెల్లించాలన్న డిమాండ్‌తో గత నవంబర్‌లో ప్రైవేట్ ఆస్పత్రులు ఆందోళనకు దిగాయి. బకాయిల మొత్తం ఇప్పటికే రూ.1,500 కోట్లకు చేరిందని సంఘ నేతలు అంటున్నారు. ఇటీవల రూ.200 కోట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. కానీ ఆందోళనకు వెళ్లకుండా ఉండాలంటే బకాయిల్లో కనీసం 70 శాతమైనా చెల్లించాలని ప్రైవేట్ ఆస్పత్రులు పట్టుబడుతున్నాయి. కాగా, శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు చర్చలు రావాల్సిందిగా మంత్రి ఈటల రాజేందర్ ఆస్పత్రుల యాజమాన్యాల సంఘాన్ని ఆహ్వానించారు.

# కొత్తగూడెం కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా అనిల్

**సాక్షి, హైదరాబాద్:** కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వనమా వెంకటేశ్వర్‌రావు టీఆర్‌ఎస్‌లోకి వెళ్లడంతో కాంగ్రెస్ ఇన్‌చార్జి స్థానం ఖాళీ అయింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసేందుకు అనిల్‌ను సమన్వయకర్తగా నియమిస్తున్నట్టు పేర్కొన్నారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792